సంపుటి : 9
సంచిక : 1
పుటలు : 52
రు. 25లు
ISSN NO: 2582-8738
యు.జి.సి. గుర్తింపు పొందినది

ఉగాది శుభాకాంక్షలు

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి 2023

## 2023 ఫిబ్రవరి 21 ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ, తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ పుట్టిన రోజు







భారతీయ అమ్మనుడులకు ముఖ్యంగా రెండు తెలుగురాష్ట్రాల నవతరం విజ్ఞాన వికాసాలకు ముంచుకొస్తున్న ముప్పును ఎదుర్కొనడానికి సరికొత్త కార్యక్రమాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రకటించింది.

**తెలుగుజాతి యువతరం భవిష్యత్తు కోసమే తెలుగు భాషోద్యమం**

ప్రాథమిక విద్యాబోధన అమ్మనుడులలోనే జరగాలి. ఇదే భాషోద్యమాల సమీప లక్ష్యం కావాలి

# అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం 21-02-2023
## విజయవాడ పి.బి.సిద్ధార్ధ కళాశాల సభామందిరం. మధ్యాహ్నం 3 గం.



స్వాగత ప్రసంగం చేస్తున్న
కార్యక్రమ నిర్వాహకులు
డా. మొవ్వా శ్రీనివాసరెడ్డి



మధ్యాహ్నం 3 గం.లకు విద్యార్థులకోసం ప్రత్యేకంగా జరిగిన సభలో
సమాఖ్య గౌరవాధ్యక్షులు డా.సామల రమేష్‌బాబు ప్రసంగిస్తున్న దృశ్యం



విద్యార్థులనుద్దేశించి
ప్రసంగిస్తున్న ఆత్మీయఅతిథి
ఫాదర్.డా.జి.ఏ.పి.కిషోర్
ప్రిన్సిపాల్,ఆంధ్ర లొయోలా కళాశాల



ప్రసంగిస్తున్న సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు



ప్రసంగిస్తున్న ఆత్మీయ అతిథి ఆచార్య
జోగాసింహ్ (పంజాబ్ యూనివర్శిటీ)



ప్రసంగిస్తున్న ఆత్మీయ అతిథి
ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం



ప్రసంగిస్తున్న ఆత్మీయ అతిథి
శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు
విశ్రాంత ఐ.ఏ.యస్



ప్రసంగిస్తున్న తెలుగు సాంకేతిక
నిపుణుడు శ్రీ వీవెన్



ప్రసంగిస్తున్న
డా. గుంటుపల్లి శ్రీనివాస్
వైద్యశాస్త్ర సహాయాచార్యులు



మాతృభాషాదినోత్సవం పూర్వాపరాలను
వివరించి,యునెస్కో సందేశాన్ని
తెలియజేస్తున్న శ్రీ రెహ్మానుద్దీన్ షేక్





కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల స్థాయి విద్యార్థినులు,విద్యార్థులలో కొందరు

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




మార్చి 2023

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి editorammanudi@gmail. com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. హామీపత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | ప్రాథమిక విద్యాబోధన .... | ............... | 07 |
| **మాతృభాషా దినోత్సవం** | 2023 ఫిబ్రవరి.... | ........... | 09 |
| **తెలుగు భాషోద్యమ సమాఖ్య:** | 20వ వార్షికోత్సవ .... | .................... | 21 |
| **పుస్తకావిష్కరణ:** | అమ్మనుడి సంపాదకీయాల...... | ...................... | 26 |
| **తె.భా.సమాఖ్య :** | సరికొత్త కార్యక్రమం,...... | ......................... | 28 |
| **సాంకేతికత:** | సెమాంటిక్ వెబ్-3... | శ్రీగణేష్ తొట్టెంపూడి | 31 |
| **మాండలికాలు:** | రాయలసీమ మాండలీకం.... | శ్రీనివాస్ అంకే | 32 |
| **గిరిజన విజ్ఞానం:** | గిరిజనుల సంస్కృతికి.... | శ్రీమంతుల దామోదర్ | 34 |
| **అనువాదం:** | అనువాదం నాదు,.... | హరిబండి లక్ష్మి | 37 |
| **వారసత్వ సంపద:** | పాడవోయి ప్రగతి...... | పి.శివరామకృష్ణ'శక్తి' | 38 |
| **ధారావాహిక:** | అడుగుజాడలు-ఆనవాళ్లు.. | ఈమని శివనాగిరెడ్డి-స్థపతి | 49 |
| **పుస్తక సమీక్ష:** | భారత దేశంలో విదేశీ...... | ఎం.వి.శాస్త్రి | 44 |
| **బాలసాహిత్యం:** | బాలసాహిత్య కథలు........ | టి.వి.రామకృష్ణ | 45 |
| **వెలిసిపోతున్న పదాలు:** | శషభిషలు | జి.వి.పూర్ణచంద్ | 48 |
| **ఉగాది:** | కే.శే.సురవరం ప్రతాపరెడ్డి గారి రచన | .......... | 49 |



| ముఖచిత్రం,లోపలి ఫొటోలు | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| తమ్మా శ్రీనివాసరెడ్డి | సరసి,శేఖర్ | యస్.రాజారావు |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : 9848016136 e-mail : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు
చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

**బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు**

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ QRకోడ్‌ను స్కాన్ చేసి లేదా QRకోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులకు సూచనలు**

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

**ప్రకటన**

అనివార్య కారణాలవల్ల ఈ సంచికను ప్రచురించడంలో ఆలస్యమైనందుకు మన్నించకోరుతున్నాను. ఏప్రిల్ 2023 సంచికను ప్రచురించలేకున్నాము. తిరిగి మే 2023 సంచికను ఎప్పటివలనే మే1వ తేదీనాటికే ప్రచురించగలము. పత్రిక చదువరులు దయతో సహకరించగోరుచున్నాము

రచయితలు తమ రచనలను ఏప్రిల్ 15వ తేదీలోపుగా పంపించగోరుతున్నాము. -ప్రచురణకర్త

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**




STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF **"AMMANUDI",** MONTHLY MAGAZINE, **Tenali** as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

## FORM IV (See Rule 3)

| | | |
|---|---|---|
| 1. Place of Publcation | : | Angalakuduru |
| 2. Periodicity | : | Monthly |
| 3. Printer's Name | : | SAMALA LAKSHMANA BABU |
| 4. Whether Citizen of India | : | Yes |
| 5. Address Post, | : | D.No.8-386, Angalakuduru Tenali Mandal - 522 211 Guntur Dist., A.P. |
| 6. Publishers Name | : | SAMALA LAKSHMANA BABU |
| Address | : | As above |
| 7. Editor's Name | : | SAMALA RAMESH BABU |
| Address | : | As above |
| 8. Names & Addresses of individuals who own the News Paper | : | SAMALA LAKSHMANA BABU As above |

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Tenali
28-2-2022

sd/- S. Lakshmana Babu
Publisher




ఆంధ్రజ్యోతి 01-03-2023 విజయవాడ

01-03-2023

# అట్టడుగున ప్రాథమిక విద్య

- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చివరి వరసలో ఏపీ
- మౌలిక వసతులున్నా విద్యలో వెనుకబాటు
- అభ్యసన ఫలితాలూ అతంతమాత్రమే
- కేంద్రం నివేదికలో అత్యల్ప స్కోరు
- పనితీరు బాగాలేదని వెల్లడి
- మన రాష్ట్రం కంటే బిహార్ ముందంజ
- అయినా అద్భుతమంటున్న జగన్ ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక విద్యలో అద్భుత ఫలితాలు సృష్టిస్తున్నామంటూ జగన్ ప్రభుత్వం చెబుతున్న గొప్పలన్నీ ఒట్టివేనని తేలిపోయింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రాథమిక స్థాయి (ఫౌండేషన్ లెవల్) విద్యలో ఆంధ్రప్రదేశ్ చివరి వరుసలో నిలిచింది. ఫౌండేషనల్ లెర్నింగ్ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం బహిర్గతమైంది. బిహార్ లాంటి రాష్ట్రాలు కూడా ప్రాథమిక విద్యలో ఏపీ కంటే ముందున్నాయి. ప్రాథమిక, ప్రీ ప్రైమరీ స్థాయి విద్యపై కేంద్రం అధ్యయనం చేసి ఈ నివేదిక రూపొందించింది. రాష్ట్రాలను చిన్న, పెద్ద రాష్ట్రాలుగా విభజించి ఎఫ్ఎల్ఎన్ స్కోరు, ర్యాంకులు కేటాయించింది. చిన్న రాష్ట్రాల కేటగిరిలో 11 రాష్ట్రాలకు గాను ఆంధ్రప్రదేశ్ పదో స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ఉన్న పంజాబ్ 64.19 స్కోరు సాధించగా, ఏపీ కేవలం 39.02 స్కోరుతో సరిపెట్టుకుంది. మొత్తంగా పెద్ద, చిన్న రాష్ట్రాలను కలిపి చూస్తే తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కంటే ఏపీ మెరుగ్గా ఉంది.



## ప్రాథమిక విద్య మిథ్య

వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక విద్యపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఎంతసేపూ నాడు-నేడు పథకంతో నిర్మాణాలు, సౌకర్యాలు అంటూ హడావిడి చేస్తున్న ప్రభుత్వం విద్యా ప్రమాణాలను గాలికొదిలేసింది. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా? లేదా? అనే విషయాన్ని పాఠశాల విద్యా శాఖ పట్టించుకోవడం లేదు. వేల సంఖ్యలో టీచర్ పోస్టుల ఖాళీలున్నా భర్తీ చేయకుండా విద్యార్థులు, టీచర్ల మధ్య నిష్పత్తిని పెంచుతూ వెళ్తోంది. ఈ విద్యా సంవత్సరంలో తరగతులను విలీనం చేయడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోయాయి. గతంలో సుమారు 8 వేల పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరంలో వాటి సంఖ్య 13 వేలు దాటింది. సబ్జెక్టు టీచర్లపై దృష్టి పెడుతున్నామని పదే పదే చెబుతున్న ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అంతంతమాత్రంగానే విద్య అందుతోంది. ప్రాథమిక స్థాయిలో మెరుగైన విద్య అందించలేకపోతే ఉన్నత పాఠశాలలకు వచ్చాక విద్యార్థులు సబ్జెక్టులను నేర్చుకోవడం కష్టమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వసతులుంటే చాలా?

జగన్ ప్రభుత్వం పాఠశాలల్లో విద్య కంటే మౌలిక సదుపాయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో పాఠశాలల్లో వసతులు మెరుగ్గా కనిపిస్తున్నా ఆశించిన ఫలితాలు రావట్లేదు. ఎఫ్ఎల్ఎన్ అధ్యయనంలో మౌలిక వసతులు, విద్యావకాశాలు, పిల్లల ఆరోగ్యం, అభ్యసన ఫలితాలు, పరిపాలన అంశాలను పరిశీలించగా మౌలిక వసతుల్లో మాత్రమే రాష్ట్రం మంచి ప్రతిభ చూపించింది. మౌలిక వసతుల్లో మొత్తంగా 61.95 స్కోరు సాధించింది. రాష్ట్రంలో పాఠశాలకు 93.47 శాతం విద్యుత్ సౌకర్యం, 80.06 శాతం తాగునీటి సౌకర్యం ఉంది. విద్యావకాశాల్లో 38.25 స్కోరు మాత్రమే సాధించింది. ప్రతి లక్ష మందికి 34 బడులుండగా, ప్రీస్కూల్ విద్యార్థుల శాతం 21.96 ఉంది. ప్రాథమిక స్థాయిలో 60 మంది విద్యార్థులకు ఒక్క టీచరే ఉన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఏపీ కేవలం 46.07 స్కోరు సాధించింది. కీలకమైన అభ్యసన ఫలితాల అంశంలో 30.56 స్కోరుతో సరిపెట్టుకుంది. మూడో తరగతి విద్యార్థులు సగటున భాషలో 32.31, గణితంలో 38.81 స్కోరు సాధిస్తున్నారు. ఐదో తరగతి విద్యార్థులు భాషలో 16.67, గణితంలో 24.07 స్కోరుతో వెనకబడ్డారు.

సంపుటి : 9 సంచిక : 1
**అమ్మనుడి**
మార్చి 2023

## సంపాదక హృదయం

### ప్రాథమిక విద్యాబోధన అమ్మనుడులలోనే జరగాలి. ఇదే భాషోద్యమాల సమీప లక్ష్యం కావాలి.

2009 జులై 21న సుప్రీంకోర్టు ఒక తీర్పునిచ్చింది. 1994లో కర్నాటక రాష్ట్రం తమ అధికార భాషైన కన్నడాన్ని కాపాడుకోవడం కోసం పాఠశాల విద్యారంగానికి సంబంధించి కొన్ని చర్యల్ని తీసుకొంది. తమ పరిపాలనా పరిధిలోని ప్రైవేటు పాఠశాలలతోసహా అన్ని పాఠశాలల్లో 1నుండి 4 వ తరగతి వరకు తప్పనిసరిగా కన్నడ మాధ్యమంలోనే బోధించాలని, తమఆదేశాలను పాటించని పాఠశాలలకు గుర్తింపును,తదితర సౌకర్యాలను రద్దు చేస్తాం అనేది ఆ ఉత్తర్వుల సారాంశం. ఆ పాఠశాలల యజమానులంతా ఒక సంఘంగా ఏర్పడి, ఆ ఉత్తర్వును సవాలు చేస్తూ న్యాయస్థానం తలుపులు తట్టగా రాష్ట్ర హైకోర్టు ఆ ఉత్తర్వును రద్దుచేసింది. ప్రభుత్వం సుప్రీంకోర్టుదాకా వెళ్ళింది. దానిపై సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పును సమర్థిస్తూ 2009 జులైలో తీర్పు వెలువరించింది. ఆ తీర్పులో కర్నాటక ప్రభుత్వ ఉత్తర్వు రాజ్యాంగంలోని సమానతా సూత్రానికి వ్యతిరేకమని తేల్చి చెప్పింది.

ప్రభుత్వం తరపున ప్రఖ్యాత న్యాయవాది పి.పి.రావు (పవని పరమేశ్వరరావు) గారు వాదించారు. ఆయన రాజ్యాంగంపై సాధికారత గలవారుగా ప్రఖ్యాతి.మన పత్రిక నడుస్తున్న చరిత్ర (నేటి 'అమ్మనుడి'కి నాటి రూపం) అభిమాన పాఠకులు కూడా. ఇప్పుడు ఆయన కీర్తిశేషులు. తీర్పువచ్చిన తర్వాత కొన్నాళ్ళకు నేను ఆయనను హైదరాబాద్‌లో కలిసినప్పుడు ఈ తీర్పుగురించి ప్రస్తావన వచ్చింది.ఆయన ఇలా చెప్పారు: "రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలతోపాటు, నేను శాస్త్రీయమైన అభిప్రాయాలను కోర్టు ముందుంచాను. ప్రాథమికవిద్య మాతృభాషలో ఉండాలనేది సార్వత్రిక, సహజ విధానం. దాని కనుగుణంగానే ప్రభుత్వ విధానం ఉంది అని అని చెప్పాను. కోర్టువారు ఈ అంశాన్ని ప్రక్కనపెట్టి, మరో విధంగా ఆలోచించారు.'దీన్ని సాధించుకోవడానికి ఉద్యమాలు చెయ్యడమేకాదు, సామాన్యప్రజలను – ముఖ్యంగా నిరక్షరాస్యులుగానో, సాధారణ చదువులతోనో ఉన్నవారిని, సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగు వర్గాలను ప్రభావితం చెయ్యాలి. దానితోపాటు రాజ్యాంగంలో కొన్ని సున్నితమైన మార్పులు చేసుకోవలసివుంటుంది. ఇవి ఎంతో చర్చను, శోధనను సాగించి చెయ్యాల్సినవి అన్నారు". తర్వాత కర్నాటక రాష్ట్రప్రభుత్వం మళ్ళీ మిన్నకున్నది.అప్పటినుంచి ఈ అంశంపై ఏదో ఒక చర్చ పలుస్థాయిల్లో దేశంలో జరుగుతూనే వుంది.

2000 సంవత్సరంలో 'యునెస్కో' ప్రపంచంలోని వేలాది భాషాజాతుల్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చింది. అప్పటినుండి ప్రతియేటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని యునెస్కో పిలుపునిచ్చి, ఒక ప్రధానాంశాన్ని ప్రపంచ ప్రజల ముందుంచుతున్నది. ఆ మొత్తం సందేశాలన్నిటిసారం ఇదీ.ప్రపంచంలోని అన్ని భాషాజాతులు తమ మాతృభాషలను రక్షించుకోవాలి. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికీ, వేలఏళ్ళ మానవచరిత్రలోని వారసత్వ విజ్ఞానాన్ని రక్షించుకోవడానికీ ఇదే మూలసూత్రం. ఆధునిక నాగరికతలో పరిణామాల వల్ల, ఆధిపత్య భావజాలాలవల్ల ఈ ప్రధానలక్ష్యం దెబ్బతినకూడదు. అవసరాన్ని బట్టి ప్రతివ్యక్తీ తన భాషనేకాక మరి 2,3 భాషలనైనా నేర్చుకోవాలి. అదే సమయంలో తన మాతృభాషను, వారసత్వ సంపదను రక్షించుకోవాలి.

ఈసందేశాల్లో అశాస్త్రీయత ఏమైనా ఉన్నదా! అధిపత్యవాదాన్ని ఎదుర్కొంటూ ప్రపంచభాషాజాతులంతా వారు గిరిజనులైనా, పీడిత తాడిత జాతులైన,ఆర్థికంగానో ఇతరత్రానో బాగా ఎదిగామనుకొంటున్నవారయినా తలొగ్గవలసిన ఏకాత్మక సందేశాలవి.

ఇలాంటి కార్యక్రమం ఎన్నో సవాళ్ళను ఎదుర్కొనవలసి ఉంటుంది.ఏ రూపంలో ఉన్న ఆధిపత్యభావజాలమైనా, ఏకాత్మక మానవదృక్పథానికి ఆధారమైన మాతృభాషల సంరక్షణ కోసం జరిగే ఉద్యమాలను ఎదుర్కొనలేదు. మన దేశంలో, మన మాతృభాషల విషయంలోనైనా అంతే. భారతదేశంలో ఉన్న భాషావైవిధ్యాన్ని కాపాడుకోవాలని అనుకొన్నప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురౌతుంది.

దేశ భౌతిక సరిహద్దులను కాపాడుకోవడంతోపాటు,దేశ ప్రజలంతా భారతపౌరులని భావించి, అందరిక్షేమాన్ని కాంక్షించి విధానాలను నిర్ణయించుకోవాలి. ఎటువంటి లక్ష్యమూ లేక, కేవలం ఆధికారాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని ఆలోచించడం దేశానికి అపకారం చేసినట్లే అవుతుంది.మన రాజ్యాంగ సూత్రాలే చెప్పినట్లు దేశంలోని వైవిధ్యాలను గౌరవించాల్సిందే, కాపాడుకోవలసిందే. అందులో భాషావైవిధ్యం ప్రధానమైనది. దాని ద్వారానే తోటి మనుషుల

## సంపాదక హృదయం

ఆత్మగౌరవాన్నీ, జీవనాన్నీ కాపాడుకోగలం. భాషకూ సంస్కృతికీ సంబంధంలేదని కొందరు వితండవాదాన్ని చెయ్యవచ్చుగాని, అది అంతగా నిలిచేది కాదు. ప్రపంచ పెట్టుబడిదారీ అవసరాలను, ఆదర్శాలను కాపాడుకోవాలన్నప్పుడు, ఆదే ఆధునిక నాగరికత అనుకొన్నప్పుడు, ఆదే మానవసంస్కృతి అనుకొన్నప్పుడు ఇటువంటి మానవ విలువలు వారి మనసుల్ని మూసివేస్తాయి. బుర్రల్ని ఒకవైపుకే తెరిచిఉంచుతాయి.

కనుక–మనం ఖచ్చితంగా చెప్పేది ఏమిటంటే, మనుషులందరి భాషల విలువ ఒక్కటే. ఈ ఆధునిక పరిణామగతిలో మన భాషనూ, మన చుట్టూవున్న మానవజాతులందరి భాషలనూ కాపాడుకుంటేనే మానవవిలువలు కాపాడబడతాయి. మన దేశ రాజ్యాంగం దీనికి వ్యతిరేకం కాదు.

ఎవరి మాతృభాషలో వారు చదువుకొనడానికి ప్రతివారికీ సహజహక్కుఉంది. తమ భాషలోనే పరిపాలించుకోవడానికి, న్యాయస్థానాల్ని నడుపుకోవడానికీ వారికి పూర్తి ఆవకాశం ఉండాల్సిందే.

భారతదేశంలాంటి బహుభాషా, బహుళ సంస్కృతి,జీవన విధానాలున్న దేశంలో కూడా ఇవి సాధ్యమే.సాధ్యమయ్యేట్లు చేసుకోవాలి. ఆదే పార్టీల,ప్రభుత్వాల బాధ్యత.ఇది రాజ్యాంగ వ్యతిరేకం కాదు.రాజ్యాంగం సూత్రాలను చెబుతుంది. వాటికనుగుణంగా మనం పరిపాలనను తీర్చిదిద్దుకోవాలి.

మాతృభాషల అమలు– దేశ సమైక్యత పరస్పర వ్యతిరేక అంశాలు కావు.అలా చూస్తున్నవారి మెదడులో ఏదో లోపమున్నట్లేలెక్క. అదే సమయంలో సుప్రీంకోర్టు ఫలానా ప్రభుత్వాదేశం, చట్టం రాజ్యాంగ వ్యతిరేకం అని భావించినప్పుడు అటువంటి రాజ్యాంగ సూత్రాలను తగువిధంగా సవరించే అవకాశం ఉండనే ఉంటుంది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వాలు స్పందించి తగు రాజ్యాంగ సంస్కరణలను తెచ్చే పని జరుగుతూనే ఉంది కదా.

కన్నడ రాజ్య ఆదేశాలపై సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతోపాటు ఇక్కడ మరొక సందర్భాన్ని కూడా మనం గుర్తుకు తెచ్చుకోవాలి. ఇంచుమించు ఆ సమయంలోనే, సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. ప్రభుత్వవాదనలను విన్న తర్వాత కోర్టువారు వ్యాజ్యాన్ని తిరస్కరించారు. కారణం ప్రభుత్వ నిర్ణయం ఒక విధానపర నిర్ణయం అనీ, దాన్ని ప్రశ్నించేందుకు అనుమతించబోమనీ. ఇంతకూ తె.భా.స కోరుతున్నదేమిటి?–ప్రాథమిక స్థాయి విద్యలో మాతృభాషలోనే బోధన ఉండాలని.

ఇక్కడే మరొక సంగతిని కూడా గుర్తుకు తెచ్చుకుందాం. తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించిన వెంటనే అప్పటికి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా వున్న మండలి బుద్ధప్రసాద్‌గారు శాసనమండలిలో ఒక ప్రైవేటు బిల్లును ప్రతిపాదించారు. ప్రాథమిక విద్యలో తెలుగు బోధనాభాషగా ఉండాలని. రెండు రోజులపాటు చర్చలుజరిగిన తర్వాత సంబంధిత మంత్రి సమాధానమిస్తూ–మాధ్యమభాషగా తెలుగును తప్పనిసరి చేయడానికి ప్రభుత్వం వ్యతిరేకమని–మీరు బిల్లును ఉపసంహరించుకొంటానంటే 10వ తరగతి వరకూ తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాలని ఉత్తర్వులివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నది అని. ఇదైనా దక్కుతుంది గదా అని, అప్పటికి మంత్రిగారి మాటను ఒప్పుకోవడం జరిగింది. జి.ఒ నెం. 86/2003 అలా వచ్చిందే.

సుప్రీంకోర్టు తీర్పుపై స్పందిస్తూ 2009 జులై 26న ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ కె.శ్రీనివాస్ వ్రాసిన మాటల్ని ఇక్కడ ప్రస్తావిస్తాను: "భాషను రక్షించుకోవడం అంటే అదేదో అమాయక భాషాభిమానుల కాలక్షేపం కాదు. భాషను కాపాడుకోవడం అంటే దాన్ని మాట్లాడే ప్రజలను కాపాడుకోవటమే. ఆత్మను అమ్ముకునేవారికి తల్లిభాషపై మమకారం వుంటుందని ఆశించడం తప్పు. భాషీయుల సమగ్ర అభివృద్ధికోసం తపించేవారు, తమ ప్రత్యేకతను నిలుపుకుంటారు. పోషించుకుంటారు.సమైక్యంగా ఉండడానికి భాషనొక సాధనం చేసుకొని బేరమాడే శక్తిని పెంచుకుంటారు. మాతృభూమిని ప్రేమించినప్పుడే మాతృభాషనూ రక్షించుకోగలుగుతాము"

రాజ్యాంగాన్ని తగువిధంగా సవరించుకోవలసిన ఆవసరాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య గుర్తించి, నిన్న జరిగిన 20వ వార్షికోత్సవ సభల్లో ఒక తీర్మానం కూడా చేసింది. దానితోపాటు తక్కిన తీర్మానాలను–మొత్తం 10 తీర్మానాలనూ పరిశీలించినప్పుడు – సమాఖ్య ఈ అంశాన్ని ఎంతో సమగ్రంగా ఆలోచిస్తున్నదని మనకు అర్థమవుతున్నది. త్వరగా కార్యాచరణకు సన్నద్ధం కావాలి.

తేదీ:1 మార్చి 2023

సామల రమేష్ బాబు

# అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం
# తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవం
# 2023 ఫిబ్రవరి 21 మంగళవారం

## విద్యార్థుల ప్రత్యేక సమావేశం



అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంలో భాగంగా విద్యార్థులకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమం విజయవాడలోని పి.బి.సిద్ధార్థ కళాశాల సభామందిరంలో 2023, ఫిబ్రవరి 21 మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఘనంగా జరిగింది. దీనికి సమాఖ్య పెద్దలు, కొందరు భాషోద్యమ కార్యకర్తలు విచ్చేశారు. తొలుత సమావేశకర్త డా.గంధం సుబ్బారావు అందరికీ స్వాగతం పలికారు.

ఈ సభలో ఆంధ్రా లొయోలా కళాశాల, పి.బి.సిద్ధార్థ కళాశాల, దుర్గామల్లేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలతోపాటు వివిధ కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సభకు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి భాషాశాస్త్ర ఆచార్యులు ఆచార్య జోగాసింఘ్ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రత్యేకంగా విచ్చేశారు. సభలో విజయవాడ ఆంధ్ర లొయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జి.ఏ.పి.కిషోర్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. వారి ప్రత్యేక ప్రసంగాలను ఈ క్రింద చదవండి.



**కార్యక్రమ నిర్వాహకులు డా. మొవ్వా శ్రీనివాసరెడ్డి తన పరిచయ ప్రసంగంలో ఇలా అన్నారు.**



తెలుగు భాషోద్యమ ప్రాంగణంలోకి తొలిసారిగా విచ్చేసిన దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల,ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఆంధ్ర లొయోలా కళాశాల, ఎస్.ఆర్.ఆర్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు అభినందనలు. ఇక్కడున్న విద్యార్థులు ఉద్యమానికి ఎంత కొత్తవారో, నేను కూడా అంతే కొత్తవాణ్ణి. నేను చిన్ననాటి నుంచి ఎప్పుడూ తెలుగు మీడియంలో చదువుకోలేదు. సైనికపాఠశాలలో చదివాను.పిహెచ్ డి అయ్యాక ఆంధ్ర లొయోలా కాలేజిలో అధ్యాపకునిగా చేరితే, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాళ్ళు అమెరికా చరిత్రను తెలుగులో రాయమన్నారు. అమెరికా చరిత్ర గురించి తెలుగులో అంతకు మునుపు మాజీ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు వాశారు. కానీ యూనివర్శిటి వారు అడిగిన కోణం వేరు. అయితే దురదృష్టవశాత్తు నాకు తెలుగు బాగా రాదు. అదే విషయాన్ని యూనివర్శిటి అధికారులకు తెలిపాను. నాకొచ్చిన తెలుగు రాయమన్నారు. పి హెచ్ డి తర్వాత

నేను రాసిన అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర అనే పుస్తకాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రచురించింది. అది కూడా తెలుగులోనే. ఇక్కడ ముఖ్యవిషయం భావం. భావాన్ని వ్యక్తీకరించడానికి భాష కావాలి. ప్రస్తుతం మనభాషకు కష్టమొచ్చింది. కారణమెవరు అని తర్కించుకోవడం అనవసరం. లిపి కన్న ముందు భాషపుట్టింది. మాట్లాడిందే అక్షర రూపం దాల్చాయి. మాట స్వరూపం. మనిషి అవయవాల మాదిరి భాష కూడా జన్యుసంబంధమైనది. ప్రస్తుతం మార్కెట్లో దొరికే ప్రతి మందు పైనా ఇంగ్లీషులోనే వివరాలుంటాయి. మరి ఇంగ్లీషు మందులకన్న పూర్వం మనదేశంలో, మన ప్రాంతంలో ఆయుర్వేద మందులు దొరికేవి. మన ప్రాంతంలో తెలుగులోనే ఉండేవి. ఆచార్య నాగార్జునుడు, ధన్వంతరి, చరకుడు వంటి వారు భారతీయ భాషల్లోనే వాటికి పేర్లు నుడివారు. ఇంగ్లీషులో రాయలేదు. ఆ భాష అంతా ఏమైందో ఎవరికీ తెలీదు. మరి అందరూ ఇంగ్లీషులోనే మందుల వివరాలు ఎందుకు చదవాలి? వారు పరిపాలించారు కనుకనే ఆంగ్లేయులు వారి భాషని వ్యాప్తి చేశారు. దానివలననే అనేక భాషల జ్ఞానసంపద కోల్పోయారు. ఇదే పరిస్థితి ప్రపంచం మొత్తం ఉన్నదన్న విషయాన్ని, ప్రపంచ మాతృభాషా దినోత్సవ అవసరాన్ని గమనించాల్సి ఉంది. మన భాషకు ఇప్పటికే చాలా నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అతి పెద్ద ప్రళయం వచ్చే ప్రమాదముంది. ప్రపంచంలో ఎన్నో భాషలు మృతభాషలయ్యాయి. తెలుగుభాషకి కూడా ఆ ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థులు భాషకోసం నడుంబిగించాల్సి ఉంది.

**అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ**
**అమ్మనుడిలోనే**
**పాఠశాల విద్యను నేర్పుతారు**

**అమ్మనుడి సంపాదకుడు, భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డా. సామల రమేష్‌బాబు ఇలా అన్నారు:**



రెండు తెలుగు రాష్ట్రాల్లో భాష ఊపిరి ఆగిపోతోంది. తెలుగు అధికార భాషగా ఈ రెండు రాష్ట్రాలూ ఏర్పాటయ్యాయి. భాష ఆధారితంగానే జాతులు ఏర్పడ్డాయి. జాతి అంటే కులమో మతమో కాదు. భాషాజాతి అని అర్థం. కనుక మనం మన భాషని కోల్పోవడమంటే, మన అస్థిత్వాన్ని, మన ఉనికిని, కోల్పోయినట్లే. ఇది అతి ముఖ్యమైన విషయం. ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన మూలసూత్రం ఇది. మనం మన గుర్తింపు, మనుగడ కోల్పోయిన తర్వాత ఈ రాష్ట్రాలు ఉన్నా నిష్ప్రయోజనం. మీ భాష ఏమిటి అని భవిష్యత్తులో ఎవరైనా అడిగినప్పుడు తడుముకోవాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదముంది. ఆ దుస్థితి మన తెలుగు వారికి అవసరం లేదు. ఇప్పుడిప్పుడే కొంచెం గొంతెత్తడం ఆశాజనకం. మాతృభాషల ఉనికి ప్రశ్నార్థకమవుతోందని గుర్తించిన ఐక్యరాజ్యసమితి 2000 సం.లో మాతృభాషలను రక్షించుకోండని పిలుపునిచ్చింది. 2003లో మాతృభాషాదినోత్సవం నాడే తెలుగు భాషోద్యమ సమాఖ్యని ఏర్పాటుచేసుకున్నాం. భారతదేశంలో ఒక భాష పరిరక్షణకోసం నడుం బిగించి, ముందుకొచ్చి ఒక ఉద్యమ సంస్థను ఏర్పాటు చేసున్నవారు తెలుగు వారే, అది తెలుగు భాషోద్యమ సమాఖ్యే! అందుకే ఈ సంస్థ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరం ఉంది. మనిషి ప్రశ్నలతోనే బ్రతుకుతాడు. ఆయా ప్రశ్నలకు సమాధానంతోనే భాషకు మరింత ఊతమొస్తుంది. విద్యార్థులు ఉద్యమాన్ని భుజానికెత్తుకోవాలి. మాతృభాష పట్ల ప్రేమని విద్యార్థులు పెంపొందించుకొని భాషోద్యమంలో ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

**డా. అద్దంకి శ్రీనివాస్ రచించిన ఈ గీతాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవ వేదికపై ఆయన కుమార్తె వనీజ (7వ తరగతి విద్యార్థిని) శ్రావ్యంగా ఆలాపించారు.**



పలకండి పలకండి
తెలుగుపలుకులు
తెలుగు పలికితేనె కురుస్తాయి
తేనె చినుకులు

తెలుగులోన చదువు మనకు
పారే సెలయేరు
తెలుగులేని చదువు కాద?
ఎండమావి నీరు

తెలుగుబాట పూలబాట
ఎదుగుదలకు రాచబాట
తెలుగుజిలుగు లేని చోట
చీకటితో చెలిమేనట

తెలుగంటేనే వెలుగు
తెలుగుతోనె నువు వెలుగు
తెలుగులోనె మాట్లాడు
తెలుగుకొరకు పోట్లాడు

తెలుగు లేని తెలుగువాడు
ఎందులకూ కొరగాడు
తెలుగువాడు తెలుగువాడె
ఈ నేలను ఏలతాడు



## తెలుగు భాషోద్యమానికి బలం బలగమూ
## నేటి నవతరం యువత
### అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం



ఫిబ్రవరి 21, 2023 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగానూ తెలుగు భాషోద్యమ సమాఖ్య కొనసాగించిన ఉద్యమానికి నేటితో ఇరవై ఏండ్లు నిండిన సందర్భంగానూ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మాతృభాషా స్ఫూర్తితో ఈ సమావేశానికి వచ్చిన మీకందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు.

ప్రజాస్వామ్యంలో ఉన్నామని పదేపదే చెప్పుకొంటున్నాం. కానీ ప్రజలభాషలను పట్టించుకోం. ఇంకా, ప్రాథమిక విద్య మాతృభాషలలో ఉండేటట్లు చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది అని మన రాజ్యాంగంలో 350 అధికరణంలో చెప్పినదాన్నీ మన నేతలు పట్టించుకోరు. గత 50ఏండ్లనుంచీ ఐరాసవారు ప్రాథమిక విద్యను మాతృభాషలో మొదలుపెట్టాలని చెబుతున్నారు. ఎందుకంటే విద్య నేర్చుకోడానికేగాదు దానితో బాల్య సంరక్షణకూ గట్టిపునాది ఏర్పడుతుందని ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనా ఫలితాలను బట్టి చెబుతోంది. ప్రతి ఏటా ప్రతి సభ్యదేశానికీ ప్రత్యేకంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న దేశాలకూ వెనుకబడిన దేశాలకూ ప్రత్యేక సదస్సులనూ సమావేశాలనూ కార్యశాలలనూ ఏర్పాటుచేసి మాతృభాషా మాధ్యమ విద్యను ప్రోత్సహిస్తోంది. అయినా మన నాయకులు వోటు బ్యాంకు రాజకీయాలకే ఆసక్తి చూపుతున్నారు.

బడి భాషగా మాతృభాషలే ఉండాలి. అవి కార్పొరేట్ బడులైనా ప్రైవేటు బడులైనా ప్రభుత్వ బడులైనా. ప్రజాస్వామ్యంలో ప్రజల భాషలతోనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ఆంగ్లాన్ని నేర్చుకోవాలంటే ఒక భాషగా నేర్చుకోవాలి గానీ ఆంగ్ల మాధ్యమంతో కాదు. ఆంగ్ల మాధ్యమ చదువులతో కొందరి కడుపులే నిండుతాయి. ఏ విదేశాలూ మనవారికందరికీ ఉద్యోగాలు ఇవ్వవూ ఇవ్వలేవు. మన దేశంలో ఏడాదికి మూడున్నర కోట్లమందికిపైగా గ్రాడ్యుయేట్లు తయారవుతుంటే ఏ దేశం వీరందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. మన దేశంగాక. అలాగాక, ప్రభుత్వాలు ఆంగ్ల మాధ్యమాన్నే ప్రోత్సహిస్తుంటే, ప్రజలు ఒక క్రమపద్ధతిలో చావుకు లోనవుతున్నప్పుడు మానవ మారణకాండ జరుగుతున్నట్లే, భాషలను క్రమపద్ధతిలో చంపుతున్నప్పుడు భాషా మారణకాండ సంభవిస్తోందనేది నిజం. ఈ భాషా మారణకాండ మన ఉనికినే దెబ్బతీస్తోంది. ఆంగ్ల మాధ్యపు చీకటి మబ్బులు తెలుగు వెలుగును మసకబరచడం కనబడుతూనే ఉంది. తెలుగు రాష్ట్రాలలో అందుగంటిపోతున్న విద్యాప్రమాణాలే దీనికి సాక్షి. భారత రాష్ట్రాలన్నింటిలో అట్టడుగుకు జారిపోయిన తెలుగురాష్ట్రాల అక్షరాస్యత మరో సాక్షి. ఇంతకంటే ఇంకా ఏం కావాలి. మాతృభాషోద్యమం భావోద్వేగాల పోరాటం కాదు. తెలుగు సమాజపు ఉనికి కోసం, ఆర్థిక అభ్యున్నతికోసం, సమ సమాజం కోసం. భాషల్లో హెచ్చు తగ్గులూ పనికి రానివీ పనికొచ్చేవీ అనే తేడా ఉండదు. భాష మన వారసత్వ సంపద. మన భాషే మనకు గుర్తింపు. వేల ఏండ్ల తెలుగుజాతి జ్ఞాన సంపద, చరిత్ర, సంస్కృతులకు తెలుగే మూలం. ఇలాంటి అమ్మనుడుల పరిరక్షణే ధ్యేయంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య నడుంకట్టింది. గడిచిన ఇరవైయేండ్లలో ఎన్నో సాధక బాధకాలకు గురై సాధించినవి ఎన్నో ఉన్నా సాధించవలసినవీ మరెన్నో ఉన్నాయి. భాష కోసం ఈ ఉద్యమ పోరాటం రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకోసం.

ఈనాటి సమావేశంలో అతి ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొనడం తెలుగు భాషోద్యమ ప్రసంగ పరంపరల చర్చలలో పాల్గొనడమేకాక ప్రశ్నలెన్నింటినో సంధించి సమాధానాలను రాబట్టడం ప్రశంసనీయం. యువజనానికి అభినందనలు. ఇక్కడ చేరిన వందలాది నవతరం యువజనమే రేపటి తెలుగు భాషోద్యమ సమాఖ్యకు కొండంత బలం. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమంతో చేయి కలుపవలసినదిగా మీ అందరినీ స్వాగతిస్తున్నాను.




తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్యులు శ్రీ కె.టి.ఆర్‌కు "జగమునేలిన తెలుగు" పుస్తకాన్ని రచయిత్రి అనూరాధ బహూకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవసందర్భంగా ప్రభుత్వం నుండి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్నప్పుడు మంత్రిగారు పుస్తకాన్ని తీసుకుని ఆమెను అభినందించారు. తొలుత అమ్మనుడిలో ధారావాహికగా ప్రచురితమై తర్వాత తెలుగుజాతి ట్రస్టుద్వారా వెలుగులోకి వచ్చిన సంగతి పాఠకులకు తెలిసినదే.

**తెలుగే మన గుర్తింపు. తెలుగులోనే మనం విస్తరించాలి.**



**ఆత్మీయ అతిథి ఆంధ్రాలొయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ డా.జి.ఎ.పి. కిశోర్ ప్రసంగ సారాంశం ఇది**

ఈనాడు మనం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. అసలు ప్రపంచంలో ఎన్ని భాషలు ఉండి ఉంటాయి అని నేను వెతకడం ప్రారంభిస్తే 1000 సంవత్సరాల క్రితం వరకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు పదివేల భాషల వరకు ఉండేవి అని ఒక అంచనా. గడిచిన వెయ్యి సంవత్సరాలలో 1000 కి పైగా భాషల అంతరించిపోవడంతో నేడు 6500 నుంచి 7000 వరకు భాషలు మాత్రమే మిగిలి ఉండవచ్చు అని ఇంకొక అంచనా. కానీ 2050 నాటికి ఈ భాషలు కేవలం 500 కు పడిపోతాయనే ఆందోళన కూడా ఉంది. దానికి మరొక 20 సంవత్సరాలు గడిస్తే అది 300కే పరిమితమయ్యే అవకాశం అధికంగా ఉంది. ఇది భాషా శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా తెలిపినటువంటి విషయం. ఈ సందర్భంగా మనందరికీ గుర్తు ఉండేటటువంటి సినిమా శంకరాభరణం లో కొడిగడుతున్న శాస్త్రీయ సంగీతానికి నేను చేతులు అడ్డం పెడుతున్నాను అని శంకర శాస్త్రిచేత చెప్పించారు ఈమధ్యనే కాలం చేసినటువంటి కె.విశ్వనాథ్ .ఆ పరిస్థితి మనకు మన భాషకు రాకూడదు అనేటటువంటి ఆవేదనతో ఆక్రోశంతో నేను దాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ, మీకందరికీ గుర్తు చేస్తున్నాను.

భాష అనేది మనుషులు బ్రతికున్నంత వరకు ఉంటుంది. కాలక్రమంలో మన భాష అంతరించిపోయేటట్టుగా చేసుకుంటే, తెలుగు వాళ్ళము అని మనకు ఉన్న గుర్తింపు లేకుండా పోతుంది. భాష లేకుండా ఆ గుర్తింపు ఎంత కాలం నిలిచి ఉంటుందనేది ఈనాడు ప్రతి ఒక్కరు ప్రశ్నించుకోవలసిన సమయం అని నేను భావిస్తున్నాను. ఇది ఒక విధంగా ప్రతికూలమైనటువంటిది మరియు సానుకూలంగా లభించేటటువంటి సమాచారం కూడా మీ ముందు ఉంచక తప్పదు. మానవజాతి చరిత్రలో తరతరాలుగా యుగయుగాలుగా అనేక హింసలను మారణకాండలను ఎదుర్కొన్న జాతి ఏదైనా ఉంటే అది యూదులు అంటుంటాం. దాదాపు అంతరించి పోతున్నటువంటి సమయంలో క్రీస్తు శకం 70 ప్రాంతంలో యూదుల తిరుగుబాటుకి విసుగెత్తిపోయినటువంటి రోమా పాలకులు, వాళ్ళ ప్రాణం కంటే ఎక్కువగా భావించే దేవాలయాలన్నింటిని కూడా కూలగొట్టి వాళ్లని దేశాన్నుంచి మూట ముల్లె సర్దుకుని వెళ్లేటట్టు చేశారు. దీంతో వారు ప్రపంచమంతా విస్తరించారు. మన భారతదేశానికి కూడా వచ్చారు. ఇప్పటికీ కూడా కొచ్చిన్, ముంబై, చెన్నై, కలకత్తాలోనూ వారు కనబడుతూనే ఉంటారు. వాళ్ల భాష హెబ్రీ భాష. వాళ్ళను హెబ్రోలు అని కూడా పిలుస్తూ ఉంటారు. కానీ ఎప్పుడైతే వీళ్ళు దేశాలు పట్టుకొని పోయారో, వాళ్ళు పొట్ట కోసం అక్కడ ఉన్నటువంటి భాష నేర్చుకోక తప్పలేదు. కొన్ని వందల సంవత్సరాలు పరాయి నేల మీద ఉండటం కారణంగా పిల్లలు, పెద్దలు అందరూ కూడా వాళ్ళ భాషకు దూరం అయిపోయారు. వాళ్ళ భాష కేవలం వాళ్ళ మత గ్రంథాలలోనూ పూజా కార్యక్రమాలలో మాత్రమే మిగిలి ఉంది. కానీ వాళ్లకు వ్యతిరేకంగా జరుగుతున్నటువంటి హింస తట్టుకోలేక ఒక మతంగా మాత్రమే కాక ఒక భాషా బృందంగా కూడా గుర్తింపు ఉండాలని కొంతమంది నడుము కట్టి దాదాపు మర్చిపోయినటువంటి వాళ్ళ భాషను తిరిగి బ్రతికించుకున్నారు.

నేను ప్రాచార్యునిగా ఏడు సంవత్సరాల తర్వాత 2019 జూన్ నెల నుంచి విదేశాలకు వెళ్లాను. వాళ్లు నాకు జీతాలు ఇచ్చేటటువంటి క్రమంలోనే నా వృత్తి నేపథ్యాన్ని గుర్తించి ఇజ్రాయిల్ అంబసీ వాళ్లు జెరూసలేం లో ఉన్నటువంటి హెబ్రీ యూనివర్సిటీని దర్శించే భాగ్యాన్ని కలిగించారు. ప్రపంచం మొత్తం మీద ప్రపంచ జనాభాలో వారు కేవలం 1.2% మాత్రమే. ఇజ్రాయిల్ దేశంలో వారు ఒక 85 లక్షలు ఉంటారు. కానీ 1901 నుండి ఇప్పటివరకు 900 పైగా 20 శాతం నోబెల్ ప్రైజ్ లు గెలుచుకున్నారన్నది వాస్తవం.

ఈ హెబ్రో యూనివర్సిటీకి వెళ్ళినప్పుడు లబ్ద ప్రతిష్టులైన ముగ్గురు ఆచార్యులని కలవడం తటస్థించింది. వాళ్లు రాసినవన్నీ కూడా వాళ్ళ మాతృభాషలోనే రాశారు. నోబెల్ బహుమతులను వాళ్లకి అందించడానికి ప్రపంచ భాషగా పేరుగాంచిన వేరే భాషల్లోకి అనువదించుకొని వాళ్ల విలువను గుర్తించి, తెలుసుకొని, వాళ్ళని పిలిచి మరీ నోబెల్ బహుమతులను అందించారు. చనిపోయిన భాషను వీళ్ళు కొన్ని వందల సంవత్సరాల తర్వాత నడుం బిగించి బతికించుకుంటే, మనలాంటి దురదృష్ట జాతకులు బ్రతికే ఉన్న మన భాషను, ఏమో పెద్దమాట వాడుతున్నానేమో చనిపోయేలా చేసుకుంటున్నామేమోనని చిన్న బాధ కలుగుతుంది. కనీసం నేను బ్రతికున్నంత కాలం ఈ భాష బ్రతికి ఉండాలి అని నేను మనసా వాచా కర్మణా కోరుకుంటున్నాను. బ్రతికించుకోకపోవడం, బ్రతికించడం మన చేతిలో ఉంది ముఖ్యంగా మన ఇళ్లలో మనం తెలుగు మాటలు మాట్లాడవలసిన సందర్భంలో, సన్నివేశంలో వేరే భాషను మాట్లాడవలసిన అవసరం ఉందంటారా? ఏమో ఆలోచించవలసినటువంటి విషయం ఇది. భాష అభిమానులుగా మా అందరికీ మనం పెట్టుకున్నటువంటి పేరు 'తెలుగు పిచ్చోళ్ళు' అని. ఆ పిచ్చి మా నాన్నగారి ద్వారా నాకు కొంచెం అబ్బింది. నేను అనుకోకుండా తెలుగును చదువుకున్నాను. కానీ చదువుకున్నందుకు మాత్రం నేను ఎప్పుడూ కూడా సంతోషిస్తూనే ఉన్నాను, తప్ప బాధపడలేదు. మనందరం కూడా శంకరశాస్త్రి గారి శాస్త్రీయ సంగీతానికి వచ్చినటువంటి పరిస్థితి రాకుండా మన భాషను అందరం కూడా అజరామరంగా పెంచుకుందామని, ఆ గుర్తింపుకు సంతోషిద్దామని కోరుకుంటున్నాను.

మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం
విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది.
– యునెస్కో

## మాతృభాషతోనే విద్యకు బలమైన పునాది సమానత్వ లక్ష్యానికి వ్యతిరేకం ఆంగ్లమాధ్యమం



**ప్రొఫెసర్ జోగాసింహ్**

అందరికీ నమస్కారం. నాకు చాలా కొంచెం తెలుగు తెలును. నిర్వాహకులకు కృతజ్ఞతలు. ప్రపంచ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా అందరికీ అభినందనలు.

ప్రతిదానికీ (టార్చ్ బేరర్స్) దీపదారులు అయిన చాలా మంది యువకులను చూడటం చాలా సంతోషంగా ఉంది.

నేను ఒక ప్రముఖుడు, మేధావి మరియు భాషావేత్త నోమ్ చోమ్‌స్కీ చేసిన ప్రకటనతో ప్రారంభించాలనుకుంటున్నాను. తన పుస్తకం నాలెడ్జ్ ఆఫ్ లాంగ్వేజ్‌లో 'నాలుగు-ఐదు సంవత్సరాల పిల్లవాడు వారి భాష యొక్క నిర్మాణాన్ని దాదాపుగా పొందుతాడు. తెలుగు పిల్లవాడు అయితే అతను తెలుగు బాగా మాట్లాడతాడు, అతను పంజాబీ పిల్లవాడు అయితే పంజాబీ బాగా మాట్లాడతాడు. కానీ ఆ పిల్లవాడు చాలా గ్రాంథిక తెలుగు వాక్యాలను ఎప్పుడూ విని ఉండకపోవచ్చు. భాషని ముక్కలు ముక్కలుగా నేర్చుకోవడం మొదలు పెట్టినప్పటికీ, ఏ వ్యాకరణ పాఠాలు లేకుండా నేర్చుకున్న పిల్లవాడు పరీక్షలో అదే వ్రాస్తే, అతను సున్నా మార్కులు పొందుతాడు. పరీక్ష పేపర్ దిద్దేవాడు ఆ పిల్లల భాష తప్పు అని అంటారు, 'అశుద్ధ్ వాక్య' అని అవహేళన చేస్తారు. కానీ మరో నాలుగేళ్లలో అదే పిల్లవాడు ఆ భాషలో చాలా నిష్ణాతుడు అవుతాడు. అప్పుడతనిని మాట్లాడకుండా ఆపడం కష్టం అవుతుంది. 20 ఏళ్లుగా ఇంగ్లీషు నేర్పుతున్నాం కానీ ఇప్పటికీ విద్యార్థులకు పెద్దగా తెలియదన్నది మరొక విషయం. దీని గురించి మనం ఆలోచించాలి.

2008లో ప్రచురించబడిన యునెస్కో భారతదేశంతో సహా 12 దేశాలలో ప్రపంచవ్యాప్తంగా ఒక అధ్యయనం చేసింది. దీనికి కావలసిన డబ్బు ప్రపంచ బ్యాంకు ద్వారా అందించబడింది. **ఈ వ్యాసం, భాష మరియు అభ్యాసం గురించిన అపోహలను తొలగిస్తుంది. విదేశీ భాష నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం దానిని బోధనా మాధ్యమంగా ఉపయోగించడమే అనే భావనలో ఉన్న ప్రజల కళ్ళను తెరిపిస్తుంది. వాస్తవానికి, అదనపు భాషలను అధ్యయన అంశాలుగా నేర్చుకోవడం తరచుగా మరింత ప్రభావవంతంగా ఉంటుంది.**

**మరొక అపోహ కూడా బలంగా ప్రజల్లో కనిపిస్తుంది, 'విదేశీ భాష నేర్చుకోవాలంటే, మీరు వీలైనంత త్వరగా ప్రారంభించాలి. ముందుగానే ప్రారంభించడం అభ్యాసకులు చక్కని యాసను కలిగి ఉండటానికి సహాయపడవచ్చు. లేకపోతే ప్రయోజనం బాగా అభివృద్ధి చెందిన మొదటి భాష ఉన్న అభ్యాసకులకు వెళుతుంది. 1/3 అంటే మాతృభాష, విదేశీ భాష నేర్చుకునే మార్గంలో అడ్డుపడుతుంది.' ఇలాంటి అలోచనల్లో ఉన్న ప్రజలని మనం బయటకు తేవాల్సిన అవసరం ఉంది.**

వాస్తవానికి మాతృభాష అయిన మొదటి భాష జ్ఞాన సముపార్జనలో బలమైన పునాదిని ఏర్పరుస్తుంది. ఫలితంగా ఇది అదనపు భాషల మెరుగైన అభ్యాసానికి దారితీస్తుంది. ఈ విషయం భారతీయ విధాన రూపకర్తలు ఎవరికైనా తెలుసా? వారికి ఎలా నేర్పించాలో తెలియదు. వారికి ఇంగ్లీషు అంటే మహా వ్యామోహం. ఇంగ్లీషు మీడియం ద్వారా ఇంగ్లీషు నేర్చుకోవడం కోసం చాలాడబ్బు, వనరులు వృధా అవుతున్నాయి. కానీ మాతృభాష ద్వారా నేర్చుకుంటే ఇంగ్లీషు బాగా నేర్పించవచ్చన్న విషయం వారికి తెలియదు.

వాస్తవానికి పరీక్షలలో ఫలితాలను నిర్ణయించే ఇతర అంశాల కారకాలు కూడా ఉన్నాయి. అన్ని విషయాలు సమానంగా ఉంటే, పిల్లవాడు నేర్చుకుంటాడు. విదేశీ భాషలో చదువుకునే పిల్లవాడు మొదటి నుండి ఆ భాషని నమ్ముతాడు. కాబట్టి టన్నుల కొద్దీ సమాచారం ఉండవచ్చు, కానీ ఇప్పటికీ మనకు ఏమీ తెలియదు. కనీసం ఇంగ్లీష్ నేర్చుకోవడం ఎలాగో తెలియదు. మనం ఇంగ్లీషును ఎలా బాగా నేర్చుకోవాలో తెలుసుకుంటే, మన భాష పట్ల ఉన్న అపోహ నివృత్తి కావాలి. అప్పుడు మనకు మాతృభాషలో విద్య ఉంటుంది మరియు మనం ఇంగ్లీష్ నేర్చుకునే విధంగా నేర్చుకుంటాము.

నేను 6వ తరగతి నుండి ఇంగ్లీష్ నేర్చుకోవడం ప్రారంభించాను. నా 11 వ తరగతి తరువాత, నేను 5-6 సంవత్సరాలు ఏమీ చదవలేదు. కొంత వ్యవసాయం, ఒక చిన్న ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగం చేశాను. ఆరేళ్లు ఏదో ఒక ఉద్యోగం చేశాను. ఆరేళ్ల ఖాళీ తర్వాత నేను ఇంగ్లీషు మీడియంలో చదువు కోవాలనుకున్నాను, ఇంట్లో కూర్చొని ప్రైవేట్‌గా బీఏ చేశాను. రాష్ట్ర విద్య 11వ తరగతి మీడియం హిందీ లేదా పంజాబీలో ఉండేది. నేను బిఏ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని ఆంగ్లంలో నేర్చుకున్నాను, మన ముందు తరం అందరూ అదే పద్ధతి అవలంభించారు.

భాష అంటే ఏమిటో తెలిసే వరకు వారు భాష గురించి ఎవరూ సరైన నిర్ణయాలు తీసుకోలేరు. సాధారణంగా మనం కమ్యూనికేషన్ సాధనం అనుకుంటాం. కేవలం మాట్లాడటం మరియు కొంత సమాచారాన్ని పంపడం కోసం మాత్రమే అని తలుస్తాం. ఆ సమాచారాన్ని పంపడానికి మీరు ఏ భాషనైనా ఉపయోగించవచ్చు. అదే జరిగితే, విషయాలు చాలా సరళంగా ఉండేవి. భాష మరింత తీవ్రమైన విషయం. ఉదాహరణకు, మనం భాష లేకుండా ఆలోచించలేము.

కాబట్టి మనం మనభాషలో ఆలోచించాలి. ఇది మన ఆలోచన యొక్క కోడ్, నాతో నేను మాట్లాడవలసిస్తే, భాష లేకుండా నేను నాతో మాట్లాడలేను. భాష లేకుండా పాడలేము, భాష లేకుండా ఆనందించలేము. భాషలో భావోద్వేగాలు వ్యక్తమవుతాయి. జ్ఞానమంతా భాష ద్వారానే లభిస్తుంది. ఇది కేవలం భాష కాదు, కేవలం విద్యాపరమైన సమస్య కాదు. ఇది మరింత రాజకీయ సమస్య. ప్రజలను అడ్డుకోవడానికి, లాభదాయకమైన ప్రదేశాల నుండి ప్రజలను దూరంగా ఉంచడానికి భాష ఉపయోగించవచ్చు. పెద్ద ఉద్యోగాలు, పెద్ద వ్యాపారం లేదా ఏదైనా భాష అనేది అధికారాలను పొందేందుకు లేదా ఇతరులను ఆ అధికారాన్ని పొందకుండా ఆపడానికి ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. ఉదాహరణకు. ఒకవేళ, **ఆంధ్రప్రదేశ్‌లో అధికారిక**

**పని ఇంగ్లీషులో జరిగితే, సాధారణ గ్రామీణ ప్రజలు మరియు పేద నేపథ్యాల ప్రజల పరిపాలనలో అధికారులుగా మారడం చాలా కష్టం, కానీ అది తెలుగులోనే ఉంటే ఈ ఉన్నత ఉద్యోగాల కోసం అన్ని పరీక్షలు తెలుగులోనే ఉంటే, పేద నేపథ్యాల నుండి వచ్చిన ప్రజలు, గ్రామాల ప్రజలు మరియు అన్ని అణగారిన వర్గాల వారు, పోటీ చేస్తారు. దాదాపు 80ల నాటి మన యుపిఎస్‌సి పరీక్షలన్నీ ఉత్తీర్ణత కావడానికి, మిలటరీ ఆఫీసర్, లెఫ్టినెంట్‌గా మారడానికి మరియు ప్రతిదానిలో అధికారం పంచుకోకుండా ప్రజలను నిరోధించడానికి విదేశీ భాష ఒక గొప్ప సాధనంలా మిగిలింది.**

**అదంతా ఇంగ్లీషులో మాత్రమే ఉంది, తర్వాత కొంత కాలానికి హిందీ జోడించబడింది. ఇప్పుడు ప్రభుత్వం ఇతర భాషలలో కూడా పరీక్షలు పెడుతోంది. కానీ ఇప్పటికీ ప్రిలిమినరీ పరీక్షలు ఇంగ్లీషు, హిందీలో మాత్రమే ఉంటాయి. మీకు ఇంగ్లీష్ మరియు హిందీ బాగా తెలిసినట్లయితే మాత్రమే ఐఏఎస్ గా మారడం సుసాధ్యం. కనుక అన్ని భాషలనూ ఆ పరీక్ష నిర్వహణలో వినియోగానికి పర్మిషన్ ఆశిస్తున్నాను.**

నాకు అన్ని భాషలంటే ఇష్టం. నేను హిందీ మాట్లాడే ప్రాంతంలో ఉంటే, హిందీకి మద్దతుగా మాట్లాడతాను. కానీ యుపిఎస్‌సి పరీక్షలలో ఈ విషయాన్ని వ్యతిరేకిస్తాను. యూపీఎస్‌సిలో అన్ని భాషలు ఉండాలని నేను కోరుకుంటున్నాను. భారత రాజ్యాంగం యొక్క అతి ముఖ్యమైన సూత్రం సమానత్వం. ప్రతిదానికీ అవకాశాల సమానత్వం అవసరం. ఆ సూత్రాన్ని ఉల్లంఘిస్తే, మిగతా అన్ని సూత్రాలు పెద్దగా లెక్కలోకి రావు. కాబట్టి కొన్ని భాషలకు నిర్దిష్ట ప్రయోజనాన్ని ఇవ్వడం మరియు కొన్ని భాషల ద్వారా మాత్రమే కొన్ని స్థానాలను పొందడం అంటే మనం సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నామని అర్థం. ఇది పేదలను మరింత బాధపెడుతుంది.

మరొక విషయమేమిటంటే, భాష ఇప్పుడు బిజినెస్ గా మారింది. ఇది చాలా ప్రమాదకరం. అది ప్రైవేట్ ఎడ్యుకేషన్. **భారతదేశంలో విద్య ప్రస్తుతం బోధించడానికి కాదు, అది డబ్బు సంపాదించే అవకాశంగా మాత్రమే ఉంది. 1990 లో డబ్ల్యూటివో తో ఒప్పందం కుదుర్చుకున్ననాటి నుండి,విద్య నిత్యావసర వస్తువులా మారిపోయింది. ప్రపంచ మార్కెట్ అనుగుణంగా ఇక్కడి విద్యా రేట్లు అంతర్జాతీయ స్థాయికి చేరిన పరిస్థితి ఏర్పడింది. వరల్డ్ బ్యాంక్ వంటివి కూడా విద్య ప్రైవేటైజేషన్ వైపు మొగ్గు చూపాయి. అప్పటి నుంచి ఈ ప్రైవేట్ ఎడ్యుకేషన్ డబ్బు సంపాదించే అతి పెద్ద బిజినెస్ మార్కెట్ గా మారిపోయింది.**

ఎలాంటి ఆర్థిక పరిస్థితులు దేశంలో నెలకొన్నా సరే, మనిషి తాను జీవించడానికి, వారి పిల్లల విద్య కోసం తపిస్తారు. అందుకే కార్పొరేట్ ప్రపంచం ఈ రెండు విషయాలని సొమ్ము చేసుకునేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది. అందులో మొదటిది వ్యవసాయం, రెండవది విద్య. మూడు వ్యవసాయ చట్టాలు సృష్టి అందులో భాగమే! ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, **ఇంగ్లీష్ విద్య లేకుండా ప్రైవేట్ విద్యావ్యవస్థ మనుగడ సాగించలేదు. వాటి అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు ఇంగ్లీష్ మీడియం నిలబడి ఉండేందుకు ప్రైవేట్ ఆర్గనైజేషన్స్ లో, కంపెనీల్లో ఇంగ్లీష్ పెత్తనం పెరిగేందుకు కృషి చేస్తారు. ఇంగ్లీషు లేకుండా సాధారణ మానవుడు మనుగడ సాగించలేని పరిస్థితిని వారు సృష్టిస్తున్నారు.**

ఇంగ్లీష్ మీడియం లేకపోతే తల్లిదండ్రులు తమ పిల్లలని అనవసరంగా డబ్బు వెచ్చించి ప్రైవేట్ స్కూల్స్ కి పంపరు. ప్రభుత్వ పాఠశాలనే ఎంచుకుంటారు. ఒక ఎమ్మెల్యే పిల్లలు , ఒక అధికారి పిల్లలు ఏ స్కూల్ కి వెళతారో అదే మంచి స్కూల్ అనే పరిస్థితి ఉంది. కనుక వాళ్ల పిల్లలు ప్రభుత్వ స్కూల్ కి వెళితే కచ్చితంగా అది మంచి బడి అనే భావన పెరుగుతుంది. అలా చేస్తే ప్రభుత్వ స్కూళ్ళ రూపురేఖలు కేవలం రెండు సంవత్సరాలలో మారిపోతాయ్.

**కొత్తగా కేంద్రం అమలు పరుస్తున్న నూతన జాతీయ విద్యా విధానం వల్ల మాతృభాషకు కొంచెం న్యాయం జరగవచ్చు. మాతృ భాషలో ఉన్నత విద్యని అభ్యసించే అరుదైన అవకాశం ఇప్పుడు చేకూరుతోంది.ప్రాథమిక విద్యా బోధన 5 వ తరగతి వరకూ రాష్ట్ర భాష లేదా మాతృభాషలో చెప్పాలని నిర్దేశించింది. అది కొంత మంచి నిర్ణయమే!**

ఇక రెండు తెలుగు రాష్ట్రాలు వారి ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ ఇంగ్లీష్‌మీడియం లోకి మారుస్తున్నామని కొన్నాళ్ళ క్రితం ప్రకటించాయి. అది శోచనీయం. దానిని నిరసిస్తూ నేను వేలాది లేఖలు రెండు ప్రభుత్వాలకీ, ప్రజాప్రతినిధులకి, జిల్లా స్థాయి అధికారులకి కూడా లేఖలు రాశాను. కానీ ఒకే ఒక్క విశ్వవిద్యాలయ ఉపకులపతి నుంది మాత్రమే రిప్లై వచ్చింది. అది కూడా ఆటోమేటెడ్ కంప్యూటరైజ్డ్ రిప్లై, "మీ లేఖ అందింది, త్వరలో ప్రతిస్పందిస్తాము" అని మాత్రమే. ఇది చాలా హాస్యాస్పదం, గర్హనీయం కూడా.

రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా అధికారులను విదేశాల్లో విద్యను అభ్యసించడానికి పంపుతాయి, కానీ అక్కడికి వెళ్లేవారు సైట్ సీయింగ్ లో వినోదాన్ని పొందుతారు. వారు నిజంగా అధ్యయనం చేస్తే, వేలాది యుఎస్ పాఠశాలలు ఆంగ్లంలో బోధించడం లేదని వారు గమనించవచ్చు, చాలా కెనడా పాఠశాలలు ఫ్రెంచ్‌లో బోధిస్తున్నాయి, ఆస్ట్రేలియాలో కూడా వారు ఆంగ్లంలో బోధించకుండా వారి స్థానిక భాషలలో బోధించడం కనిపిస్తుంది.న్యూజిలాండ్ వారు మావోరీ లేదా న్యూజిలాండ్ సంకేత భాషను టీచింగ్ చేస్తున్నారు.ఇవన్నీ ఇంగ్లీష్ మాట్లాడే దేశాలే! వారి ప్రభుత్వాలు విద్యార్థులకు వారి మాతృభాషలో బోధించమని ప్రోత్సహిస్తాయి. తమ పిల్లలతో ఇళ్ళలో మాతృభాషలో మాట్లాడాలని మరియు ఇంగ్లీషులో మాట్లాడకూడదని కెనడా పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతాయి.

మీరు రెండు భాషలలో ప్రావీణ్యులైతే, కెనడాలో మీకు ఉద్యోగాలకు ప్రాధాన్యత ఉంటుంది. మోనో లింగ్యువల్ అతి తక్కువ ఉద్యోగావకాశాలు కలిగి ఉంటారు.

200 సంవత్సరాల క్రితం ఎవరూ పాఠశాలకు వెళ్లలేదు మరియు మాతృభాషలపై ఇతర భాషల జోక్యం లేదు, కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళుతున్నారు మరియు ప్రస్తుత సార్వత్రిక విద్య బోధనా మాధ్యమం విద్యార్థుల మాతృభాషగా మారింది. యునెస్కో ప్రకటన ప్రకారం వారు దానిలో అభివృద్ధి సాధించలేరు, నిష్ణాతులు

మిగతా 17వ పేజీలో

## మాతృభాషతోనే ఉన్నత విద్య,ఉన్నత ఉద్యోగాలు



**హైదరాబాద్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఇలా ప్రసంగించారు:**
మాతృభాషా దినోత్సవాన అందరికీ అభినందనలు. నేను తెలుగు భాష మీద ఎలాంటి పరిశోధన చేయలేదు కానీ,తెలుగు భాషోధ్యమ నాయకులు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు వంటి వారు తెలుగు భాషా పరిరక్షణ కోసం పడుతున్న తపన చూసి ఈ ఉద్యమం వైపు అడుగులు వేశాను.తెలుగు భాషను సమిష్టిగా రక్షించుకోకపోతే, తెలుగుజాతి మనుగడ ప్రశ్నార్ధకమవుతుంది అని బలంగా నమ్మిన వ్యక్తి గారపాటి అనడంలో సందేహం లేదు.కంప్యూటర్ కి తెలుగు నేర్పిన వ్యక్తి ఉమామహేశ్వరరావు గారు. మెషీన్ ట్రాన్స్లేషన్ అనే దానిని అభివృద్ధి పరచడంలో వారి కృషిని అభినందించాల్సిందే. కేవలం ఇంగ్లీష్ వస్తేనే జీవితంలో ఎదుగుతారనే ఒక భ్రమ ఉంది అది నిజం కాదని, వారు రకరకాలుగా విడమరచి సోదాహణంగా చెబుతుంటారు. తన వ్యాసాల ద్వారా విశ్లేషిస్తూనే ఉంటారు.

సభలో ఆసీనులై యాభై సంవత్సరాలు పైబడిన వారంతా పూర్వం తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారే! ఒకటో తరగతిలో అ,ఆ లతో మొదలుపెట్టి ఐదవతరగతిలో వాక్యాలు రాస్తూ, మాతృభాషను కాస్త స్పష్టంగా మాట్లాడగలిగే స్థితిలో, అంటే ఐదవ తరగతిలో ఏబిసిడిలు నేర్చుకోవడం జరిగింది. ఇక ఆరవ తరగతి నుంచి హిందీ భాష నేర్చుకోవడం మొదలైంది. పదవ తరగతి వరకూ మూడు భాషలు నేర్చుకున్నాం. అయితే తెలుగుతో పోల్చుకుంటే మాకు హిందీ, ఇంగ్లీషు భాషల్లో నేర్చుకోవడం కష్టంగా ఉండేది. ఎందుకంటే, ఇంగ్లీషు బోధించే వారికి కూడా ఇంగ్లీషు అర్థం చేసుకోవడంలో కొంత సమస్య ఉండేది.అందుకే వారు కూడా గైడ్స్ పెట్టుకుని పాఠాలు చెప్పేవారు. ఇంగ్లీషులో పార్ట్స్ ఆఫ్ స్పీచ్ ని మేము ఎనిమిదవ తరగతిలో నేర్చుకున్నాం. పదవతరగతి పరీక్షల్లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్‌లో కొన్ని ప్రశ్నలు ఉండేవి. ఇంటర్ లోకి వెళ్లాక కూడా తెలుగు, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ అన్నీ తెలుగు మీడియంలోనే చదువుకున్నాం. హిందీ ఉండేది కాదు. ఇంగ్లీషు వచ్చేసరికి మాకు సమస్యే. తెలుగులో ఏదైనా సులభంగా వ్యక్తపరిచే మాకు ఇంగ్లీషులో ఏది వ్యక్తపరచాలన్నా సమస్యగా ఉండేది. అప్పట్లో టానిక్ గైడ్సః అని ఉండేవి. ఆ గైడ్స్ లో విషయాన్ని బట్టీపట్టి, పరీక్షలు రాసేసే వాళ్లం. అంతేతప్ప,అదేంటనేది మాకు తెలిసేది కాదు. పదవ తరగతి వరకూ స్కూల్లో, ఇంటర్ లో కాలేజీలో మొదటి రెండు ర్యాంకులలో ఉండే నేను ఇంజనీరింగ్ కాలేజీలో ఇంగ్లీషు మీడియం కావడంతో ఫెయిల్ అయ్యాను. దానికి కారణం భాష అర్థం కాకపోవడం.**స్కూలింగ్ , ఇంటర్ ఎడ్యుకేషన్ మొత్తం తెలుగులో చదువుకున్న నాకు ఇంజనీరింగ్ కూడా తెలుగు మీడియంలో ఉంటే బావుండేది కదా అనిపించేది. కానీ ఆ అవకాశం కలగలేదు.** కాకతాళీయంగా ముప్పై సంవత్సరాల తర్వాత ఇప్పుడు భారత ప్రభుత్వం వాళ్ళు ఉన్నత విద్యని కూడా మాతృభాషలో చదువుకునే వెసులుబాటుని జాతీయ విద్యా విధానం 2020 కి అనుగుణంగా ప్రకటించారు. అది చాలా మంచి పరిణామం.

యుజిసి చైర్మన్ జగదీష్ కుమార్ ఇటీవలే అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులకి, దానికి సంబంధించి లేఖలు కూడా రాశారు. మీమీ భాషల్లో ఉన్నత విద్యాబోధన కోసం ఏవైనా ఏర్పాట్లు చేస్తున్నారా? అనువాద ప్రక్రియలేమైనా మొదలు పెట్టారా? వాటి కోసం ఫండ్ ఏవైనా అవసరమైతే కేటాయిస్తాం అని ఆ లేఖ సారాంశం. ఇప్పుడు ప్రభుత్వమేమో మనకు మాతృభాషలో, ప్రాంతీయ భాషలో ఉన్నత విద్యా బోధనకు ప్రయత్నాలు చేస్తూ ఉంటే, దురదృష్టవశాత్తు తల్లిదండ్రులు వారి పిల్లలని దానికి దూరంగా తీసుకెళుతున్నారు. **ఒకప్పుడు మాతృభాషలో ఉన్నత విద్య ఉండాలని కోరుకున్నప్పుడు ప్రభుత్వాలు ప్రయత్నాలు కూడా చేయలేదు. అలాంటి ప్రయత్నం జరుగుతున్నప్పుడు దానిని వ్యతిరేకిస్తుండటం హాస్యాస్పదం.**

మా వద్దకు అడ్మిషన్ కోసం పర్సనల్ ఇంటర్వ్యూలకు విద్యార్థులు హాజరవుతుంటం రివాజు. వారి ఎడ్యుకేషన్ గమనిస్తే ఎల్కేజి నుంచి డిగ్రీ వరకూ ఇంగ్లీషు మీడియంలోనే జరిగి ఉంటుంది. కానీ 'టెల్ అస్ అబౌట్ యువర్ సెల్ఫ్ అని అడిగితే కళ్ళు తేలేస్తుండటం చూశాం. అంటే తన గురించి తానే చెప్పడం కష్టమవుతోంది. అదే అతని మాతృభాషలో అంటే తెలుగులో అడిగి ఉంటే తన గురించి అతను ధారాపాతంగా చెప్పగలుగుతాడు. కానీ నా బాధేంటంటే అంతకాలం ఇంగ్లీషు మీడియంలో చదివినప్పటికీ వాళ్ళు తన గురించి తాను అటు ఇంగ్లీషులో కానీ ఇటు తెలుగులో కానీ స్పష్టంగా చెప్పలేకపోతున్న పరిస్థితి గమనిస్తున్నాం. స్టేజీ మీదకొచ్చి మాట్లాడమంటే కూడా అదే పరిస్థితి నెలకొంది. వాడికి పూర్తిగా ఇంగ్లీషులో పరిజ్ఞానం రాలేదు, అదేదో టెస్ట్ పేపర్స్,గైడ్స్ పెట్టుకుని చదివి 75% ఆ పై మార్కులతో పాసైపోతున్నాడు.కానీ పోటీ పరీక్షలలో పాసవ్వలేకపోతున్నాడు. ఎందుకంటే ఇంజనీరింగ్ కూడా తనది కాని భాషలో చదవడం వల్ల, అర్థం చేసుకోలేకపోతున్నారు. ఫైనలియర్ పూర్తి చేసుకుని మా వద్దకు వచ్చిన విద్యార్థి లేదా విద్యార్థినిని మొదటి సంవత్సరం పాఠ్యాంశం గురించి అడిగితే,మూడేళ్ళ క్రితం చదివింది ఇప్పుడేం గుర్తుంటుంది సర్ అనేస్తున్నారు. మేము ముప్పై సంవత్సరాల క్రితం చదువుకున్న విషయాలను చెప్పగలుగుతున్నాం. కానీ మీరు మూడు సంవత్సరాల క్రితం చదివిన విషయాలు ఎందుకు చెప్పలేకపోతున్నారని అడిగితే, దాటవేత ధోరణి వారిలో కనిపిస్తోంది.

దీనిని బట్టి అర్థమవుతున్నదేమిటంటే కేవలం మార్కుల కోసం చదివే ధోరణి మన తెలుగు రాష్ట్రాలలో బలంగా వేళ్ళూనుకుంది. అలాగే మిగిలిన రాష్ట్రాలలో కూడా. **మన వారిలో రెండు అపనమ్మకాలున్నాయ్. బహుశ వాటికి మూఢనమ్మకాలనే పదం సరితూగవచ్చేమో! అవేంటంటే, ఇంగ్లీషు మీడియంలోనే చదివితే భవిష్యత్తు ఉంటుంది. అది అపోహ మాత్రమే అని డా.గారపాటి ఉమామహేశ్వరరావు వంటి వారు ప్రూవ్ చేసి చూపారు. ఇంగ్లీషు చదువుకున్న వారు కూడా పైకి వస్తారు. నేను కూడా ఇంగ్లీషు భాష నేర్చుకోవద్దు అని చెప్పటం లేదు. నేర్చుకోండి**

**అదే సమయంలో తెలుగుని అశ్రద్ధ చేయకండి. తెలుగు**

**భాష కావాలి. రెండవది పలకరింపులో. పక్కింటి ఆంటీని ఆంటీ అని పిలిచినా, ఇంట్లో తల్లిదండ్రులని మమ్మీ, డాడీ అనాల్సిన అవసరం లేదు. కానీ అనకుండా ఉండలేకపోతున్నాం తేట తెలుగులో పిలిస్తే అదేదో పెద్ద తప్పు చేసిన భావనలో ఉండిపోతున్నారు.**

ఇంగ్లీషు నేర్చుకోవాలి, కానీ ఎప్పుడు నేర్చుకోవాలనేదే పెద్ద చిక్కు ప్రశ్న. ఇంటర్నేషనల్ స్కూల్స్ లో ఎల్కేజీ నుంచే తెలుగు, హిందీ , ఇంగ్లీషు భాషలని నేర్పుతున్నారు. మరలా పదవతరగతి తర్వాత సంస్కృతం చదివితే మార్కులు అదనంగా వస్తాయంటున్నారు. ఇంటర్ లో మార్కుల మాయలో తెలుగు ఎవరూ ఎంచుకోవడం లేదు. అత్యధిక శాతం సంస్కృతం మాత్రమే ఎంచుకోవడం మరో దారుణం. వాళ్ళు నిజంగానే 90 నుంచి 95 శాతం మార్కులు తెచ్చుకోగలుగుతున్నారు, కానీ సంస్కృతంలో ఒక్క వాక్యం కూడా మాట్లాడలేని, రాయలేని పరిస్థితి అందరికీ తెలిసిందే. చివరకు ఏమౌతుంది? తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం ఏ భాష కూడా వారికి వంటబట్టడం లేదు. మాథ్స్, ఫిజిక్స్ కూడా సంపూర్ణంగా రాని పరిస్థితి. ఎందుకంటే అది మనది కాని భాషలో నేర్చుకుంటున్నాం. అంటే **వాడుక భాష ఒకటుంటోంది, బడి భాష ఒకటుంటోంది, ఇంటి భాష మరొకటి ఉంటుంది. ఈ మూడు భాషలూ ఒకలా ఉన్నప్పుడు మనకి నేర్చుకునే అవగాహన పెరుగుతుంది. మనమీద మనకి నమ్మకం పెరుగుతుంది.**

మా రోజుల్లో కాంపోజిట్ మాథ్స్, జనరల్ మాథ్స్ అని రెండు రకాల లెక్కలుండేవి. ఏడవ తరగతి వరకూ అందరం ఒకే మాథ్స్ చదివేవాళ్ళం. 8 నుంచి 10 వరకూ జనరల్, కాంపోజిట్ మాథ్స్ అని విడిపోయేవాళ్ళం. అలా రెండు మాథ్స్ చదివిన బ్యాచ్ లలో మాదే చివరిది కూడా. తర్వాత రెండు రకాల మాథ్స్ ని కలిపేశారు.ఎనిమిదవ తరగతిలో కాంపోజిట్ మాథ్స్ చదువుతున్నప్పుడు, ద్విపద సమీకరణాలు (బీజగణితంలో) ఒక లెక్క ఏమిటంటే,ఒక కొలనులో రెండు తామరలు కలవు. అచ్చటికి కొన్ని తుమ్మెదలు వచ్చెను. ఒక్క పూవు మీద ఒక్కో తుమ్మెద వాలినచో ఒక తుమ్మెద మిగిలినది. ఒక్క పూవు మీద రెండు తుమ్మెదలు వాలినచో ఒక పువ్వు మిగిలినది. అక్కడున్న పూవులెన్ని? తుమ్మెదలెన్ని? అది ఒక మాథమాటిక్స్ సమస్యలాగా అనిపించలేదు. అది ఒక స్టోరీలాగా అనిపించి తీరుతుంది. అనేక విధాల దానిని పరిష్కరించి దాని సమాధానం మూడు,నాలుగు అని చెప్పేస్తాం.అది విన్నప్పుడు ఏమనిపిస్తుంది ? అంటే అప్పట్లో ఇంట్లో అమ్మానాన్న మాట్లాడుతున్న భాష, బయట టీచర్ మాట్లాడేవారు. దానివల్ల ఏమవుతుందంటే ఇంటికి స్కూల్‌కి పెద్ద తేడా లేదు. ఇప్పుడేమవుతుందంటే ఇంట్లో ఒక భాష మాట్లాడుతున్నాము.పాఠశాలకు వెళ్లిన తర్వాత మరో భాష భాష మాట్లాడుతున్నాము. అది పరాయి భాష లాగా ఫీల్ అవ్వడం వల్ల దానిని మనం సొంతం చేసుకోలేకపోతున్నాం. అదేవిధంగా ఎనిమిదవ తరగతిలో అదే బీజ గణితంలో మరో లెక్క ఏమిటంటే, ఒక తోటలో రెండు మామిడి చెట్లు కలవు. ఒక చెట్టుపై ఒక చిలకల గుంపు, మరో చెట్టుపై మరో చిలకల గుంపు కలవు. ఒక చిలకల గుంపులోని చిలక మరొక చిలకల గుంపులో చిలకతో ఈ విధంగా అన్నది, మీ గుంపులో ఒక చిలుక మా వైపు వచ్చినట్లయితే మీరు మేము సమానమవుతాం అన్నది.దానికి సమాధానం గా మరొక చెట్టుపై ఉన్న చిలకల గుంపులోని చిలుక మీ గుంపులోని ఒక చిలుక మా వైపు వచ్చినట్లయితే మేము మీకు రెట్టింపు అవుతాం అని అన్నది. ఒక్కొక్క చెట్టు మీద ఎన్ని చిలుకలు కలవు? ఇట్లా మనం మ్యాథమెటిక్స్ నేర్చుకుంటే గుర్తుండిపోతుంది. ఇప్పుడు నేను చదువుకొని కూడా దాదాపు 40 సంవత్సరాలు. 40 సంవత్సరాల క్రితం నేను చదువుకున్న చదువుని గుర్తుచేసుకొని చెబుతున్నానంటే అర్థం చేసుకోవచ్చు. ఆర్కిమెడిస్ గురించి గానీ, న్యూటన్ గమన నియమాల గురించి గానీ, వేగం వడి త్వరణం గురించి కానీ, విద్యుత్తు, జల విద్యుత్తు, గురుత్వాకర్షణ, ఘర్షణ ఇవన్నీ కూడా చాలా కంఫర్టబుల్ గా ఉండేవి వినడానికి. అదే సోషల్ స్టడీస్ వచ్చేటప్పటికి అధికారం, ప్రతిపక్షం, ప్రధానమంత్రి, రాష్ట్రపతి అధికారాలు ఏమిటి? ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర ఏమిటి ? ఇవన్నీ మాకు ప్రశ్నలు.

ఆ రోజుల్లో వీటి కోసం మేము పెద్దగా ప్రయత్నాలు చేసేవాళ్లం కాదు. మాకు తెలిసిన భాషలోనే తెలిసిన విషయాలలోనే టీచర్ చెప్పిన వాటిని విని అవగాహన చేసుకుని దానికి ఆన్సర్ రాయగలిగాము. కానీ ఇప్పుడు ఏమవుతుంది అంటే పిల్లవాడు స్కూల్ నుంచి వచ్చేటప్పటికి ఒక డెమోక్రసీ గురించి గానీ, రకరకాల విషయాల గురించి వాడికి అవగాహన కలగడం కష్టమవుతుంది. **భద్రిరాజు కృష్ణమూర్తి గారు, చేకూరి రామారావు గారు వంటి భాషా శాస్త్రవేత్తలు ఏమన్నారంటే ఒక భాషను మనం బాగా నేర్చుకున్నట్లయితే మరొక భాషను త్వరగా నేర్చుకుంటాం. కనుక కనీసం ఐదవ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరిగినట్లయితే వాడికి భాషపై ఒక పట్టు వస్తుంది.చివరికి వచ్చేటప్పటికి అన్ని భాషల్లో నియమాలు ఒకేలా ఉంటాయి.కాస్త అటు ఇటుగా.ముందు ఒక భాష గనక స్పష్టంగా గా వస్తే మరొక భాషనూ సులభంగా నేర్చుకోవచ్చు.మరొక దౌర్భాగ్యం ఏమిటంటే ఏ భాషను పూర్తిగా నేర్చుకోకపోవడం వలన ఏ భాషలోను మనకు పూర్తిగా ప్రావీణ్యత లేదు.**

ఈరోజు మిమ్మల్ని కలెక్టర్, మంత్రి, ఎడిటర్ వంటి వారికెవరికైనా ఒక లేఖ రాయమంటే తెలుగులోనూ కరెక్టుగా రాయలేరు, ఇంగ్లీషులోనూ కరెక్ట్ గా రాయలేరు. అది అంగీకరించాల్సిన వాస్తవం.ఇప్పుడు కొత్తగా తెలుగు ఇంగ్లీషు మిక్స్ చేసేసి ఎటూ కాకుండా రాసే పరిస్థితి ఉంది. ఒక వేదిక మీద మాట్లాడమంటే పూర్తిగా తెలుగులోనూ మాట్లాడలేరు, పూర్తిగా ఇంగ్లీష్ లోనే మాట్లాడలేరు. వీటన్నిటికీ కారణం ఏమిటి? భాష కంటే భావం ముఖ్యం. అంటే మన మనసుల్లో ముందు ఒక క్లారిటీ లేదు. అసలు ఏం మాట్లాడదలచుకున్నాం అన్న ఒక క్లారిటీ ఉంటే ఏదో ఒక భాష ఎంచుకొని మాట్లాడతాం.అసలు భాష కంటే ముందు ఒక అవగాహన ఉండితీరాలి.సంగ్రహంగా ఒక అవగాహన ఏర్పరచుకున్నట్లయితే కచ్చితంగా ఏదో ఒక భాషలో మాట్లాడగలుగుతాము.భాషను నేర్చుకుందాం. భాషను నేర్చుకున్న తర్వాత మనం అదే భాషలో మనం ఆలోచించడం మొదలుపెడతాం.నేను ఒక లెక్చర్ ఇవ్వాలి అంటే కొన్నిసార్లు ఆ ఇంగ్లీషు డెఫినిషన్స్ అర్థం కాకపోతే, గూగుల్ లోకి వెళ్లి ఇంగ్లీష్ పదాల తెలుగు అర్థం చూసుకుని అర్థం చేసుకుంటుంటా. నాకు ముందు తెలుగు పదాలు తెలిస్తే నేను దాని గురించి 15 నిమిషాలు అనర్గళంగా మాట్లాడగలిగే ఇన్ఫర్మేషన్ నా దగ్గర ఉంటుంది. కానీ దానికి ముందు సమానమైన తెలుగు పదం ఏమిటి అనే విషయం

తెలియకపోవడం వలన ఆలోచనలో పడతాం. ఇవాళ మనం చాలా చూస్తూ ఉంటాం. **మన మిత్రులు తెలుగులో టైప్ చేస్తుంటే దానిలో గ్రామర్ ఉండదు. అసలు టెన్సెస్ సరిగ్గా ఫాలో అవరు. ఏది ముందు చెబుతున్నారు, ఏది వెనక చెబుతున్నారో కూడా తెలియదు.** వాక్యాన్ని ఎక్కడ **ఆపాలో తెలీదు.** ఒక పదాన్ని ఎక్కడ, ఒక వాక్యాన్ని ఎక్కడ **విడగొట్టాలో తెలియదు. ఏ పదాన్ని కలపాలో తెలియదు. అంటే మన తెలుగులో కూడా మనం మన తెలుగుని రాయలేని పరిస్థితికి వచ్చాము. ఇంగ్లీష్ ఎలాగూ రావడం లేదు తెలుగుని ఏం చేస్తున్నావంటే ఇంగ్లీషులో టైప్ చేస్తున్నావు .** తెలుగు పదాలని **బాగున్నావా, అనే వాటికి బదులు** nuvvu bgunnava **అని రాసుకునే దౌర్భాగ్య స్థితికి వచ్చేశాం. తెలుగులో అక్షరాలని కూడా అంటే మొబైల్ ఫోన్స్ లో తెలుగు టైపు ఉన్నప్పటికీ మొబైల్ ఫోన్స్‌లో ఇంగ్లీషులో టైప్ చేస్తున్నారు.తిన్నావా దానికి** tinnava **అని ఇంగ్లీషులో టైప్ చేస్తున్నారు. అంటే ఇప్పుడు మనం వాక్యాలు మాట్లాడడం మానేశాం. దాని స్థానంలో పదాల స్థాయికి పడిపోయాం.**

నాకు బాగా గుర్తు, నేను మా రోజుల్లో కాలేజీలో చదువుకునే రోజుల్లో ఉత్తరం రాస్తే ప్రియమైన అమ్మకు నాన్నకు నమస్కారములు తెలియజేయునది ఏమనగా అని రాసేవాళ్ళు.అలాంటిది ఇప్పుడు రాయాలి అంటే తెలుగులో రాయలేము, అలాగని ఇంగ్లీషులో కూడా రాయలేము. ఇంగ్లీషులో రాస్తే చాలా మెకానికల్‌గా, ఒక వాట్సప్ లాంగ్వేజ్ లోనో విచిత్రంగా కమ్యూనికేట్ చేస్తారుDad,last date ,so and so,Please send Rs. 3000/- అదీ నేటి పరిస్థితి. అదే పూర్వం డబ్బులు కావాలన్నా కూడా అడగాలంటే నేను బాగున్నాను మీరు ఎలా ఉన్నారు? ఆ మావయ్య ఎలా ఉన్నారు? అత్తయ్య ఎలా ఉంది? ఆరోగ్యం ఎలా ఉంది? అని అన్ని అడుగుతూ నాకు ఈమధ్య కాలేజీలో పరీక్ష ఫీజు కట్టవలసి ఉంది. మీకు ఇబ్బంది లేకపోతే 200/ బిఎంటి పంపేది, లేనిపక్షంలో నేను ఇక్కడ ఎవరి దగ్గరైనా అడ్జస్ట్ చేసుకుంటాను. వచ్చిన తర్వాత పంపేది.అని చివరిలో ఒకే ఒక వాక్యం లో అడిగే వాళ్ళం.ఇలా లెటర్ రాయడంలో కూడా మనసు లోపలి భావాన్ని వ్యక్తం చేస్తూ వారితో మాట్లాడినట్లు ఫీలై లెటర్ రాసేవాళ్ళం. మాట్లాడే భాష వేరే అయిపోయింది, రాసే భాష వేరే అయిపోయింది,ఆలోచించే భాష వేరే అయిపోయింది. ఈ గందరగోళంలో ఏమైపోతున్నామంటే అసలు ముందు మనకు సబ్జెక్టు మీద అవగాహన రావడం లేదు. ఈరోజుకి కూడా నేను ఇంగ్లీషులో లెక్చర్ ఇచ్చిన గాని, తెలుగులో ఆలోచించుకుంటాను.

ఈరోజుకి కూడా ఆ పిల్లలకి స్టాటిస్టిక్స్ పాఠాలు చెప్పేటప్పుడు పిల్లలేమో క్యాలిక్యులేటర్ పట్టుకుని కూర్చుంటారు. నేను క్యాలిక్యులేటర్ లేకుండా బోర్డు మీద చెబుతూ ఉంటాను. ఎలాగంటే నేను తెలుగులో నేర్చుకోవడం వల్ల మనసులో ఎంత పెద్ద లెక్క అయినా తెలుగులో మననం చేసుకోవడం వల్ల నాకు క్యాలిక్యులేటర్ అవసరం లేకుండా పోయింది.మనం వాడుక భాష అయిన మాతృభాషలోనే ఆలోచించడం మొదలు ఉంది. అది 'రక్త సంబంధాలు' అనే టాపిక్. ఇంగ్లీష్ ఎంత కన్ఫ్యూజన్ అంటే, అంకుల్ అంటే ఎవరు? నైస్ అంటే ఎవరు? నెప్యూ అంటే ఎవరు? నాకు ఇప్పటికీ కన్ఫ్యూజన్. అదే తెలుగులో ట్రాన్స్‌లేషన్ చేస్తే అమ్మమ్మ,అత్తయ్య ఎంత సులభమో కాదా! ఇప్పుడు మీరు ఇంగ్లీషులో రాస్తున్నారు కానీ తెలుగులో చదివితే అర్థం అవుతుంది. అదే ఇంగ్లీషులో కన్ఫ్యూజన్ గా ఉంటుంది. అంకుల్ ని ఏ అంకుల్‌గా తీసుకోవాలి? ఆంటీ ని ఏ ఆంటీగా తీసుకోవాలి? అదే తెలుగులో అయితే మేనత్త, మేనమామ, పిన్ని, బాబాయ్ అని వివరంగా ఉంటుంది.

అలాగే ప్రశ్నాపత్రానికి సమాధానం రాయాల్సి వచ్చినప్పుడు ఆయా ప్రశ్నలు ఇంగ్లీషులో కష్టం అనిపించినప్పుడు కింద తెలుగులో ఉన్న ప్రశ్న చదివితే ఇంకా ఎక్కువ అవగాహన వచ్చే అవకాశం ఉంది. తెలుగు భాషతో ఉన్న సంబంధాన్ని విడనాడకండి. తెలుగు నేర్చుకుని ప్రాక్టీస్ చేయండి. ఇప్పుడు వాట్సాప్ లో గూగుల్ లో తెలుగు టైపింగ్ , గూగుల్ ట్రాన్సిలేటర్‌తో ఏ భాష నుంచైనా తెలుగు ట్రాన్స్లేషన్ అందుబాటులోకి వచ్చింది. పోటీ పరీక్షల కోసం మనకు ఇంగ్లీష్ కావాలి. వాస్తవమే, అలాగని తెలుగును నెగ్లెక్ట్ చేయొద్దు. గతంలో ఇంజనీరింగ్ చదివే రోజుల్లో ఇంగ్లీష్ అర్థం అవడం కోసం డిక్షనరీ పెట్టుకొని చదవాల్సి వచ్చేది కానీ ఇప్పుడు **సివిల్ సర్వీసెస్ లాంటి పోటీ పరీక్షలు తెలుగులో రాయవచ్చు, ఇంటర్వ్యూ కూడా తెలుగులో ఎదుర్కోవచ్చు. కాబట్టి తెలుగు నేర్చుకోవడం వల్ల అవకాశాలు ఉండవు అన్న భయం నుండి విద్యార్థులంతా బయటకు రండి.** నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను

---

**మాతృభాషతోనే విద్యకు....** 13వ పేజీ తరువాయి......

ఎడ్యుకేషన్, ఎకానమీ, సైన్స్&టెక్నాలజీలో ఏ దేశాలు అగ్రగామిగా ఉన్నాయో మరియు భారతదేశం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ప్రజలందరూ ఒక్కసారి గూగుల్ లేదా ఇతర సెర్చ్ ఇంజిన్‌లలో శోధించాలని నేను అభ్యర్థిస్తున్నాను. విద్యలో, ఆర్థిక వ్యవస్థలో మరియు సాంకేతికతలో ఎక్కడా మనం నిలబడి లేము. మనము దాదాపు 140 కోట్ల మంది ప్రజలు, చైనాతో సమానం, కానీ అది ఆర్థిక వ్యవస్థలో భారతదేశం కంటే 5 రెట్లు చైనా పెద్దది. చైనాలో పాఠశాలలో లేదా కళాశాలల్లో ఇంగ్లీష్ బోధించరు. విద్యార్థులు తన 10 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత మాత్రమే విదేశీ భాషలను ఎంచుకోవచ్చు.

కాబట్టి మనం 6వ తరగతి తర్వాతే విదేశీ లేదా ఇతర భాషలను నేర్చుకొవడమే దీనంతటికీ పరిష్కారం. దానికోసం యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు
మొదటి ప్రాధ్యాన్యత ఎల్లవేళలా మాతృభాషదే
ఆ తర్వాతనే హిందీ భాష...
నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం"
"మాతృ భాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు"

– మహాత్మాగాంధీ

# తెలుగుతోనే మనసాంకేతిక పురోగతి.

సాంకేతిక విజ్ఞాన నిపుణుడు శ్రీ వీవెన్ మాట్లాడుతూ ఇలా అన్నారు.



తెలుగు విషయంలో సాంకేతిక రంగంలో గత ఇరవై ఏండ్లలో గణనీయమైన పురోగతి కనిపించింది. కంప్యూటర్లలో తెలుగు చూడడమే కష్టమైన స్థితి నుండి నేను సామాన్యులు కూడా చేతిరాతతోనూ, నోటిమాటతోనూ తమ మొబైళ్ళలో తెలుగు టైపు చేసే స్థితికి చేరుకున్నాం. సాంకేతికత ప్రజాస్వామ్యీకరణ చెందిందనడానికి ఇది గొప్ప ఉదాహరణ. ఇటువంటి ఇబ్బడిముబ్బడి పెరుగదలనూ, ప్రజాస్వామ్యీకరణనూ ఇతరత్రా సంబంధిత రంగాల్లో కూడా చూడవచ్చు. ఉదాహరణకు తెలుగు టెలివిజన్ ప్రసారాలు నాలుగు దశాబ్దాల క్రితం వారానికి కొన్ని గంటలు ఉండేవి, ఇప్పుడు 24-గంటలూ తెలుగు ప్రసారం చేసే ఛానెళ్ళు దాదాపు 100 ఉన్నాయి. ఇలాంటివే ఇతర జనమాధ్యమాలైన అనేక వేల (లక్షల) తెలుగు యూట్యూబు ఛానెళ్ళు వెల్లువెత్తాయి.

తెలుగువారికి సేవలు అందించడానికి అమెజాన్ వంటి సంస్థలు తెలుగు తెలిసిన సిబ్బంధిని నియమించుకుంటున్నాయి. అమెజాన్ వారి ఉద్యోగవేదికలో తెలుగు అని వెతికి చూస్తే కనీసం పది వరకూ ఉద్యోగాలు కనిపిస్తున్నాయి.ఇలా, ఇతర బహుళజాతి కంపెనీలు కూడా తెలుగు తెలిసిన సిబ్బందిని బహుళజాతి  కంపెనీలు కూడా తెలుగు తెలిసిన సిబ్బందిని నియమించుకుంటున్నాయి.

కానీ మన దగ్గరే పరిస్థితి భిన్నంగా ఉంది. సామాన్యులకు అందాల్సిన సేవలు (బ్యాంకింగ్, బీమా, పెట్టుబడుల వంటి ప్రాథమిక ఆర్థిక సేవలకు కూడా) వారి మాతృభాషలో అందడం లేదు. వస్తువులపై ఆరోగ్య హెచ్చరికలు, సూచనలు వంటివి తెలుగులో ఉండవు. సొంత నేలలోనే పరాయివారిగా బ్రతుకుతున్న దుస్థితి తెలుగువారిదేనేమో! బహుళజాతి కంపెనీల మొగ్గను చూసి, మన దేశీయ సంస్థలను కూడా మనకు వస్తుసేవలను తెలుగులో అందించమని మనందరం అడగాలి. మనం డబ్బు పోసి కొంటున్న వస్తువులూ, పొందుతున్న సేవలూ మన భాషలో ఆశించడం మన హక్కు. అడుగుదాం! ఇదొక్కటీ సాధించినా, అనేక ఉద్యోగాలు తెలుగు తెలిసినవారిని వెతుక్కుంటూ వస్తాయి.



## భాషోద్యమ కార్యకర్త, సాంకేతిక నిపుణుడు శ్రీ రహ్మానుద్దీన్ ప్రసంగసారాంశం



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నేపథ్యాన్ని వివరిస్తూ పాకిస్తాన్ విభజన, తూర్పు పశ్చిమ భాగాలుగా ఆవిర్భావం. పశ్చిమ పాకిస్తాన్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణిలో తూర్పు పాకిస్తాన్ లో బాంగ్లా భాషీయులే ఉన్నా వారిపై ఉర్దూను అధికార భాషగా రుద్దడం. అందువలన వచ్చిన నిరసనలు, ఆ నిరసనలను అదుపు చేసేందుకు చేసిన కాల్పుల్లో ఐదుగురి బలిదానం. ఆ బలిదానాన్ని గుర్తు చేసుకుంటూ ఐక్యరాజ్యసమితి ఫిబ్రవరి 21 ని అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించడం ఈ పరిణామాలను వివరించారు.

యునెస్కో సెక్రటరీ జనరల్ 2023 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశపు తెలుగు అనువాదం చదివి వినిపించారు. నా మాతృభాషను కాపాడుకునేందుకు ఇంటర్నెట్, కంప్యూటర్ల యుగంలో నేనేం చేయగలను? అంశంపై ఆచరణీయమైన చిన్న చిన్న పనులు కొన్ని సూచించారు. ఫోన్ ఇంటర్ఫేస్ భాష తెలుగుకు మార్చడం. ఇంటర్నెట్ లో సోషల్ మీడియా, ఈమెయిల్ ఐడీ ఖాతాల్లో పేరును తెలుగుకు మార్చుకోవడం. సంతకం తెలుగులో చేయడం. ఈమెయిల్, వాట్సాప్, సోషల్ మీడియా పోస్ట్స్ అన్నీ తెలుగులో రాయడం. ఇవి కొన్ని ముఖ్య సూచనలు

## యునెస్కో సెక్రటరీ జనరల్ అద్రే అజౌలే 2023 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశం



అద్రే అజౌలే

మాతృభాషా మాధ్యమ విద్య మనిషి సంపూర్ణ వికాసానికి, సాంస్కృతిక వారసత్వ ప్రసరణకు చాలా ముఖ్యం. కానీ ప్రపంచంలో 40% విద్యార్థులు వారి మాతృభాషలో, వారికి బాగా అర్థమయే భాషలో చదువుకోలేకపోతున్నారు. ఈ కారణంగా వారి చదువులలో, సాంస్కృతిక దృక్పథంలో, సామాజిక సంబంధాల స్నేహాల పెంపుదలలో దారుణమైన తరుగుదల వస్తోంది. ఇది మానవత్వం పోగు చేసుకున్న భాషాపరమైన వారసత్వాన్ని బాగా దెబ్బతీస్తుంది. అందువలన ఈ భాషలకు జరుగుతున్న ముప్పును వెనువెంటనే గుర్తించి, నిలువరించాలి. అలా చేయటం వలన చదువుల్లో చోటు చేసుకోవాల్సిన పెను మార్పులకు నాందీపాఠం జరుగుతుంది. నాణ్యమైన విద్యను అందించే దృష్టితో యునెస్కో 2022 ఏడాది సాంతమూ పని చేస్తూనే ఉంది. సెప్టెంబర్ లో ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ-జనరల్ అంటోనియో గుతెర్రెస్ ఆధ్వర్యంలో ట్రాన్స్ఫార్మింగ్ ఎడ్యుకేషన్ సమిట్(విద్యలో మార్పు సదస్సు)ను నిర్వహించింది. భాషలను కనుమరుగు చేసే ఈ ముప్పును నిలువరించేందుకు ముందుగా భాషల గణాంకాలను సేకరించాలి. అలా గణాంకాలను సేకరించాక, ఒక్కో భాషకు విశేషంగా నిర్దిష్ట కార్యాచరణను ప్రణాళిక చేసుకుని పని చేయవచ్చు. అయితే, అన్నిటికన్నా ముందు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే మన భాషా, సాంస్కృతిక వైవిధ్యాలు చాలా సున్నితమైనవి, సరైన శ్రద్ధ పెట్టకపోతే కనుమరుగైపోతాయి. ఇవి భర్తీ చేయలేనివి. భాషలు కనుమరుగైతే జరిగే దుష్పరిణామాల గురించి జనబాహుళ్యంలో అవగాహన పెరగాలి. ప్రపంచ వ్యాప్తంగా నేడు మాట్లాడే 7 వేలకు పైగా భాషల్లో ఒక్కొక్క భాషకు విశిష్టత ఉంది. ప్రతి ఒక్క భాషలో ప్రపంచాన్ని, వస్తువులను, వ్యక్తులను చూసే దృష్టి, ఆలోచించే, అనుభవించే విధానం విశిష్టమైనది. అందువలన ఒక భాష కనుమరుగయింది అంటే అది మొత్తం మానవత్వానికి ఒక కోలుకోలేని నష్టం. ఈ సందర్భంలో భాషల పరిరక్షణకు, ముఖ్యంగా మూలవాసుల భాషల పరిరక్షణకు అంతర్జాతీయ జనభాషల దశాబ్దాన్ని(2022-2032) యునెస్కో ప్రధాన సంస్థగా నిర్వహిస్తోంది. ఈ దశాబ్ద కాలం అంతర్జాతీయ సముదాయానికి చాలా ముఖ్యమైనది. అందరూ ప్రపంచ సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడటంలో కలిసి రావాలి. నేటి అంతర్జాతీయ దినోత్సవం లక్ష్యం కూడా ఇదే - ప్రపంచ భాషల్లో వైవిధ్యంగా మన ప్రపంచాన్ని మనం భావించటాన్ని వేడుకగా జరుపుకోవటం, ఉమ్మడి వారసత్వంగా భాషల వైవిధ్యాన్ని గుర్తించి భాషలను కాపాడటానికి కలిసి రావటం, మాతృభాషల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయడం, ఇవన్నీను.

# సభలో కొందరు విద్యార్థుల ప్రశ్నలు- పెద్దల జవాబులు






ఆంధ్రాలొయోలా కళాశాల
విద్యార్థిని

దుంపల విజయ్,
బి.ఎ.ద్వితీయ సం. తత్వశాస్త్ర
విద్యార్థి,(ఎస్.ఆర్.ఆర్
కళాశాల)

రాజు, బి.ఎ.మొదటి సం.
స్పెషల్ తెలుగు విద్యార్థి
(ఎస్.ఆర్.ఆర్ కళాశాల.)

**భాషాభక్తి లేకుంటే..దేశభక్తి లేనట్లే ...!**

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడ పి.బి.సిద్దార్ధ కళాశాల సభామందిరంలో విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమంలో మాతృభాషకు సంబంధించి విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు యూనివర్సిటీ ఆచార్యులు, అధ్యాపకులు, ఆసక్తికరమైన సమాధానాలిచ్చారు..!

వాటిలో నాలుగు ఇవి:

**1. విద్యార్థి ప్రశ్న..**

"భాషాభక్తి ,దేశభక్తి ఒకటేనా"?

**'ప్రొఫెసర్ జోగాసింగ్ సమాధానం**

"మాతృభాషాభక్తి లేకుంటే దేశభక్తి లేనట్లే..భాషను ప్రేమించలేనివాడు మాతృదేశాన్ని కూడా ప్రేమించలేడు."!!

**2. ఎస్.ఆర్.ఆర్. కళాశాల బి.ఎ ద్వితీయ సం. విద్యార్థి** దుంపల విజయ్ **ప్రశ్న..**

"భాష మీద వ్యాపారం ఎలా, ఎన్ని రకాలుగా జరుగుతోంది?"

**సమాధానం**

"ప్రపంచవ్యాప్తంగా ఒకే భాష(ఇంగ్లీషు) పై వ్యాపారం ముమ్మరంగా జరుగుతోంది..
ఇతర భాషలు చదువుకుంటే ఉద్యోగాలు
రావడంలేదన్న బూచి చూపించి ఎక్స్
ప్లాయిట్ చేస్తున్నారు"..!

**3.ఆంధ్రా లోయోలా కళాశాల విద్యార్థిని ప్రశ్న.**

'గతంలో జాతీయ పోటీపరీక్షలు తెలుగులో వుండేవి కావు. ఆ కారణంగా తెలుగును నిర్లక్ష్యంచేశారు.ఇప్పుడు కొత్త విద్యావిధానం ప్రకారం తెలుగులో కూడా పోటీపరీక్షలు రాయొచ్చు.తెలుగు లో ఇంజనీరింగ్ కూడా చదువుకోవచ్చు..అయినా కూడా ప్రభుత్వాలు తెలుగు మీడియం ఎత్తేసి ఇంగ్లీషు మీడియంను మాత్రమే పెడుతున్నారు..ఇలాంటప్పుడు మన తెలుగుభాషను ఎలా కాపాడుకోవచ్చో తెలుపగలరు"?

**బెల్లంకొండ రాజశేఖర్ గారి సమాధానం**

'తల్లిదండ్రులు వేలం వెర్రిగా ఇంగ్లీషు మీడియంను కోరుకుంటున్నారని తల్లిదండ్రుల డిమాండ్ మేరకే తెలుగు మీడియమ్ నురదద్దుచేసి,ఇంగ్లీష్ మీడియంను ప్రోత్సహిస్తున్నామని, తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు అంటున్నాయి..ప్రజలు మార్పు కోరుకుంటే ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని, మళ్ళీతెలుగు మీడియంను ప్రోత్సహించవచ్చు..కాలక్రమంలో ఈ మార్పురావచ్చు.. వేచి చూద్దాం".!

**4. విద్యార్థి ప్రశ్న..**

ఇంగ్లీషు,తెలుగు సరే..అసలు లిపే లేని బంజారా(లంబాడీ) వంటి భాషల సంగతేంటి.?

ఆచార్య జోగాసింగ్ సమాధానం ప్రభుత్వం ఇటువంటి భాషలపై దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలి.'!

**5. విద్యార్థి ప్రశ్న....**

**నేటితరంలో తెలుగు చదివితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు దొరుకుతాయా?**

ప్రొఫెసర్ జోగాసింహ్ సమాధానం

తప్పకుండా వస్తాయి. ఇప్పటికే చాలా ఉద్యోగాల్లో భారతీయులున్నారు. ఏమీ సందేహం అక్కరలేదు. గూగుల్,అమెజాన్ వంటి సంస్థలు కొన్ని ఇప్పటికే కొన్ని నియామకాలు చేశాయి.

**ఇంకా కొందరు విద్యార్థులు ప్రశ్నలు అడిగారు విజయవాడలోని వివిధ కళాశాలలవిద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.!**

# తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవం
# 2023 ఫిబ్రవరి 21 మంగళవారం




తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవ సభ అదే వేదికపై సాయంత్రం 5.30 గం.లకు ప్రారంభమైంది. తొలుత సమాఖ్య సమావేశకర్త డా.గంధం సుబ్బారావు అందరినీ వేదికపైకి ఆహ్వానించి వారిని సభకు పరిచయం చేశారు. సభకు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథులుగా డా.మండలి బుద్ధప్రసాద్,శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు,డా.గుంటుపల్లి శ్రీనివాస్, ఆచార్య జోగాసింహ్,ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, తెలుగుసాంకేతిక నిపుణులు శ్రీ వీవెన్, శ్రీ రెహ్మానుద్దీన్‌లతోపాటు సమాఖ్య పూర్వాధ్యక్షులు డా.సామల రమేష్‌బాబు ఆశీనులైనారు. మరోక ఆత్మీయ అతిథిగా రావలసివున్న జనవిజ్ఞాన వేదిక నేత, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు శ్రీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అనివార్య కారణాలవల్ల సభకు సందేశం పంపించారు.ఆయన శాసనమండలి బాధ్యతనుండి తప్పుకోనున్నట్లు తెలిపి ఇకపై ఎక్కువ సమయం తెలుగు భాషోద్యమంలో పనిచేయనున్నట్లు తెలిపారని సభలో శ్రీ రమేష్‌బాబు ప్రకటించడం అందరికీ సంతోషం కలిగించింది.

డా.సామల రమేష్‌బాబు ముందుగా మాట్లాడుతూ తెలుగుభాషోద్యమ సమాఖ్యను స్థాపించుకొని ఇప్పటికి 20 ఏళ్లయింది. 2003 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు ఈ ఉద్యమ సంకల్పానికి శ్రీకారం చుట్టారు. ప్రతియేటా జరుపుకోవాలని ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రపంచదేశాలన్నింటికీ విజ్ఞప్తిచేసి అప్పటికి మూడేళ్ళే. 2000లో యునెస్కో ఆ విధంగా ప్రకటించి ప్రతియేటా కొన్ని కార్యక్రమాలను సూచించడం మొదలుపెట్టింది. ప్రపంచంలో ఏడువేలకు పైగా వున్న అమ్మనుడులు(మాతృభాషలు) వేగంగా అంతరించిపోతున్నాయని, అప్పటికే కొన్ని వేల భాషలు మాట్లాడేవారు లేకుండా పోయారని,అంటే ఆ భాషా జాతులు అంతరించిపోతున్నాయని, అందువల్ల క్రమంగా మానవ నాగరికతలోని వైవిధ్యం,అనుభవజ్ఞానం సాంస్కృతిక సంపదను మానవజాతి పోగొట్టుకొంటోందని అర్థం చేసుకోవాలి. కొన్నేళ్ళపాటు చేసిన పరిశోధన తర్వాత 'యునెస్కో' వెల్లడించింది. అప్పటికే ప్రపంచీకరణ ఆర్థిక రాజకీయ పరిణామాల దూకుడు మాతృభాషలను దెబ్బతీయడం మొదలైంది. తెలుగు రాష్ట్రంలో పాలకులు ఈ దూకుడుతో ప్రభావితమై విధాన నిర్ణయాలు చేస్తున్నారు. వారి దృష్టిలో భాషకు,ప్రజాసంస్కృతికీ,దేశీయ వ్యవసాయానికి చరిత్రలో విలువ అంతగా వుండదు.అదే నానాటికీ పెరిగి, పాలకులు మారుతున్నా వారి విధానాలు ఆదిశలోనే భారతీయ సాంస్కృతిక భాషా విలువలకు విఘాతంగా పరిణమిస్తున్నాయి. ఆ పరిస్థితుల్లో కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళంలో తెలుగుభాషోద్యమ సమాలోచనా శిబిరం 2002 నవంబరు 1,2 తేదీలలో జరిపాము. ఆశిబిరంలోజరిగిన మేథోమధనం సంకల్పాన్ని ప్రకటించాం. ఇంతకృషికి సూత్రధారులు ముగ్గురు: కీ.శే

సి.ధర్మారావు,శ్రీమండలి బుద్ధప్రసాద్, సామల రమేష్‌బాబు.వారికి తోడుగా ఎందరో మహానుభావులు కూడా తర్వాత పలువురితో సంప్రతింపులు జరిపి తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రారంభోత్సవాన్ని పెద్దఎత్తున హైదరాబాద్‌లో జరపాలని నిశ్చయించి అందుకు ఏర్పాట్లను ముమ్మరం చేశాం. ఫలితంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నాడు 21,ఫిబ్రవరి 2002న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రక్కనేగల 'తెలుగు లలితకళాతోరణం' లో పెద్దఎత్తున జరిగిన సభలో తెలుగు భాషోద్యమ సమాఖ్య స్థాపనను ప్రకటించి, దాని తొలి కార్యనిర్వాహకమండలిని ప్రకటించారు. తొలి అధ్యక్షులుగా కీ.శే.సి.ధర్మారావు,ప్రధాన కార్యదర్శిగా సామల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా మండలి బుద్ధప్రసాద్, ఇంకా అనేకమంది ప్రముఖులతో ఆ మండలి ఏర్పడింది. ఆనాటి నుంచి ఇప్పటివరకు జరిగిన చరిత్రలో ఎంతో ఉద్యమ కార్యాచరణ ఉంది.

ఒక భాషాజాతిగా తెలుగువారికి ఎదురౌతున్న సవాళ్ళపై అప్పటికి పదేళ్ళ ముందు నుండి కొందరు పెద్దలు జాతిని హెచ్చరిస్తున్నారు. కొన్ని నిరసనలు బలంగా వినిపించాయి. జనసాహితి, మాతృభాషా సమితి వంటి సంస్థలు అపూర్వమైన, శాస్త్రీయమైన, కృషి చేస్తూనేవున్నాయి. భూపతి నారాయణమూర్తి గారి వంటి పెద్దలు తమదైన రీతిలో గణనీయమైన కృషినే చేశారు.జనసాహితీ వారి ప్రజాసాహితి పత్రిక మాత్రమేకాక అనేక సాహిత్య సాంస్కృతిక పత్రికలు కూడా తెలుగు కోసం బలంగా తమ గొంతులు వినిపించాయి. ఇదే సమయంలో 1997 నుండి ఒక సామాజిక, రాజకీయ మాసపత్రికగా రూపుదిద్దుకొని తోడ్పడింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆవిర్భావానికి దారితీసింది. నాటినుండి 2013 నవంబరు వరకూ నిరంతరం అండగా నిలిచింది. తానే ఉద్యమంగా పనిచేసింది. 2013 డిసెంబరు నుండి 2015 ఫిబ్రవరి వరకూ ప్రచురణ నిలిచిపోయింది.అదే పత్రిక శక్తిని పుంజుకుని 2015 మార్చి నుండి 'అమ్మనుడి' పేరుతో మాసపత్రికగా నిరాటంకంగా నడుస్తున్నది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆవిర్భవానికి అండదండలనందించి, నాటినుండి నేటివరకు తెలుగు భాషోద్యమానికి దారి దీపంగా నిలిచిన నాటి నడుస్తున్న చరిత్ర/నేటి అమ్మనుడికి తొలినుండి ఇప్పటివరకూ సంపాదకుడుగానే ఉన్నాను.

సరిగ్గా ఏడాది క్రితం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (21-2-2022) సందర్భంగా ఒకరోజుముందు 20వ తేదీన విజయవాడలోని ఆంధ్రా లొయోలా కళాశాలలో ప్రత్యేకంగా జరిగిన సర్వసభ్యసమావేశంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్ష బాధ్యతలనుండి తప్పుకొని, ఆ బాధ్యతను ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారికి అప్పగించాను. సమాఖ్య స్థాపననుండి నేటివరకు ఒకపెద్ద దిక్కుగా సమాఖ్యకు శక్తి నిస్తున్న డా.మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో, ఆయన ఆమోదంతో, విచ్చేసిన సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా చేసిన ఎంపిక అది.ఇప్పటికి సం. గడిచింది. ఈనాటికి స్పష్టమైన ఉద్యమ కార్యాచరణ ప్రణాళికతో మళ్ళీ విస్తృతసభ ద్వారా మీ ముందుకు రాగలిగాం. వాటన్నిటినీ ఈ సభ చివరిలో అధ్యక్షులు మీ ముందు ఉంచబోతున్నారు.సభలోనే విజయవాడలో ఒక సమగ్ర కార్యాలయాన్ని కూడా మనం ఏర్పాటు చేసుకోబోతున్నాం.వెబ్‌సైట్‌ను,పుస్తకాలను ఆవిష్కరించుకోబోతున్నాం

## తెలుగు మృతభాష కాకుండా జాగ్రత్త పడదాం..
## -మండలి బుద్ధప్రసాద్.

ఆత్మీయ అతిథిగా హాజరైన ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ గారు మాట్లాడుతూ..గత ఇరవై యేళ్ళలో తెలుగుభాషోద్యమ సమాఖ్య సాధించిన విజయాలను ప్రస్తావించారు.దురదృష్టమేమంటే ఈ విజయాలేవీ అమలుకాలేదు అన్నారు.ముఖ్యంగాతెలుగుభాషకు



ప్రత్యేక. శాఖ,ప్రాధికార సంస్థ ఏర్పాటు ఏర్పాటు నిర్ణయాలు ఆచరణ లోకి రాకపోవడం విచారకరం అన్నారు..

తెలుగు భాష దుస్థితికి కార్పొరేట్ సంస్థలు ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. ఇంగ్లీషులో చదువుకోకపోతే ఉద్యోగాలు రావని తల్లిదండ్రుల మైండ్ ను వాష్ చేశారనిచెప్పారు.ఫలితంగా తెలుగు భాష అమలు కుంటుపడుతోందన్నారు.ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి తెలుగు అకాడమీని,తెలుగు సంస్కృత అకాడెమీగా మార్చడం అన్యాయమన్నారు.ప్రస్తుతం తెలుగుభాష పరిస్థితి బాగోలేక పోవడానికి ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలే కారణమన్నారు.

ఇంగ్లీషుకు ఎవరూ వ్యతిరేకం కాదని, తెలుగుతో పాటు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు.ఇంగ్లీషు ఇందుకు మినహాయింపుకాదన్నారు. తెలుగు భాషను మృత భాషగా మారకుండాచూడాల్సిన బాధ్యత అందరిపైన వున్నదన్నారు.తెలుగువారు తెలుగు లోనే మాట్లాడాలి. తెలుగును జనభాషగా అమలు చేయడానికి తెలుగువారందరూ కృషిచేయాలన్నారు. భారతీయ జాతీయోద్యమం మాతృభాషల అమలుకోసం ప్రారంభమైందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు..అమ్మనుడి తెలుగు భాషకు దీపస్తంభం లాంటిదన్నారు..

'చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదే కాక, చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది'

-డి.ఎస్.కొఠారి

**ఆత్మీయ అతిథి, విశ్రాంత ప్రభుత్వ పాలనాధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు గారి ప్రసంగ సారాంశం:**



విద్యారంగాలలో మాతృభాష వాడుక చాలా మంచి ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు, పాలకులూ అధికారులూ వారికి సేవ చేసేవాళ్ళు. ప్రజలకు కావలసిన అవసరాలను అందించడమే పాలకుల యొక్క పని. అటువంటి పాలనను మాతృభాషలో ప్రజలకు అందించే నైతిక బాధ్యత పాలకులపై ఉంటుంది. కానీ చాలామంది అధికారులు మాతృభాషకి సముచిత స్థానాన్ని పాలనా రంగంలో అందించడం లేదని తెలిపారు. విద్య కూడా ప్రజల భాషలో ప్రజలకు అందించడం పాలకులు వారి బాధ్యతగా స్వీకరించాలి.

పరిపాలనలోనూ, విద్యారంగంలోనూ మాతృభాషను పూర్తి స్థాయిలో అమలుపరచడానికి సంకల్ప బలంతో పాలకులు పనిచేయాలని సూచించారు. పాలకులు సంకల్ప బలంతో పూర్తిస్థాయిలో మాతృభాషలో పనిచేయడానికి కావలసిన వనరులు కూడా ఉన్నాయి. అన్నారు. పాలనా రంగంలో కూడా పూర్తిగా మాతృభాషలో ఉండడానికి కావలసిన సరైన భాషా కోశాలు ఉన్నాయి. వాటిని వాడుకలో ఉంచడం లేదు. పాలకులు చొరవ తీసుకుని మాతృభాష ద్వారా ప్రజలకు పరిపాలన అందించడం ముఖ్యమైన అంశం. దానికి ఉదాహరణగా, జిల్లాలకు వచ్చే కలెక్టర్లలో కొందరు వచ్చేపోయేవారు ఉంటారు ఇంకొందరు మంచిగా ఉండి నిలిచిపోయేవారు ఉంటారు. వచ్చే పోయే కలెక్టర్లు కొంతైనా పనిచేస్తే వారి కింద ఉండే అన్ని విభాగాలూ పనిచేస్తూ ఉంటాయి. కలెక్టర్ పూర్తి స్థాయిలో పనిచేయకపోయినా యంత్రాంగం ద్వారా అన్ని పనులూ అవుతూ ఉంటాయి. కానీ మంచి కలెక్టరు తన యంత్రాంగానికి ఎప్పుడూ స్ఫూర్తిని అందిస్తూ, ప్రేరణ కలిగిస్తూ వారు చేస్తున్న పని ఎందుకు చేస్తున్నారో తెలియజేయడం వల్ల ఆ యంత్రాంగం మరింత అర్థవంతంగా పనిచేస్తూ ఉంటుంది. ఆ విధంగా కలెక్టర్ తన యంత్రాంగానికి స్ఫూర్తిగా నిలిచి పనిచేస్తారు. అప్పుడు ఆ కలెక్టర్ చేసే పని యొక్క ఫలితం 1000 రెట్లుగా ఉంటుందని తెలిపారు. కాబట్టి పాలకులు ప్రజలకు కావలసిన పాలనను పూర్తిస్థాయిలో మాతృభాషలో అందించాలి.

**తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవ సభలో మాట్లాడుతూ ప్రొఫెసర్ జోగాసింహ్ ఇలా అన్నారు**



సమాజానికి అన్ని రంగాలలోనూ సమానత్వం కలిగించ లేనప్పుడు సమాజం ఛిన్నాభిన్నమవుతుంది. సమాన అవకాశాలు విద్య ద్వారా అందరికీ అందించగలగాలి. కానీ ఇంగ్లీషు భాషద్వారా ఆ సమానత్వ సూత్రాన్ని కాలరాసి ప్రజలకు సమాన అవకాశాలు దొరకకుండా పేదవాళ్ళని ఇంకా పేదవాళ్లుగా చేస్తూ దేశాన్ని పేదరికంలోకి నెట్టివేస్తున్నాయి ప్రభుత్వాల నిర్వాకాలు.

భారతదేశంలో విద్య ప్రైవేటీకరణ జరగడం వల్ల విద్య ఒక వ్యాపార అంశంగా మారిపోయింది. ప్రైవేటు విద్య పేరుతో ప్రజల డబ్బులు దోచుకుంటున్నారు. విద్యా వ్యాపారవేత్తలు. ప్రైవేటు రంగంలో ఇంగ్లీష్ మాధ్యమ విద్య దోచుకునేందుకు ఒక ముఖ్య సాధనంగా మారింది. భాష ఒక వినిమయ వస్తువుగా ఈరోజు మార్కెట్లో వ్యాపార అంశంగా మారింది. ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొనేందుకు అంతర్జాతీయ గుత్తాధిపత్య వ్యాపార సంస్థలు దీనిని ఆక్రమిస్తున్నాయి. ప్రజలు తమ ఆర్థిక ఇబ్బందుల్లో నుంచి బయటపడడానికి తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి తపన పడతారు. నేడు ఉన్న పరిస్థితుల్లో ఇంగ్లీష్ భాషకు ఆర్థిక అవసరాన్ని సృష్టించి ప్రైవేట్ విద్యలో దీన్ని డబ్బు సంపాదించేందుకు వీలుగా కార్పొరేట్ వాళ్లు మలచుకున్నారు. ఈ కార్పొరేట్ వ్యవస్థ ముఖ్యంగా రెండు విషయాలపై తమ దృష్టిని కేంద్రీకరించింది. అందులో ఒకటి వ్యవసాయం, మరొకటి విద్య. వ్యవసాయాన్ని ప్రైవేటీకరణ చేసి దానిద్వారా అక్రమంగా సంపాదించాలని ఒక ఎత్తుగడ వేశారు. రెండవది ప్రజలకు విద్యను ఇంగ్లీష్ మాధ్యమం ద్వారా అందించి భాష పేరుతో అధిక డబ్బును సంపాదిస్తున్నారు. ప్రైవేట్ విద్యతో ఇంగ్లీష్ మాధ్యమం పేరుతో పేద ప్రజలకు విద్యను దూరం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు కల్పించకుండా ప్రజలను ఇంగ్లీష్ మాధ్యమం వైపు నడిపి కార్పొరేట్లకు మేలు కలిగేలా చేస్తున్నవి ఈ ప్రభుత్వాలు. ప్రైవేట్ విద్యా సంస్థలు నిలదొక్కుకోటానికి ఇంగ్లీష్ మాధ్యమాన్ని ఆశ్రయిస్తున్నాయి. ఇంగ్లీషును ప్రజలకు అందరికీ అవసరంగా మార్చడానికి, అన్ని రంగాలలో దాని పెత్తనాన్ని ప్రజలకు చూపిస్తూ, ఇంగ్లీష్ మాధ్యమం వైపు ప్రజలను మళ్లిస్తున్నారు. మరోవైపు సామాన్యులకు ప్రభుత్వ విద్య కూడా అందడం లేదు. సరైన సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలలో కలగాలంటే, ఎమ్మెల్యేలు ఎంపీలు అధికారులు వాళ్ళ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి. కానీ అది చేయకుండా ఇంగ్లీష్ మాధ్యమం విద్య పేరుతో సమాజాన్ని పేదలూ, ధనికులుగా చీలుస్తున్నారు. నూతన విద్యా విధానం కూడా, ఎక్కడైతే వీలవుతుందో అక్కడ మాతృభాషను విద్యా మాధ్యమంగా ఐదో తరగతి వరకు వీలైతే ఆపైవరకూ పెట్టాలని సూచించింది. కానీ రాజ్యాంగంలో విద్య ఉమ్మడిజాబితాలో ఉన్నందున అది ఎలా సాధ్యం? ఉన్నత విద్యలో మాతృభాషా మాధ్యమ విద్యా విధానం లేకపోతే అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది? ఆధునిక కాలంలో భాష సంభాషించుకోవడానికి సమాచారాన్ని పంచుకోవడానికి మాత్రమే ఉపయోగపడేది కాదు, సమాజంలో ఆర్థిక సామాజిక ఆధిపత్యాన్ని చూపిస్తుంది. అందుకని కార్పొరేట్లు ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రజలకు అవసరంగా చూపించి డబ్బులు సంపాదించే సాధనంగా ఉపయోగిస్తున్నారు. విద్యను కార్పొరేట్ల చేతుల నుండి ఇంగ్లీష్ మాధ్యమ సంకెళ్ళ నుండి విడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజా ప్రతినిధులు కూడా ప్రపంచంలో ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థానంలో ఉన్న దేశాలకు గల కారణాలను పరిశీలించాలి. చైనా, జపాన్, కొరియా మొదలగు దేశాలు ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికంగా ముందడుగులో ఉండడానికి గల కారణం - వారు విద్యను మాతృభాషలో అందించడమే.

# ప్రాథమిక విద్యను కాపాడుకుందాం!



తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శిగా పాఠశాల విద్య బాధ్యతలను చేపట్టనున్న డా. గుంటుపల్లి శ్రీనివాస్ ప్రసంగంలో ముఖ్యాంశాలు ఇవి:

ప్రస్తుతం మనం చాలా సంక్లిష్టమైన స్థితిలో ఉన్నాం. మన సమాజంలో వేగంగా జరుగుతున్న నష్టదాయకమైన మార్పులు, సమాజాన్ని తిరిగి మంచి మార్గం లోకి మరల్చడం అసంభవమా అన్న నిర్వేదాన్ని కలిగించేవిగా ఉన్నాయి.

**1.తెలుగు భాష అభివృద్ధి కోసం పోరాడుతున్న వారందరూ ముందుగా ఆత్మన్యూనత ను వదిలిపెట్టాలి.** ఎందుకంటే తెలుగు భాష అభివృద్ధి గురించి మాట్లాడిన ప్రతీసారి కర్ణాటక, తమిళనాడు, కేరళ వాళ్లకు భాషాభిమానం ఎక్కువ, వాళ్ళు ఉద్యమాలు చేసి ప్రభుత్వాల తప్పుడు విధానాలను అడ్డుకుంటారు, దానికోసం హింసకు కూడా వెనకాడరు. కానీ మన తెలుగు వారికి భాష పై అభిమానం లేదు... అందుకే పాఠశాల విద్య లో ఇంగ్లీష్ మీడియం ఎక్కువగా చేరుతున్నారు అని చెప్తూ ... మనల్ని మనం తక్కువ చేసుకుంటున్నాము. నిజానికి DISE గణాంకాలు పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలలో ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థుల శాతాలలో ఎటువంటి వ్యత్యాసమూ లేదు.కాబట్టి వాస్తవాల ఆధారంగా మనం మన అభిప్రాయాలు ఏర్పరచుకోవాలి. 40 సం. రాల క్రింద వయస్సు ఉన్న వారిలో .... భాషాసంస్కృతు లపై అభిమానం కలిగివుండటం లో తెలుగు వారు దక్షిణాదిన ఉన్న ఎవరికన్నా తక్కువ కాదు.

**2. ప్రాథమిక విద్య ఇంగ్లీష్ మీడియం లో ఉండటం వలన సమాజం లో అసమానతలు పెరుగుతున్నాయి. ప్రొఫెషనల్ కోర్సులలో సీట్లు పొందుతున్న వారిలో 90% పై చిలుకు మంది విద్యావంతుల కుటుంబాలలోని వారే ... వారు OC BC SC ST ఏ వర్గానికి చెందిన వారైనా సరే.**

దీనికి ముఖ్యమైన కారణం ఏమిటంటే ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులకు బడిలో జరిగే బోధనా సమయం సరిపోదు ... ఇంగ్లీష్ లో ఉన్న పాఠాలను ఇంటి వద్ద వివరించి చెప్పే తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యుల సహకారం, సమయం ఎంతో అవసరం. ఆ చదువుకొటానికి తగిన వాతావరణం, సౌకర్యాలు Learning environment ను అందించలేని కుటుంబాలలోని పిల్లలకు సహజసిద్ధమైన తెలివితేటలు ఉన్నా కూడా ... వారు చదువులో వెనుకబడుతున్నారు.

**3. ప్రస్తుతం చదువులో సృజనాత్మకత తగ్గి,అంతా బట్టీయమే !**

ఒకప్పుడు ఇష్టం లేని , సరిగా అర్థంకాని పాఠాలు , సబ్జెక్ట్ లు మాత్రమే బట్టీ పట్టేవారు. సరిగా రాని ఆయా సబ్జెక్ట్ చదవడానికే అత్యధిక కేటాయించుకునే వారు. ఆ విషయాన్నే జాతి పిత మహాత్మా గాంధీ తన ఆత్మకథ లో ఈ విధంగా వ్రాశారు. పాఠశాల దశలో తనకు 50% సమయం అంతా ఒక్క ఇంగ్లీష్ లాంగ్వేజ్ లోని పాఠాలు చదవడానికి వెచ్చించాల్సి వచ్చిందని, మిగతా అన్ని సబ్జెక్టులు కలిపి మిగిలిన 50% సమయం కేటాయించుకున్నానని వ్రాశారు. కానీ ఇప్పుడు ఇంగ్లీష్ మీడియం చదువుల వలన విద్యార్థులు అన్నీ సబ్జెక్ట్ లు బట్టీ పట్టాల్సివస్తుంది .... కారణం వారికి ఇంగ్లీష్ భాష పై కనీస పట్టు లేకుండా, ఇంగ్లీషులోనే లెక్కలు - సైన్స్ - సోషల్ చదవాల్సి రావడం వలన, విద్యార్థులు విధిగా బట్టీ కొట్టడం మినహా వేరే మార్గం లేదు.

అందువలన విద్యార్థులలో పుట్టుకతో జన్యువుల మూలంగా వచ్చిన తెలివితేటలు ఉన్నా కూడా, బట్టీ కొట్టి గుర్తుపెట్టుకోవడం కోసమే వారి సమయం,శక్తియుక్తులు సరిపోతున్నాయి.... ఇక సృజనాత్మకత వికసించడానికి సమయమెక్కడ !

ఈ అసమానతలు పెరగటానికి ఇంగ్లీష్ మీడియం ప్రధానమైన కారణం . ఈ పెరుగుతున్న అసమానతలు సమాజంలో అశాంతికి దారితీసి , ప్రజాస్వామ్యానికే ముప్పుకలిగిస్తాయి.

**4.మరి కొద్దిమంది వాదన ఏమిటంటే : ఇంగ్లీష్ మీడియం వలన సృజనాత్మకతకు వచ్చే నష్టం ఏమీ లేదు,** ఎందుకంటే ఇంగ్లీష్ మీడియం బడులలో పుస్తకాలు ఇంగ్లీష్ లో ఉన్నా కూడా ... తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠాన్ని తెలుగు లోనే అర్థం అయ్యే విధంగా వివరించి చెప్తున్నారు. కావున ఇంగ్లీష్‌లో పాఠాల వలన అర్థం కాకపోవడం అనే సమస్యే ఉత్పన్నం అవ్వదు. ఇంగ్లీష్ మీడియం లో జరిగేది-పుస్తకాలు ఇంగ్లీష్ లో ఉంటాయి,పరీక్షలు ఇంగ్లీష్ లో వ్రాయాలి... అంతే. మిగతా అంతా తెలుగు లోనే కదా!అని వారి వాదన.

ఈ వాదన లోని వాస్తవాలను అర్థం చేసుకోవడానికి నాగాలాండ్ ఒక చక్కటి ఉదాహరణ. నాగాలాండ్ లోని ప్రజల్లో అత్యధికులు నగమీస్ మరియు ఇతర గిరిజన భాషలు మాట్లాడతారు. అయితే వాటికి లిపి లేదు.1930 లలో క్రిస్టియన్ మిషనరీ లు ఏర్పాటు చేసిన పాఠశాల నుండి నేటి వరకు కూడా అక్కడ అంతా ఇంగ్లీష్ మాధ్యమమే! నిజానికి ఇంగ్లీష్‌వారి రాష్ట్ర అధికార భాష కూడా. సుమారు 90 సంవత్సరాల నుండి అక్కడి బడులలో ఇంగ్లీష్ మాధ్యమం లో మాత్రమే బోధన జరుగుతుంది. కావున ఉపాధ్యాయులందరూ కూడా ప్రాథమిక స్థాయి నుండే ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకున్నవారే ! అక్కడ తల్లులలో అక్షరాస్యతా శాతం,ఆంధ్ర ప్రదేశ్ కన్నా ఎక్కువ. అక్కడ అక్షరాస్యత అంటే ఇంగ్లీష్ లోనే( గిరిజన భాషలకు లిపి లేదుకదా అందుచేత అక్షరాస్యత అంటే ఇంగ్లీష్ లో అక్షరాస్యత అని అర్థం!

**90 సం.రాల నుండి 4 తరాలు ఇంగ్లీష్ మీడియం లో చదువుతున్న నాగాలాండ్ వాసులకు .... అదికూడా ప్రాథమిక బడిలో ప్రతీ తరగతికి ఒక ప్రత్యేక ఉపాధ్యాయుడు ఉన్నా కూడా c అక్కడి విద్యాప్రమాణాలు ఆంధ్ర ప్రదేశ్ కన్నా వెనుకబడి ఉన్నాయి. మరియు ఉన్నత విద్యాసంస్థల ప్రవేశాలలో కానీ .... ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో కానీ,మరియు సృజనాత్మక లో కూడా ఎంతో**

వెనుకబడి ఉన్నారు.దీనికి ముఖ్యకారణం నాగాలాండ్ లో ఇంటి భాష వేరు,బడి భాష వేరు.

**5. విద్యా ప్రమాణాల పతనానికి ఇంగ్లీష్ మాధ్యమానికి అవినాభావ సంబంధం ఉంది.భారత దేశం లో బడికి వెళ్ళే విద్యార్థులలో 25% మందికి చదవడం వ్రాయడం లాంటివి కనీస సామర్థ్యాలు కూడా రాకపోవడానికి, ముఖ్యకారణం వారి బడి చదువులు మాతృభాషా మాధ్యమం లో జరగకపోవడమే. ఈ సమస్య మరింత సులువుగా అర్థం అవ్వడానికి ఒక ఉదాహరణ చెప్తాను**. బెండపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ లోని నలుగురు విద్యార్థులు అమెరికన్ యాస లో ఇంగ్లీష్ అనర్ఘళంగా మాట్లాడుతున్నారని వీడియో లలో చూశాము , మరియు ఆ విద్యార్థులు గౌరవ ముఖ్యమంత్రి గారి ముందు కూడా వారి ఇంగ్లీష్ ప్రతిభను ప్రదర్శించారు. వీరిని చూపించి రాష్ట్రంలో పాటశాల విద్య కొత్తపుంతలు తొక్కుతున్నదని, నాణ్యతలో పతాక స్థాయికి చేరుతుందని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి వాస్తవం ఏమిటంటే రాష్ట్ర ప్రభుత్వం 2022 లో నిర్వహించిన బేస్ లైన్ పరీక్షలో , అదే బెండపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ లోని 9 , 10 తరగతి విద్యార్థులలో సుమారు నూటికి 48% మందికి This is my home , I like this book' లాంటి చిన్న చిన్న ఇంగ్లీష్ వాక్యాలు కూడా చదవడం రాదు.

**ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఒక విషప్రచారం ఏమిటంటే** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెడుతుంటే అడ్డుకుంటున్నారు అని. నిజానికి ఆంధ్రప్రదేశ్ లో 2008 నుండి హైస్కూల్స్‌లో, 2018 నుండి ప్రాథమిక బడులలో ఇంగ్లీష్ మీడియం ఉంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నది ఏమిటంటే తెలుగు మీడియంను పూర్తిగా రద్దు చేయడమే.ప్రభుత్వంవారు చేస్తున్న మరొక వాదన ఏమిటంటే తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్లోబల్ మార్కెట్‌లో పోటీపడటానికి అనుగుణంగా విధాన నిర్ణయం చేశామని చెప్తున్నారు. ప్రముఖవిద్యావేత్త పరిమి గారు చెప్పినట్లు పాటశాల విద్యలో ప్రభుత్వాలు చేసే ఏ నిర్ణయాలు అయినా విద్యార్థుల యొక్క నేర్చుకునే స్వభావాలు, మానసిక ఎదుగుదల ఆధారంగా మాత్రమే చేయాలి. ASER నివేదికలు, నేషనల్ అఛీవ్‌మెంట్స్ సర్వేలు రాష్ట్రంలో బడి ఈడు పిల్లలకు కనీస సామర్థ్యాలు కూడా లేవు అని తెలుపుతున్నా కూడా, వారిపై నిర్బంధ ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం అనేది అహేతుకమైన, అప్రజాస్వామిక విధానం మరియు ఇది పిల్లల యొక్క విద్యా సామర్థ్యాలను మరింత దిగజారుస్తుంది .

**6.గడచిన 30-40 సం. రాలుగా ఇంగ్లీష్ మాధ్యమం పెరగటానికి ప్రధాన కారణం ఏమిటి అన్నది ఒక ముఖ్యమైన ప్రశ్న . దీనికి కొద్దిమంది చేస్తున్న బలమైన వాదన ఏమిటంటే ఇదంతా గ్లోబలైజేషన్ వలన, మార్కెట్ శక్తుల వలన, సరళీకరణ విధానాల వలన జరుగుతున్నది అని . వాస్తవానికి ఇది ప్రభుత్వాల ఆర్థిక విధానాల వలన ఉద్భవించిన సమస్య కాదు , భాషా సంస్కృతులపై అభిమానం లేకపోవడం వలన వచ్చిన సమస్య అంతకన్నా కాదు.దీనికి ముఖ్యమైన కారణం బడి లో భాషలు బోధించే విధానం లో ఉన్న లోపం.** ఇది మరింత సులువుగా అర్థం అవ్వడం కోసం హిందీ ని ఉదాహరణగా తీసుకొని వివరిస్తాను. 1920 వ దశకంలో జాతిపిత మహాత్మా గాంధీ దక్షిణభారత హిందీ ప్రచార సభను నెలకొల్పారు. దీని ముఖ్య ఉద్దేశ్యం హిందీ మాట్లాడటం వస్తే దక్షిణ భారత దేశ ప్రజలు, ఉత్తర భారతదేశ ప్రజల మధ్య సంబంధబాంధవ్యాలు బాగా ఏర్పడతాయి అని, తద్వారా జాతి నిర్మాణం మరింత పరిపుష్టమవుతుందని ఆశించారు. ప్రస్తుత ఆంధ్ర , రాయలసీమ జిల్లాలలోని హైస్కూళ్ళలో 1930 లలో నుండే 6 తరగతి నుండి 9 వ తరగతి వరకు విధిగా హిందీ ని బోధించేవారు. తదుపరి 10వతరగతి, 1955-56 నుండి ఎస్‌ఎస్‌ఎల్‌సి పబ్లిక్ పరీక్షలలో హిందీని తప్పనిసరి చేశారు

మహాత్మా గాంధీ మరణించేవరకు దక్షిణ భారత హిందీ ప్రచార సభకు ఆయనే అధ్యక్షుడు...కారణం తాను అధ్యక్ష పదవిని వదిలేస్తే, ఉత్తర భారత దేశానికి చెందిన హిందీ పండితులు ఆ స్థానంలోకి వచ్చి, తమ పాండిత్యంతో దక్షిణ భారత దేశ ప్రజలను బెంబేలెత్తిస్తారు అని, తద్వారా దక్షిణ భారత హిందీ ప్రచార సభ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అయిన సరళమైన, అర్థమయ్యే COMMUNICATIVE హిందీ నేర్పడం అనేది మరుగునపడిపోతుందని ఆయన భావించారు.

1930 లలో నుండి ఇప్పటి వరకు సుమారు 4 తరాలుగా ఆంధ్రప్రదేశ్ హైస్కూళ్ళలో హిందీ నేర్పుతున్నా కూడా , పరీక్షలు పాస్ అయినా కూడా .... ఇక్కడి ప్రజలకు దుకాణానికి వెళ్ళి , హిందీ లో బేరసారాలు ఆడి ఒక చిన్న సబ్బు బిళ్ళ కొనుక్కొని రాగల భాషా నైపుణ్యం ఎంతమందికి ఉంది ? అంటే లోపం ఎక్కడ ఉంది?

1948 లో భారత రాజ్యాంగ పరిషత్ చర్చలలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ మేము గాంధీజీ పిలుపు మేరకు జాతీయోద్యమంలో భాగంగా, రాత్రిపూట బడులు నెలకొల్పి హిందీ నేర్చుకున్నాము, పరీక్షలు పాస్ అయ్యాము. హిందీ చక్కగా చదవగలమూ ... వ్రాయగలమూ, కానీ మాట్లాడలేము అని చెప్పారు. విద్యా ప్రమాణాలు ఘోరంగా పతనమయిన ప్రస్తుత స్థితిలో మనకు బడిలో హిందీ మంచి మార్కులతో పాస్ అవుతున్నాము కానీ హిందీ లో పత్రికలు చదవలేము,వార్తలు విని అర్థం చేసుకోలేము , ఇక మాట్లాడటం సంగతి చెప్పనక్కర్లేదు!

ఈ స్థితికి ముఖ్యమైన కారణం భాషలను బోధించే విధానం, భాషల నైపుణ్యాలను పరీక్షించే విధానం లోపభూయిష్టంగా ఉండటమే మన మాతృభాష అయిన తెలుగు ను కూడా మనం బట్టీ పట్టడమే చేస్తున్నాము.మన పిల్లలు సొంతంగా ఆలోచించి వ్రాయలేకపోతున్నారు. దీనికి ముఖ్య కారణం బడిలో భాషలను బోధించే విధానంలో ఉన్న లోపమే ముఖ్యకారణం. వేరే దేశాలలో ఆయా మాతృభాషలను వారి పిల్లలకు ఎలా నేర్పుతున్నారు అన్న విషయంపై SCERT వారు ఒక్క పరిశోధన కూడా చేయలేదు, కనీసం చర్చ కూడా చేయడం లేదు. కానీ పౌరసమాజం బాధ్యతగా ఆలోచించి ఆదిశగా అడుగులు వేయాలి.

**ప్రస్తుతం ఉన్న జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ ' knowledge based economy' లో సృజనాత్మక లేకపోతే, సంపద సృషించబడదు. అప్పుడు ప్రభుత్వాలకు వ పన్నులు మరింతగా తగ్గి , తద్వారా పేద ప్రజల కిచ్చే ప్రోత్సాహకాలు బాగా తగ్గిపోతాయి. అది రాజకీయంగా పార్టీలకు నష్టం చేస్తుంది, వారిని అధికారాకి దూరంచేస్తుంది. కావున రాజకీయపార్టీ లు ముందుగా మేల్కొని సృజనాత్మకతను పెంపొందించే పాఠశాల విద్యను అందించాలని, అది మాతృభాషా మాధ్యమంలో మాత్రమే సాధ్యం కాబట్టి ... రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా ఆదిశగా అడుగులువేయాలని ఆశిస్తున్నాను.**

# “అమ్మనుడి సంపాదకీయాల సమాహారం” పుస్తక విడుదల



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.మండలి బుద్ధప్రసాద్ తదితర పెద్దలు



శ్రీ మండలి బుద్ధప్రసాద్ ప్రారంభోపన్యాసం చేసిన తర్వాత 2015 మార్చి నెల నుండి 2023 ఫిబ్రవరి వరకు ‘అమ్మనుడి’ ‘సంపాదకీయాల సమాహారం’ పుస్తకాన్ని విడుదల చేశారు. ఆయనకు శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు సహకరించారు. ఈ సందర్భంగా శ్రీ బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అమ్మనుడి పత్రిక సంపాదకుడు డా. సామల రమేష్‌బాబు తెలుగు భాషోద్యమంలో చేసిన కృషికి తొలుత 2013వరకు ‘నడుస్తున్న చరిత్ర’ నిదర్శనం కాగా, 2015నుండి తెలుగు భాషోద్యమానికి ‘అమ్మనుడి’ దారిదీపంగా నిలిచిందని అన్నారు. రెండు పత్రికల్లో సంపాదకీయాలకు ఎంతో విలువ ఉన్నదని అన్నారు. 25 ఏళ్ళపాటు ఉద్యమానికి అంకితమై రమేష్‌బాబు తెలుగుభాషోద్యమ సమాఖ్య నేతగానేగాక, పత్రికా సంపాదకుడుగా కూడా తెలుగు కోసం ఎంతో సేవ చేశారని ప్రశంసించారు. ‘నడుస్తున్న చరిత్ర’ సంపాదకీయాలను కూడా ఒక పుస్తకంగా త్వరలో ప్రచురించాలని ఆయన ఆకాంక్షించారు. రమేష్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు స్ఫూర్తి, మార్గదర్శకుడూ కీ.శే.ధర్మారావుగారికి ఎంతో ఋణపడివున్నానని, ఇప్పుడు ఆయన సజీవులైవుంటే ఎంతో సంతోషించేవారనీ అన్నారు.

ఆయనే సమాఖ్య అధ్యక్ష బాధ్యత తనకు అప్పగించారని, 2022 ఫిబ్రవరి 21 నుండి ఈ బాధ్యతను ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు చేపట్టారని,ఇది ఎంతో మంచి పరిణామమని అన్నారు. ఈ పుస్తకం వెలువడటానికి ఆయన పట్టుదలే కారణమని అన్నారు. ఆయనకు, సహకరించిన అందరకూ తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తకాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య తొలి అధ్యక్షులు కీ.శే.సి.ధర్మారావు గారికి అంకితమిచ్చారు. ధర్మారావుగారి తరపున ఆయన పెద్దఅల్లుడు శ్రీ సుధాకర్ సభలో స్వీకరించారు.




తొలి ప్రతిని స్వీకరిస్తున్న కీ.శే.సి.ధర్మారావు గారి అల్లుడు శ్రీ సుధాకర్

# ‘భాష-అంతర్జాతీయ భావన’ విడుదల

ఈ సందర్భంలో మరి రెండు చిన్న పుస్తకాల విడుదల జరిగింది. అది:1ఆచార్య జోగాసింహ్ రచించిన 24 పుటల పుస్తకం ‘భాష-అంతర్జాతీయ భావన’.ఇది-విద్యాభ్యాసం, జ్ఞానసముపార్జన, విజ్ఞాన శాస్త్ర అధ్యయనం, ఆంగ్లభాషాధ్యయనంలలో మాతృభాష ప్రాధాన్యతను ఈ పుస్తకం వివరిస్తుంది. తొలుత ఈ పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. దీని తెలుగుసేత-శ్రీ మనోహర్ బొరంచ. ముందు ఇది 2013 ఆగష్టు 29న ప్రచురించారు. ఇప్పుడు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా మళ్ళీ తెలుగుభాషోద్యమ సమాఖ్య ప్రచురించింది.

ఈ పుస్తకాన్ని సభలో పూర్వ నల్గొండ జిల్లాపాలనాధికారి, సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో భాషా సాంస్కృతి శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేసి, విశ్రాంత జీవనంలో తెలుగు భాషోద్యమంలో చురుకుగా పాలుపంచుకుంటున్న శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు విడుదల చేశారు..



‘భాష-అంతర్జాతీయ భావన’,‘తెలుగు భాష-ఆశయ ప్రకటన’ పుస్తకాలను విడుదల చేస్తున్న శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు, తదితరులు

ఇదే సందర్భంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య మరొక చిన్న పుస్తకాన్ని కూడా శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు విడుదల చేశారు. అది-‘తెలుగుభాష ఆశయప్రకటన (ఆంధ్రప్రదేశ్,తెలంగాణ). దీనిని తొలుత 2021 ఫిబ్రవరి 21న విడుదల చేశారు.ఇది తాజా ముద్రణ. తెలుగువారందరూ తమ రోజువారి వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి అనే ఆశయంతో అందమైన కలను నిజం చేసుకోవడానికి 5 సూత్రాలను ఇందులో మీరు తెలుసుకోవచ్చు. ఆధునిక స్థాయిని సాధించేందుకు దారిదీపాలీ ఐదు సూత్రాలు.

# ‘అమ్మనుడి’ వలగూడు (వెబ్‌సైట్) విడుదల

తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు గారపాటి ఉమామహేశ్వరరావుగారు శ్రద్ధ తీసుకుని అమ్మనుడి వలగూడు (వెబ్‌సైట్) ను రూపొందించారు. దీనిని ఈ సందర్భంగా సభా వేదికపై ఆవిష్కరించారు. తెలుగు భాషా వికాసానికి సంబంధించిన తాజా విశేషాలను కూడా ఈ వలగూడులో సందర్శించవచ్చు. ammanudi.org లో దీనిని చూడవచ్చు.



తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవ సభలో ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ముగింపు ప్రసంగం చేశారు.త్వరలోనే సమాఖ్య, అమ్మనుడిపత్రిక, తెలుగుజాతి ట్రస్టులకు ఒక సమగ్ర కార్యాలయాన్ని కూడా విజయవాడలో మనం ఏర్పాటుచేసుకోబోతున్నామని సభికుల హర్షధ్వానాలమధ్య ప్రకటించారు.అందులోనే- పరిశోధక విద్యార్థులకు, తెలుగుకోసం పనిచేస్తున్నవారందరికీ తగిన శిక్షణా వ్యవస్థను కూడా ఏర్పాటుచేసుకోబోతున్నామని ప్రకటించారు. **తెలుగు భాషోద్యమ సమాఖ్య సరికొత్త ఉద్యమ కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రకటించారు. కొత్త కార్యవర్గ నిర్వాహక మండలిని, వార్షిక కార్యక్రమాల కేలండర్‌ను ప్రకటించారు.** ఆ వివరాలను తరువాత పుటల్లో చూడండి. సమాఖ్య సమావేశకర్త డా. వెన్నిసెట్టి సింగారావు వందన సమర్పణ చేస్తూ-నేటి రెండు కార్యక్రమాలు విజయవంతంగా జరగడానికి తోడ్పడిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు భాషోద్యమ సమాఖ్య సరికొత్త కార్యక్రమం
# నిర్ణయాలు-తీర్మానాలు

**అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన విజయవాడలోని సిద్ధార్థ కళాశాల సభామందిరంలో 21-02-2023 జరిగిన మహాసభ ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ 10 నిర్ణయాల/తీర్మానాల సాధనకోసం ఈ ఉగాదినుండి సంవత్సరకాలంపాటు కార్యక్రమాలను నిర్వహించాలని సమాఖ్య తలపెట్టింది.**

1. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పాలకుల పట్టనితనానికి,రాజకీయ స్వార్థాలకు తెలుగు ప్రజల మాతృభాష,భావితరాల విద్యాభివృద్ధి తీవ్ర ప్రమాదంలో పడ్డాయని, పాలకుల ఈ ధోరణులను ఇక అడ్డుకోలేకపోతే మొత్తం తెలుగుజాతి అస్తిత్వమే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితికి చేరుకుంటున్నదని తెలుగు భాషోద్యమ సమాఖ్య అభిప్రాయపడుతున్నది. ఇందుకై ప్రజాస్వామిక పద్ధతుల్లోనే రానున్న ఉగాది నుండి సరికొత్త ఉద్యమ కార్యాచరణకు పూనుకోవాలని నిర్ణయించింది.

2. మాతృభాష కేవలం ఒక భావోద్వేగం మాత్రమే కాదు. బోధనా భాషగా, విద్యా విజ్ఞానాల వ్యాప్తికి సాధనంగా, పాలనా భాషగా ప్రజలను శక్తివంతులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి, ధార్మిక సాంస్కృతిక రంగాలలో మనదైన వారసత్వ పరంపరను కొనసాగించడానికి మాతృభాష ముఖ్యసాధనం అని తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్ద్వందంగా భావిస్తోంది. ప్రభుత్వాలు,రాజకీయపక్షాలు ఒక నిర్దిష్టమైన, నిర్మాణాత్మకమైన భాషా విధానాన్ని అవలంబించనందువల్ల ప్రజానీకం అనేక కష్టనష్టాలకు లోనవుతున్నది. దీనికి మూలకారణం అసలు ఒక విధానమే లేని రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలే. తెలుగు భాషోద్యమ సమాఖ్య దీనికోసం ప్రభుత్వానికి గత ఇరవైఏళ్ళుగా ఎన్నో విన్నపాలు చేయడంతోపాటు, ఉద్యమాలు చేస్తూనే ఉంది.

   భాష ప్రజల ఉమ్మడి సంపద. మున్ముందుకు నడిపించే సజీవ చైతన్యం. అందువల్ల మేము భాషాసమస్యను ప్రజల జీవన సమస్యగా చూస్తున్నాము. ఇప్పటికైనా ఒక నిర్దిష్ట భాషావిధాన రూపకల్పనతో రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలూ ముందుకు రాకపోతే వారికి భాష పట్ల మాత్రమే కాక, ప్రజలపట్ల కూడా ప్రేమాభిమానాలు లేవనే భావించవలసి ఉంటుంది. శాస్త్రీయత, విద్యావిజ్ఞానాల వ్యాప్తి, సమాజ పురోగతి.. ఈ మూడు సూత్రాల ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాలూ తమ భాషా విధానాలను రూపొందించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతున్నది.రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభలకు త్వరలో జరుగనున్న ఎన్నికలలో పాల్గొననున్న రాజకీయపక్షాలు తమ ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో)లలో తమ భాషావిధానాన్ని ప్రకటించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతున్నది. రెండు రాష్ట్రాలలో పాలన,బోధన రంగాల్లో తెలుగును పూర్తిగా అమలు చేయడమై తమ పార్టీ విధానాన్ని అందులో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ,ఇందుకై ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని నిర్ణయిస్తూ తెలుగుభాషోద్యమ సమాఖ్య తీర్మానిస్తున్నది.

3. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన అధికార భాషా హక్కును అన్నివిధాలా కాపాడుకొనేందుకు న్యాయస్థానాలతో సహా అన్ని రంగాల్లో కొందరు క్రియాశీలురైన ప్రజలు చేస్తున్న పోరాటాలకు తెలుగు భాషోద్యమ సమాఖ్య మద్దతు ప్రకటిస్తున్నది. సమాఖ్య నిర్ణయించింది.

4. రెండు తెలుగు రాష్ట్రాలలో పాఠశాల విద్య నానాటికి పతనమవుతున్న దౌర్భాగ్యపరిస్థితి అందరకూ తెలిసిందే.మాతృభాషా మాధ్యమ బోధన గురించీ, మొత్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అనే లక్ష్యంతోనూ కృషిచేస్తున్న అందరికీ తమ సమర్థనను తెలుపుతున్నది. ఈవిషయమై ప్రత్యేక శ్రద్ధతో ఉద్యమించాలని కూడా నిర్ణయించింది.

5. మాతృభాషలకు పొంచి వున్న ముప్పును ఎదుర్కొనడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలకై వెంటనే తగిన కార్యక్రమాన్ని చేపట్టాలనితెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్ణయించింది.

6. సమైక్యరాష్ట్రంలో ఉండగానే, చాలా సంవత్సరాల క్రితమే 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' ఒక ప్రధాన డిమాండును ప్రభుత్వం ముందు పెట్టింది.పరిపాలనలో తెలుగుభాష కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖనూ, ఒక స్వతంత్రమైన తెలుగు అభివృద్ధి ప్రాధికారసంస్థను ఏర్పాటుచేయాలని ఏళ్ళ తరబడీ ఉద్యమాన్నే నడిపింది. ఫలితంగా నాటి ప్రభుత్వం తెలుగుకు మంత్రిత్వశాఖను మాత్రం ఏర్పాటుచేసి, ప్రాధికార సంస్థ ఏర్పాటును విస్మరించింది.రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగురాష్ట్రాల్లోనూ మంత్రిత్వశాఖలను ఏర్పాటుచేసినా, వాటికి నిధులు ఇవ్వకుండా అలక్ష్యం చేశాయి. ప్రాధికార సంస్థను ఏర్పర్చడానికి విభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక చట్టాన్నే తెస్తామని వాగ్దానం చేసినా, చివరకు ఒక జీ.వోతో సరిపుచ్చారు.అది అమలులోకి వచ్చేనాటికే శాసనసభకు ఎన్నిక జరిగి పాలకపక్షం మారిపోయింది.వారు ఈ అవసరాన్ని పట్టించుకోకుండా అలక్ష్యం చేశారు.ఇప్పుడు ఈ డిమాండును సాధించుకోవడానికి మరలా తగిన ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్ణయించింది.

7. ఆధునిక భాషగా తెలుగును పరిపుష్టంచేసేందుకు తెలుగు భాషోద్యమ సమాఖ్య సాంకేతిక రంగంలో ఈ క్రింది చొరవలు తీసుకోవాలని నిర్ణయించింది.
   1. సాంకేతిక ఉపకరణాలన్నింటా, అంతటా తెలుగు కూడా కనిపించేలా సాంకేతిక సంస్థలతో కలసిపని చేయడం.
   2. మాతృభాష,ముఖ్యంగా తెలుగును మరింత మెరుగ్గా నేర్చుకునేందుకు కావాల్సిన మొబైల్ ఆప్‌లు, కోర్సులు, ఇతర వనరులను ఒక సంకలినిగా అమ్మనుడి వలగూడు ద్వారా అందుబాటులోకి తేవడం.
   3. భాషా పరిరక్షణకు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో అన్‌లైన్ ఉద్యమానికి ఊతమివ్వడం, భాష గొప్పదనాన్ని తెలిపే వ్యాసాలకు, డాక్యుమెంటరీలకు, పొట్టిచిత్రాలకు చేయూతనివ్వడం.

8. భారత రాజ్యాంగం 8వ షెడ్యూలులో గుర్తించిన 22 భాషలన్నింటిని జాతీయ అధికారభాషలుగా గుర్తిస్తూ రాజ్యాంగబద్ధమైన చట్టాన్ని తేవాలని, అవసరమైతే రాజ్యాంగ సవరణ చెయ్యాలని, చట్టసభల్లోనూ న్యాయపాలనతోసహా అన్ని రంగాల్లోనూ అన్ని భారతీయభాషలకు సాధికారతను తేవాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య డిమాండ్ చేస్తూ తీర్మానిస్తున్నది.

9. భారతీయ రాజ్యాంగంలో భారతీయ భాషలకు సముచితస్థానాన్ని ఇస్తూ అనేక అధికరణలలో ప్రస్తావించారు. భారతదేశాన్ని బహురాష్ట్రాల సమాఖ్యగా పేర్కొంటూ, అదే 'ఇండియా' లేక 'భారత్' అని స్పష్టం చేసింది. అదే సమాఖ్య స్ఫూర్తితో 'భారతీయ భాషోద్యమ సమాఖ్య'ను వివిధ రాష్ట్రాల భాషోద్యమకారులు కలిసి ఏర్పరచుకోవాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతిపాదిస్తున్నది. ఈ దిశగా తక్కిన భారతీయభాషాసంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు చొరవతీసుకోవాలని కోరుతూ నిర్ణయించింది.

10. వస్తువులపైన, మందులపైన ఉండే పేర్లు, ఇతర వివరాలు,మరియు వస్తు కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన రసీదులు విధిగా రెండు తెలుగు రాష్ట్రాల అధికారభాష అయిన తెలుగులో ఉండాలి.అందుకోసం ప్రజలను చైతన్యపరిచి ప్రజా ఉద్యమాలు, న్యాయపోరాటం చేయాలని తెలుగుభాషోద్యమ సమాఖ్య తీర్మానించింది.

# కొత్త కార్యనిర్వాహక మండలి

## 2023-25 రెండు సంవత్సరాలకు కేంద్ర కార్యనిర్వాహక మండలిని అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు సభలో ప్రకటించారు

అన్ని సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులుగా డా.చుక్కా రామయ్య గారు, డా.సామల రమేష్‌బాబు ఉంటారు.
ఉపాధ్యక్షులు: నందివెలుగు ముక్తేశ్వరరావుగారు డా.భవానీదేవీగారు
ప్రధాన కార్యదర్శి: ఇంతవరకు ఎవరినీ నిర్ణయించుకోలేదు. సమాఖ్య కార్యక్రమాలపై పూర్తి శ్రద్ధాసక్తులతో ఎక్కువ సమయాన్నిచ్చి పనిచేయదలచేవారు నేరుగా సమాఖ్య అధ్యక్షుని సంప్రదించవచ్చును.
కార్యదర్శులు: సమాఖ్య లక్ష్యాల సాధనకు చొరవతీసుకొని బాధ్యతతో పనిచేయడానికి 5 అంశాలకు మాత్రం కార్యదర్శుల ఎంపిక జరిగింది.

1.పాఠశాల విద్య :        గుంటుపల్లి శ్రీనివాస్ గారు
2.ఉన్నత విద్యా రంగం: మొవ్వా శ్రీనివాసరెడ్డి గారు
(కళాశాలలు,వృత్తి విద్యాసంస్థలు మొదలగునవి)
3.సాంకేతిక రంగం :   రెహ్మానుద్దీన్ షేక్ గారు
4.న్యాయ రంగం :      చిమ్మె జాన్ బర్నబాస్ గారు
5. జనమాధ్యమాలు :  కె.కె.కృష్ణకుమార్ గారు

ఇంకా తక్కిన ప్రాధాన్యరంగాల బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగలవారు నేరుగా అధ్యక్షుని సంప్రతించగలరు.
కోశాధికారిగా కూడా ఇంకా ఎవరినీ నిశ్చయించుకోలేదు. ఆసక్తికలవారు సంప్రతించండి.అన్ని సమావేశాలకు సభల నిర్వాహణ బాధ్యులుగా తెలంగాణకు: గంధం సుబ్బారావుగారు ఆంధ్రప్రదేశ్‌కు వెన్నిశెట్టి సింగారావుగారు వీరు సమావేశకర్తలు (కన్వీనర్‌లు)గా వ్యవహరిస్తారు.ఇంతకాలంగా సమాఖ్య కృషిలో భాగం పంచుకున్న- లేదా ఇకపై చురుకుగా వ్యవహరించదలచిన యువతరం నుంచి ఆసక్తిగలవారినుండి సభ్యులుగా కొందరిని ఎంపిక చేసుకుంటారు.ఇందుకు అధ్యక్షులు గారపాటి ఉమామహేశ్వరరావుగారని సంప్రదించగలరు.

# వార్షిక కాలెండర్

మరొక ముఖ్యమైన నిర్ణయాన్నికూడా మహాసభలో అధ్యక్షుడు ప్రకటించారు.
సమాఖ్య కార్యక్రమాలకు సంబంధించి ప్రతి ఏటా 6 ముఖ్యమైన సందర్భాలను ఎంపిక చేశారు

**1. ఫిబ్రవరి 21....** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (యునెస్కో), తెలుగుభాషోద్యమ సమాఖ్య స్థాపన
**2. మే 14......** తెలుగు అధికారభాషగా చట్టం (1966)
**3. మే 28.....** తెలుగు వారసత్వ దినోత్సవం (సురవరం ప్రతాపరెడ్డి జయంతి)
**4. ఆగస్టు 29..** తెలుగు భాషా దినోత్సవం (గిడుగు జయంతి)
**5. సెప్టెంబరు 9 .** తెలుగు మాండలీక భాషా దినోత్సవం (కాళోజీ జయంతి)
**6. సెప్టెంబరు 19.** తెలుగు జనమాధ్యమాల దినోత్సవం (తాపీధర్మారావు జయంతి)



– శ్రీగణేశ్ తొట్టెంపూడి
+4917630163660

# సెమాంటిక్ వెబ్–3: అర్ధ ఆధారిత శోధన

ఈ మధ్యకాలంలో సాంకేతిక రంగాన్ని ఉర్రూతలూపుతున్న ఉపకరణం చాట్ జిపిటి. దీనికి ఎందుకు అంత ఆదరణ లభించింది? సాధారణంగా అందరం ఏ విషయాన్ని ఐనా శోధించాలంటే మొదటిగా గుగూల్లో వెతుకుతాం. గుగూల్ ఒక శోధకం. ఆ విషయానికి సంబంధించి విభిన్న లింకులతో ఎన్నో శోధన సమాచారాలను ఇస్తుంది. కానీ ఒకే ఒక్కసరైన శోధనా సమాచారాన్ని ఇవ్వటం లేదు. ఇంకో చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, గుగూల్ని ఏదన్నా విషయం మీద ఒక వ్యాసం రాయమంటే అది అంతర్జాలంలో ఉన్న విభిన్న వ్యాసాలనుంచి సమాచారాన్నిఅందిస్తుంది కానీ తనంతట తానుగా వ్యాసాన్ని రాయటంలేదు. అంటే గుగూల్ శోధనకు సంబంధించిన అంతర్జాలంలో ఉన్న పాఠాన్నీ, దస్త్రాలనూ దాని సంబంధిత సూచక పదాలద్వారా అన్నింటినీ ఒకచోట ఉంచుతుంది కానీ ఆ పాఠం లేదా ఆ దస్త్రాలను మనిషి బౌద్ధికత అర్ధంచేసుకున్నట్లు చేసుకుని తనంతట తానుగా ఒక వ్యాసం రాయలేదు. కానీ ఆపని చాట్ జిపిటి చేస్తోంది. గుగూల్ కి సాధ్యంకానిది చాట్ జిపిటి కి ఎలా సాధ్యమైంది. ఇక్కడ సెమాంటిక్ వెబ్ ప్రధాన భూమికను పోషిస్తోంది.దీని గురించి మరింత లోతుగా ఈ సెమాంటిక్ వెబ్ నిర్మాణాన్ని పరిశీలిద్దాం. సెమాంటిక్ వెబ్ అనేది కేవలం సాధారణ శోధన చేయటమే కాకుండా, వినియోగదారుడు ఇంతకుముందు అంతర్జాలంలో శోధించిన విషయాల ఆధారంగా సరైన అంశాలను సూచించటం కుడా చేస్తుంది. ఉదాహరణకి ఒక వ్యక్తి తన కంప్యూటర్లో అంతర్జాలాన్ని ఎలా వినియోగిస్తున్నాడు అన్న దాని ఆధారంగా వినియోగదారుడికి నచ్చిన, ఆసక్తి ఉన్న అంశాలను స్వయంచాలకంగా చూపించటం కుడా ఈ సెమాంటిక్ వెబ్ చేసేపని.

"టిం బెర్నస్ లీ" వెబ్(జాలికావలయం) ని కనిపెట్టిన తర్వాత నుండీ జరిగిన పరిణామ క్రమాల్లో అర్ధాధారిత (సెమాంటిక్) శోధన ప్రధానమైనది. దీనికి అల్గారిథం ఆధారిత శోధనలు, మెషీన్ లెర్నింగ్(యంత్ర నేర్వకం) అందుబాటులోకి వచ్చాక కంప్యూటర్ తో విస్తృతంగా లోతైన శోధనలు చేయటానికి ఆస్కారం ఏర్పడింది. ఈ సెమాంటిక్ వెబ్ అంతర్జాలంలో సాధారణంగా అందుబాటులో అన్ని దస్త్రాలనూ ఆర్డిఎఫ్, స్పార్కుల్, ఓవెల్ అన్న విభిన్న అంక స్థాయి విశ్లేషణ చేసి ఒకే ఒక్క సమాధానాన్ని శోధనను కోరినవిధంగా ఇస్తుంది. ఈ విషయాలని లోతుగా పరిశీలిద్దాం.

ఆర్డిఎఫ్: దీన్ని ఆంగ్లంలో రిసోర్స్ డిస్క్రిప్షన్ ఫ్రేంవర్క్ (వనరుల వర్ణన పథకం) అంటారు. అంటే పాఠంలోఉన్న వాక్యాలను మెటాడేటా (అధిదత్తాంశాల) సహాయంతో అనుసంధించటం. దీన్నే లింకింగ్ డేటా అంటారు. ఈ లింకులు ఎక్స్.ఎం.ఎల్ లేదా యు.ఆర్.ఎల్ (ఏకరూపక వనరుల స్థానంవవిలాసం) రూపంలో అనుసంధించబడిఉంటాయి. ఇలా అనుసంధించిన పాఠంలోని ప్రతి వాక్యం "త్రిబుల్ స్టోర్" రూపంలోకి మార్చబడుతుంది. అంటే ఈ త్రిబుల్ స్టోర్ అన్నది ఒక విధంగా మనం వ్యాకరణంలో చెప్పుకునే కర్త, కర్మ, విధేయ విభాగాలకి లింకులని కల్పించటం. ఉదాహరణగా, "మ్యుల్లర్ డ్రస్డెన్ లో నివసిస్తాడు." ఈ వాక్యంలో కర్తృపదానికి కర్మ పదానికీ ఈ కింది విధంగా ఆర్డీఎఫ్ లని నిర్మించవచ్చు.

_:a<https://www.w3.org/1999/02/22-rdf-syntax-ns#type><https://schema.org/Person> .
_:a<https://schema.org/name>" ముల్లర్"

_:a<https://schema.org/birthPlace><https://www.wikidata.org/entity/Q1731> .

<https://www.wikidata.org/entity/Q1731><https://schema.org/itemtype><https://schema.org/Place>
.
<https://www.wikidata.org/entity/Q1731><https://schema.org/name>" డ్రస్డెన్".

దీంట్లో :a <https://www.w3.org/1999/02/22-rdf-syntax-ns#type><https://schema.org/Person మొదటి లింకులో ప్రాధమిక ఆర్డీఎఫ్ స్కీమా ప్రకారం మ్యుల్లర్ అన్నది ఒక వ్యక్తి పేరు అని టాగ్ చేయటం జరిగింది. రెండోవాక్యంలో _:a <https://schema.org/name> ఓవెల్ ఆంటాలజీ (సత్తాకశాస్త్రం) ప్రకారం ముల్లర్ అన్నది వ్యక్తిపేరు అని టాగ్ చేయటం జరిగింది. ఇలా ఈ లింకులనే ఉపయోగించాలి అని ఏమీ లేదు. ఆ పదం ఒక వ్యక్తికి చెందినపదం అని చెప్పాక ఇంకా లోతైన విశ్లేషణకోసం ఆ వ్యక్తికి సంబంధించిన ఏ లింకునైనా దీంట్లో పొందుపరచవచ్చు. అలానే ఆ వ్యక్తి నివసిస్తున్న ప్రదేశాన్ని కుడా విభిన్న లింకులలో టాగ్ చేయటం జరిగింది. ఈ లింకుల ద్వారా ఆ ప్రదేశం ఎక్కడ ఉన్నది అన్నది గుర్తించవచ్చు. ప్రతి పదానికి లింకులను టాగ్ చేసేటప్పుడు ఆ పదంకి టాగ్ చేసే లింకులన్నీ ఒక విషయానికి చెందినవి అని చెప్పటానికి ని వాడటం జరిగింది.నివసిస్తున్నాడు అన్నది త్రిబుల్ స్టోర్ లో మూడో భాగం అవుతుంది. దానికి సంబంధించి ఏమన్న లింకులున్నా ఇలా ఇవ్వొచ్చు.ఇలా ఆర్డీఎఫ్ లోకి టాగ్ చేశాక దీన్ని గ్రాఫ్ గా మార్చవచ్చు. ఆ విషయాలు తదుపరి వ్యాసంలో వివరిస్తాను.

> ఒక బిడ్డ మాతృభాషలో ఒక సంవత్సరం నేర్చుకున్న విద్య పరాయి భాషలో నేర్చుకోవడానికి నాలుగేళ్ళు పడుతుంది.
> –విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

శ్రీనివాస్ అంకే
9652471652

# రాయలసీమ మాండలికం - చారిత్రకత

ఆకలి,ఆచార వ్యవహారాలు భావోద్వేగాలు జీవనవిధానం కళా చైతన్యాన్ని స్థూలంగా సంస్కృతి అంటారు. సంస్కృతి యొక్క అత్యున్నత దశనే నాగరికత. నాగరిక సాంస్కృతిక అభివ్యక్తి భాష. భాష ద్వారా సంస్కృతి, సంస్కృతి ద్వారా భాష పరిపుష్టమవుతాయి. భాషంటే మూడు అక్షరాలు ఆరుపదాలు కాదు! ఒక ప్రాదేశిక సాంస్కృతిక వ్యక్తీకరణ.

క్రీ.శ 11వ శతాబ్దానికి ముందే ఉత్తరాంధ్రమాండలికం ఏర్పడిందని భద్రిరాజు కృష్ణమూర్తి,కందప్పశెట్టిగార్లు చెప్పివున్నారు. దానికి ఐదు నిదర్శనాలను చూపించారు. అవి.

1) 'ఱ' (zah) కారం రాతలో నిలిచి వుండటం

2) 'స్ట' సంయుక్తంగా కనిపించడం

3) 'చెల్లు' పదానికి 'చల్లు' అని వాడటం

4) 'నాల్గు' అనడానికి బదులు 'నాలు' రూపప్రయోగం ఉత్తరాంధ్రలోనే కనిపించడం

5)సంఖ్యావాచకాల్లోనే పదినొకండు వంటి వాటిలో -ఉన్ ప్రత్యయం కాకుండా అందు ప్రత్యయం వుండటం.

ఆనాటికి ఆంధ్రదేశంలో మూడు మాండలికాలున్నట్లు వారు అంచనా వేశారు. 1. విశాఖ-శ్రీకాకుళం, 2. మధ్యాంధ్రం, 3. దక్షిణాంధ్రం (నెల్లూరు- దక్షిణ గుంటూరు,రాయలసీమ).

అయితే రాయలసీమ మాండలిక స్వరూపం గురించి వారు ఎక్కువగా మాట్లాడలేదు. నెల్లూరు ప్రాంత వ్యవహారభాష రాయలసీమ మాండలికంలో భాగమేనని ఇప్పటికే చారిత్రక నిరూపణ జరిగింది. వారు చెప్పినట్లు దక్షిణ గుంటూరు ప్రాంత భాష కూడా రాయలసీమ మాండలికంలోనే వుండటమన్నది చాలా పరిమితమని ప్రస్తుతం స్పష్టమవుతూవుంది.

ముందుగా ఒకవిషయం గుర్తుచేసుకోవాలి. నేటి రాయలసీమ మాండలికంలో కొన్ని ప్రాచీన భాషాలక్షణాలున్నట్లు పరిశోధకులు గమనించారు. అవి కేవలం రెండింటిని ముందుగా ముచ్చటించు కోవాలి.

1) విభక్తులలో "కొఱకు, వద్ద, నుండి" మొదలైన ప్రాచీన విభక్తి రూపాలు రాయలసీమ వ్యవహారిక మాండలికంలో నిలిచేవున్నాయి.

2) ప్రాచీన భూతకాల క్రియాప్రక్రియ "-ఇనా" నేటికీ రాయలసీమ మాండలికంలో కనిపిస్తుంది.

రా.మా. ఇతర మాండలికాలు
వినినాను విన్నాను
తినినాను తిన్నాను

ఈ 'ఇనా' ప్రక్రియ ఇతరమాండలికాల్లో "-అ-" గా మారిపోయింది.

ఉత్తరాంధ్ర మాండలికం లాగానే రాయలసీమ మాండలికం కూడా క్రీ.శ. 11వ శతాబ్దానికి పూర్వమే చాలా స్పష్టమైన రూపానికి వచ్చిందని తెలుస్తోంది. దీనికి కొన్ని నిర్దిష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి.

■ 'కా' ప్రత్యయం మీద - ండ్రు, - ంఱు, - ంఢ్ర ప్రయోగాలు ఆంధ్రదేశమంతా వాడుకలో వుండేవి. కాని రాయలసీమలో వీటికి ప్రత్యామ్నాయంగా '-ఱ' రూపమే వుంది. ఉ. వాద్యాకాఱు

మిగిలిన తెలుగుదేశమంతా 'మద్దెలకాంఢ్రు, ఒత్తుకాంఱు, హాస్యకాంఱు' లాంటి ప్రయోగాలు ప్రచారంలో వుండేవి.

■ "-ంఱ (-న్టు) >గండు (-ణ్డు)' నకార, శకటరేఫల సంయుక్తాక్షరంగా ఈ రూపాలు మిగిలిన ఆంధ్రదేశమంతా వాడుకలో వున్నాయి. కాని రాయలసీమలో ప్రథమాంతంగా "వ్రిత్తికాంఱు', షష్ఠ్యంతంగా "వాఱ్రి పెద్దకొడుకు" వంటి రూపాలున్నాయి "ంఱ" రూపం నెల్లూరుజిల్లాలో ఒక్క ప్రయోగమే కనిపిస్తోంది.

■ ఇవే మాటల్ని మహద్వాచకంగానూ చర్చించుకోవాలి. -ంఱు, - ణ్డు, - దు" అనే మూడింటిలో '- ఱ' ప్రయోగమే 11వ శతాబ్దంలో వుంది. (విత్తికాంఱు) ఈ ప్రాంత ప్రత్యేక నిదర్శనమని చెప్పడానికి "వాఱ్రి పెద్దకొడుకు" మంచి నిదర్శనం. శకటరేఫ రహితంగా, మూర్ధన్యరహితంగా వుండటం విశేషం.

ఈ మూడు రూపాలూ 'న్టు' కు రూపాంతరాలు.

■ చేసిన, చేసిరి రూపాలకు క్రీ.శ ఏడవ శతాబ్దం నాటి నెల్లూరు జిల్లా భైరవకొండ శాసనంలో "కేసిన, కేసిరి" అనే తాలవ్యీకరణ జరగని రూపాలున్నట్లు కందప్పశెట్టి చెప్పివున్నారు. క్రీ.శ. 11వ శతాబ్దంలో కూడా "కింక, కీలిసె, కీడిసె" వంటి తాలవ్యీకరణ జరగని రూపాలే నెల్లూరు జిల్లా శాసనాల్లో వున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈవిధమైన రూపాలు నేటి రాయలసీమ మాండలికంలో కూడా లభిస్తున్నాయి. కళ్యాణదుర్గం సమీపంలో 'ఎరడికెర' అనే గ్రామం వుంది. దీనికి రెండు చెఱువులని అర్థం. ఇందులో 'కెర' అనే తాలవ్య రహిత రూపానికి కన్నడభాషా ప్రభావమని అనుకొనేవాన్ని. కాని ఈ ప్రాంతాల స్థానిక వ్యవహారభాషలో కేసిన (చేసిన),కెయి (చేయి) వంటి మాటలున్నాయి. ఇక్కడ చెప్పుకున్న తాలవ్యరహిత రూపాలన్నీ ముందున్న పూర్వదశను వివరించేవి. ఇవి సహస్రాబ్దం కిందటి చారిత్రక భాషావశేషరూపాలు. ఈ విలక్షణ రూపాలు రాయలసీమకు మాత్రమే చెందినవి. ఈ ప్రాచీన రూపాలు ఇంకా. అక్కడక్కడ రాయలసీమలో జీవిస్తున్నాయి. రాయలసీమ భాషా సంస్కృతుల మీద కన్నడ, తమిళ భాషలు విశేషమైన ప్రభావాన్ని చూపాయి. ముందు చెప్పుకున్నట్లు కొన్ని ప్రాచీన రూపాలు రాయలసీమలో నిలిచే వున్నాయనడానికి ఇది కూడా ఒక ఉదాహరణే.

■ భూతార్థక క్రియలో 'ఏ' ప్రత్యయ ప్రయోగం గుంటూరు ప్రాంతానికి ఉత్తరంగా కనిపిస్తోంది. కాని కడప కైఫీయత్తుల్లో 'ఆ' ప్రత్యయం గోచరిస్తోంది.'ఏ' ప్రత్యయం 14వ శతాబ్దం తరువాత నుండి

గుంటూరు ప్రాంతం నుండి అదృశ్యమయ్యింది. బహువచనంగా కట్టించేరు (మధ్యాంధ్ర) కట్టించారు (కడప కైఫీయత్తులు)

■ కన్నడ భాషా ప్రభావం రాయలసీమ మాండలికం మీద చాలా ఎక్కువ. అది నాటికీ నేటికీ స్పష్టమవుతున్న వాస్తవం! వలపలగిలక ప్రయోగ రాతలో 11వ శతాబ్దం తర్వాత కూడా చాలాకాలం కొనసాగింది. కానీ ఉత్తరాంధ్ర భాషలో ఈ ప్రక్రియ తక్కువ. 11వ శతాబ్దం వాడైన నన్నయ్య కావ్యభాషా ప్రభావం స్థానిక మాండలికం మీద ఉండడం చాలా సహజం.

సమర్పించి, తూర్పున, కార్తీక, మూర్తికి

ఇదేవిధంగా పురుషనామాంతాల్లో 'అప్ప' రూపం విస్తృతంగా వాడుకలో వుండేది. అత్వసంధి రూపాలు చాలా విలక్షణంగా కనిపిస్తాయి. "అత్తునకు సంధి బహుళముగా నగు (బాల - సంధి - 4) "సూత్రానికి విరుద్ధమైన ప్రయోగాలు కూడా కనిపిస్తాయి. ఈ సూత్రాన్ని సవరిస్తూ బహుజనపల్లి వారు "శ్రేష్ఠతా వాచకంబులగు నార్యంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్ని యెచ్చులకును సంధినిత్యము (ప్రౌఢ - సంధి -1)" సూత్రీకరించారు. ఈ ప్రాంతంలో ఈ సూత్రానికీ ఒదగని రూపాలు కనిపిస్తాయి. ప్రౌఢ వ్యాకరణం రామయ్య సీతమ్మ పదాల్ని ఉదహరించి సంధినిత్యం అని చెబుతుంది. అయితే ప్రౌఢ వ్యాకరణ సూత్రం నిత్యం కాదు వైకల్పికం. పాండురంగ మాహాత్మ్యంలో "అమ్మాజియమ్మ" అనే సంధి జరగని రూపం ఉంది. ఈ శబ్దానికి వైకల్పికంగా "అమ్మాజమ్మ" రూప ప్రయోగం కూడా ఉండవచ్చు. ఇటువంటి వైకల్పిక రూపాలు తెనాలి రామకృష్ణ కవి కన్నా వందల సంవత్సరాల ముందే వున్నాయి.

ఉదా: నారణప్ప / నారాయణప్ప / నారాయణంప్ప, వరదప్ప / వరదాయప్ప / వరదాయంప్ప

■ 'గౌఱియలు' రూపం ఉత్తరాంధ్రలో 'ఇ' లోపంగా, యడాగమంగా 'గొఱ్ఱ్యలు'గా వుంది. గుంటూరు దక్షిణ ప్రాంతంలో "ఇయ>-ఉ రూపంతో 'గొఱ్ఱులు' గా వుంది. కడప కైఫీయత్తుల్లో '-ఇయ' లోపించి 'గొర్లు' రూపం కనిపిస్తోంది. 'గొర్లు' నేటి మాండలిక వాడుకరూపం కూడా!

■ కపిల, నాగేలి / మడక, నొగ, గాను/గాలు, రాగి, కొమ్ము, గునాది వంటి ప్రయోగాలు రాయలసీమ మాండికంలో వున్నట్లు భద్రిరాజు కృష్ణమూర్తి గారు కావ్య శాసన భాషల ఆధారంగా చెప్పారు (తె.భా.చ.415) ఈ రూపాలు కడప కైఫీయత్తులో కూడా కనిపిస్తున్నాయి. అయితే గుంటూరు కైఫీయత్తులలో మోట, నాగలి మాటలు వాడుకలో ఉన్నాయి. కందప్పశెట్టి, కృష్ణమూర్తి గార్లు నెల్లూరి మాండలికంలో భాగంగా దక్షిణ గుంటూరు ప్రాంత భాష వుండేదని చెప్పారు. అయితే అది చాలా పరిమితమని ఈ మాటలూ నిరూపిస్తున్నాయి. ముందు మాట్లాడుకున్న 'గొర్లు' రూపం కూడా దీనికి ఉదాహరణే! రాయలసీమ - నెల్లూరు ప్రాంత మాండలికం ప్రభావం వల్లనే దక్షిణ గుంటూరు ప్రాంత ప్రయోగాలున్నాయి తప్ప ఆ ప్రాంతం రాయలసీమ మాండలికంలో భాగం కాదన్నది స్పష్టం. ఎందుకంటే భౌగోళికంగా, చారిత్రకంగా రాయలసీమలో గుంటూరు ప్రాంతం భాగంగా ఎన్నడూ భాగం కాలేదు కాబట్టి.

■ నేటి తెలంగాణ మాండలికంలో 'పోరి' అని అమ్మాయిని, 'పోరడు' అని కుర్రాడిని పిలిచే విధానం వాడుకలో వుంది. ఇవి దేశ్యపదాలు. 'పోరి' అనే శబ్దానికి పశుపక్ష్యాలలో స్త్రీజాతి అని నైఘంటికార్థం. దీనికి సమానార్తకంగా పెట్ట, పెంటి శబ్దాలు కూడా దేశమంతటా వాడుకలో వున్నాయి. 'ఆడకోడి'ని 'పెట్ట' అని వ్యవహరించే విధానం కూడా వ్యవహారంలో వుంది. ('పోరి' అనే విశేషణ ప్రాతిపదకన నుండి పెట్ట, పెంటి పదాల పరిణామం జరిగి వుండాలి) 'పెట్ట' అనే మాటకు సమానార్థకంగా తమిళంలో 'పెట్టై' అని అలాగే 'పెట్ట' అనే విశేష్యశబ్దానికి కార్యప్రయోగాలు 15వ శతాబ్దం నుండీ లభిస్తున్నాయి. శ్రీనాథుడు (బెట్టంబోతుం... 6 -291) (కాశీ ఖండం -6 - 297), చేమకూర వేంకటకవి 'పెట్టయని గమకించి - సారంగ. 1- 22', పాలవేకరి కదిరీపతి (శుకసప్తతి 2 - 33) మొ. వారు 'పెట్ట' మాటను ప్రయోగించి వున్నారు.

అదేవిధంగా 'పెంటి'అని విశేష్యానికి కూడా పశుపక్ష్యాదులలో స్త్రీజాతి అనే నైఘంటికార్థం వుంది. ఈ మాటను నన్నయ (ఆది 5 - 53), తిక్కన (స్త్రీ -1-102)లు వాడివున్నారు. కావ్యప్రయోగాల ఆధారంగా వ్యాఖ్యానిస్తే 'పెట్ట' అనేమాట మరీ ప్రాచీనమైనది కాకపోవచ్చు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 9,10 శతాబ్దం నాటికే 'పోరి' శబ్దం రాయలసీమలో 'పోలి' గా మారిపోయింది. 9వ శతాబ్దం నాటి కడపజిల్లా 'పోలి' గ్రామ కైఫీయత్తు దీనికి తిరుగులేని నిదర్శనం. నేటి భాషలో పోలి పోలప్ప రూపాలు రాయలసీమ మాండలికంలో కనిపిస్తున్నాయి.

ఉత్తరాంధ్ర, రాయలసీమల ప్రత్యేక మాండలిక నిర్మాణాలకు 6,7శతాబ్దాల కాలంలోనే బలమైన పునాది పడివుంటుందని నా నమ్మకం.

■ అన్నమయ్య కీర్తనల్లో శత్రర్థక ప్రత్యయంగా 'తా' కనిపిస్తోందని భద్రిరాజు కృష్ణమూర్తి గారు చెప్పారు. (తె.భా.చరిత్ర 425) అన్నమయ్య 15వ శతాబ్దంలో జీవించినవాడు. అంటే అంతకుముందు వందల సంవత్సరాల కిందటే ఈ ప్రయోగ ప్రాతిపదికలు ఉంటాయి. హఠాత్తుగా అన్నమయ్య కీర్తనలలోకి ప్రవహించవు కదా!

మొత్తం సాహిత్యచరిత్రలోనే ఒక ప్రాంత మాండలికానికి ఆస్థాన గౌరవం లభించినది రాయలసీమలోనే. ఆ మాండలిక మహానుభావుడు అన్నమయ్య. అయితే ఆ రోజుల్లోకూడా సామాన్యుల వాడుక భాషకు ఆస్థానాల్లో ఆదరణ చాలా తక్కువ! కృష్ణరాయల పండిత అష్టదిగ్గజాల్లో తాళ్ళపాక కవులు లేరు, జానపద కవులు లేరు. ఆ తర్వాత వేమన, పోతులూరి వీరబ్రహ్మం, యాగంటి లక్ష్మయ్య వంటివారు అన్నమయ్య వాడుక భాషా వారసత్వాన్ని కొనసాగించారు.

కనీసం రెండువేల సంవత్సరాలుగా తెలుగు మాతృభాషగా కలిగిన పాలకుల కిందనే రాయలసీమ వుంది. ఆ తర్వాత కాలంలో కుతుబ్‌షాహీ, నిజాంషాహీల పాలన కిందకు వచ్చినప్పటికీ రాయలసీమ భాష మీద పర్షియా, టర్కీ భాషల ప్రభావం తక్కువ. కారణం వారి పాలనా కేంద్రం రాయలసీమ కాదు కాబట్టి.

ఉత్తరాంధ్ర మాండలికం ఒక ప్రత్యేక మాండలికంగా రూపొందడానికి ప్రధాన కారణం ఒరియా పాలకుల కిందనే

**తరువాయి 35వ పుటలో....**

డా. శ్రీమంతుల దామోదర్
9989139136

# గిరిజనుల సంస్కృతికి నిదర్శనం పచ్చబొట్లు

ఉపోద్ఘాతం:

పచ్చబొట్లు చర్మం మీద వేయించుకునే ఒక రకమైన చిహ్నం. దీనినీ పెద్దేగి చెక్క .ఆముదపు నూనె మసి. సూదులు ఉపయోగించి పచ్చ వేస్తారు. ఒక్కొక్కరి అభిరుచులను బట్టి వివిధ చిహ్నాలు వేయించుకుంటారు. ఇది పురాతనం నుండి వస్తున్న సంప్రదాయపు చిత్రకళగా చెప్పవచ్చు. పచ్చబొట్లు తోటి గిరిజనులు మాత్రమే పొడిచే ప్రత్యేకమైన నైపుణ్యం గలవారు. ఇందులో సంప్రదాయపు పచ్చబొట్లు, అనారోగ్యానికి గురైతే వేసుకునే పచ్చబొట్లు, మరియు అలంకరణ కోసం వేసుకునే పచ్చబొట్లు ఇందులో మనకు స్పష్టంగా కనబడతాయి.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజన తెగల్లో ప్రత్యేకమైన గిరిజన తెగ తోటి .వీరు గౌండ్ గిరిజన తెగకు ఆశ్రితులుగా ఉంటూ గోండు రాజుల చరిత్రలను, గోండు దేవతల చరిత్రలను, గోండు తెగ పురాణాలను కళా ప్రదర్శన ద్వారా చెప్తారు. అదే విధంగా తోటి గిరిజన స్త్రీలు పెద్దికి చెక్క ఆముదపు నూనె మీద ఉన్న మసి నీ కలిపి పచ్చబొట్లు వేయుటంలో నేర్పరులు. తోటి వారికి గోండు తెగ వారికి ,కోలం తెగవారికి ఇతర గిరిజన తెగలతోపాటు గిరిజనేతరులకు కూడా పచ్చబొట్లు వేయడం వీరికి అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే తోటి, గోండు, కోలాం గిరిజనులకు సాంప్రదాయక పచ్చబొట్లను మరియు అలంకరణకు సంబంధించిన పచ్చబొట్లను వేస్తారు. వీరు అదిలాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో అడవులకు దగ్గరగా ఉంటారు. అయితే అనుభవముగల వారి ద్వారానే పచ్చబొట్లు పొడిపించుకొంటారు.

పచ్చబొట్టు వేసేందుకు సింగర్ కోపాంగ్ (చిన్న మట్టి కుండలు) వేంగూర్ చెక్క (పెద్దేగి చెక్క) ఆముదపు నూనె ద్వారా వచ్చిన మసీ (సుయిజాత)సూదులు వీటన్నిటి ని వెదురు బుట్టలో పెట్టుకుంటారు. ఒక కుండలో వేంగూర చెక్కను నీళ్లలో నానవేస్తే ఆ నీరు ఆకుపచ్చ రంగుగా మారుతుంది .మూడు సూదులను కలిపి ఒకటిగా కట్టుకొని సిద్ధం చేసుకుంటారు. ఇలా నాలుగు ఐదు రకాల సూదులు అందుబాటులో ఉంచుకుంటారు. సూదులతో మొదటగా మసిని కుచ్చు చర్మం పైన కుచ్చుతూ రంగుల నీళ్లను జత చేస్తారు. చాలా నొప్పిగా ఉండడం చేత చాకచక్యముగా వేయడంలో చాలా నేర్పు అవసరం.

తోటి గోండు స్త్రీలు పెండ్లికి ముందు నుదుట సూర్యచంద్రుల పచ్చబొట్టు ఉంటేనే పెండ్లికి అర్హులుగా భావించే వారు. అదే విధంగా దేవతల కొలుపులు పూజించాలంటే స్త్రీకి ' కుండ కేయి మనుగటి' అనే పచ్చబొట్టు ఉండాల్సిందే.. చుమ్మార్ అనే పచ్చబొట్టు సూర్యుడు చుక్కల మాదిరిగా ఉంటుంది .రామనరత్ అనే పచ్చబొట్టు రాముడు లక్ష్మణుడు ఉన్న రథం వలె ఉంటుంది.. గిరిజన స్త్రీలు పెండ్లి అయిన తర్వాత కుడి చేతి ముంజేతి మీద ఈ రామనరత్. పచ్చబొట్టును వేయించుకుంటారు. చుమ్మార్ దీనినే అంబలి కుండా అని కూడా పిలుస్తారు. ఇది ఉండడం వల్ల మనకు అన్నం కు కొదవ ఉండదనేది నమ్ముతారు. రాణి సింగర్ ఈ రకం పచ్చబొట్టు గిరిజనుల నుదుట మీద అలంకరణ కోసం వేయించుకుంటారు. అయితే ఈ రకం పచ్చబొట్లన్నీ చనిపోయిన తర్వాత మన వెంట వచ్చే ఏకైక తోడుగా వీరు భావిస్తారు . పోర్టులే లెంజ్ అనే పచ్చబొట్టు స్త్రీల నుదుట మీద కనుబొమ్మల పైన నెలవంకను చంద్రుడిగ చుక్కను సూర్యుడుగా భావిస్తారు. అదేవిధంగా స్త్రీలు ఎడమ చేతి మట్ట మీద వీసింగ్ అనే పచ్చబొట్టు వేయించుకుంటారు. స్త్రీల చేతి ముంజేతి మీద అలంకరణ కోసం వేసుకునే పచ్చబొట్టు అక్కచెల్లెళ్ళు, మరియు నూతి అని వేయించుకుంటారు. వారికి ఎంత మంది అక్క చెల్లెలు ఉంటే అన్ని బొమ్మలతో పచ్చ వేయించుకుంటారు దాన్నిబట్టి వారి అక్కాచెల్లెళ్ల సంఖ్య తెలుస్తుంది. ఆడ మగ తేడా లేకుండా తమ చేతి మీద పూర్వీకుల పేర్లు లేదా వారికి ఇష్టమైన పేర్లను పచ్చబొట్టు ద్వారా వారి అభిమానాన్ని తెలియజేసుకుంటారు. అదేవిధంగా దేవతల బొమ్మలను రాముడు ఆంజనేయుడు వంటి బొమ్మలు తులసి కోట వంటివి.పోక పువ్వు , రామన బాసిన అనేది బాసింగం వలె వేయించుకునే పచ్చబొట్టు. దీనితోపాటు బంతి పువ్వు, ముగ్గులు వంటివి అలంకార ప్రాణమైన ప్రాయమైన పచ్చబొట్లు వేసుకుంటారు.

వీటితోపాటు కాళ్లు చేతుల నొప్పులకు ఆ నొప్పి ప్రదేశాన్ని గుర్తించి ఆ ప్రదేశం పైన పచ్చ వేయడం వల్ల మోచేయి నొప్పి, నడుము నొప్పి, వీపునొప్పి, జబ్బ నొప్పి, మోకాళ్ళ నొప్పులు వంటి నొప్పుల సంబంధమైన వ్యాధులు తగ్గించుటకు ఎంతో మేలు చేస్తుంది. నొప్పులున్నచోట గీతల మాదిరిగా అడ్డంగా పచ్చ పొడవడం వల్ల చర్మం పైన ఆక్యుపంచరుగా పనిచేస్తూ ఈ వ్యాధులు తగ్గుతాయని వీరి బలమైన నమ్మకం. కాలి మడమ పైన ఎంతో బాధ నొప్పి పెట్టే గుర్రం మూతుల వ్యాధికి కూడా పచ్చబొట్టు ద్వారా నయం చేయడంలో ఎంతో అనుభవం ఉంటుంది .ఇలా దీర్ఘకాలిక వ్యాధులు, నయం కాని వ్యాధులకు వీరు పచ్చబొట్ల ద్వారా నయం చేయడంలో సిద్ధహస్తులు.

సంప్రదాయపు పచ్చబొట్లు గిరిజనులకు వేసుకుంటూ అలంకరణ ప్రాయమైన పచ్చబొట్లను గిరిజనులకు మరియు వివిధ గ్రామాల్లోకి వెళ్లి గిరిజనేతరులకు కూడా పచ్చబొట్లు వేస్తాం అంటూ ఊరూరు తిరుగుతూ పచ్చబొట్లు వేయడం వీరి నిత్య కృత్యం. అదేవిధంగా వ్యాధుల నివారణకు కూడా గిరిజనేతులకు పచ్చ ద్వారా ఎన్నో రకాల వ్యాధులు నయం చేయడంలో ఎంతో అనుభవం గలవారు. వీరిని వివిధ గ్రామాల్లో చుక్కబొట్ల వారని పచ్చబొట్ల వారని పిలుస్తారు.

పచ్చబొట్టు వేయించుకున్న తర్వాత ఇతర ఎటువంటి అసౌకర్యాలు గలగకుండా ఆముదపు నూనె పసుపును కలిపి పచ్చ వేయించుకున్న దాని మీద లేపనంగా రాస్తారు. అదేవిధంగా ఒకరికి పొడిచిన సూదులను మరొకరికి వాడకుండా కొత్త సూదులను వాడుతారు లేదా ఒకరికి వేసిన పచ్చబొట్ల సూదులను ఉల్లిగడ్డకు గుచ్చి మళ్లీ వాడతారు.

పచ్చబొట్టు సంప్రదాయం ప్రాచీన కాలం నుండి వస్తుంది. యుద్ధ వీరులు మళ్లీ యోధులు వారి మణికట్టుపై హనుమంతుడు, కత్తులు, త్రిశూలం మొదలైన రూపాలను వేయించుకునేవారు. జనసామర్థ్యం గల వివిధ సభలలో, గుంపులలో తమ బిడ్డలు తప్పిపోతారని భయంతో గుర్తుపట్టేందుకు వీలుగా బిడ్డల చేతుల మీద పచ్చబొట్లు పొడిపించుకునేవారు.. భారతదేశంలో గుజరాత్, చత్తీస్గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కూడా పచ్చబొట్లను వేయించుకుంటారనేది తెలుస్తుంది .ఇంత ప్రాచుర్యం పొందిన సంస్కృతి పరమైన పచ్చబొట్లను భారత ప్రభుత్వం వివిధ రకాల అంటువ్యాధులు వస్తాయని పచ్చవేయడం నిషేధించింది. అదేవిధంగా పోలీస్, మిలటరీ వంటి ఉద్యోగస్తులకు కూడా పచ్చబొట్టు ఉంటే అనర్హులుగా భావించడం వల్ల పచ్చ వేయించుకోవడంలో గిరిజన గిరిజనేతరులు దూరంగా ఉంటున్నారు. దీనివల్ల పచ్చ బొట్టు వేయించుకోవడం గిరిజనుల్లో కూడా నేడు కనబడడం లేదు.

నేటి కాలంలోకూడా యువత ఫ్యాషన్ ట్రెండ్గా మారి ఎన్నో రకాల ఆకారాలతో పచ్చ వేయించుకోవడం మనం చూస్తూ ఉన్నాం. ఇది ఆధునిక యంత్రాలతో వివిధ రకాల రసాయనాలతో వేయడం కనబడుతుంది....

ముగింపు.:

తోటి గిరిజనులు తమ సంప్రదాయపు ఆచారపు అలవాట్లను ముందు తరాలకు అందించుటలో పచ్చబొట్టు ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా ఎన్నో రకాల వ్యాధులను నయం చేశామని వీరి అనుభవం ద్వారా చెప్పుచున్నారు. అలంకరణ సంబంధమైన పచ్చబొట్లు గిరిజన గిరిజనేతరులకు వేయడం వారి ద్వారా వారి నుండి పారితోషకం తీసుకునేవారు. ఇటువంటి దైనందిన జీవితమును ఎంతో కళాత్మకంగా రూపుదిద్దుకొని తమ జీవనాధారం కోసం కృషి చేసిన తోటి గిరిజనులకు నేడు పచ్చబొట్టు వేయడం ఒక నిషేధ ఆజ్ఞ లాగా వీరి జీవితానికి ఆసరా లేకుండా పోయిందనేదే వీరి ఆవేదన.

---

-రచయిత - అసిస్టెంట్ ప్రొఫెసర్,
జానపద గిరిజన విజ్ఞాన పీఠం
(తెలుగు విశ్వవిద్యాలయం),
వరంగల్లు-2,

**భాష లేకపోతే భావం లేదు;
నీ భావాల్ని నీ భాషలో
చెప్పడమే సరైనది**

33వ పుట తరువాయి..

వుండటమని కందప్పశెట్టి చెప్పారు. మధ్యాంధ్ర మాండలికానికి తెలంగాణ మాండలికానికి 16వ శతాబ్దం దాకా పెద్ద తేడాల్లేవని కూడా కందప్ప శెట్టి గారే చెప్పివున్నారు. ఇవి రెండూ విడిపోవడం చాలా ఆధునికమైనది. కుతుబ్షాహీల పాలన తెలంగాణాలో ప్రారంభం కావడంతో తెలంగాణ వాడుకభాష చాలా విలక్షణంగా రూపొందడం మొదలయ్యింది.

రాయలసీమ పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. తమిళ, కన్నడ సామ్రాజ్యాల కింద రాయలసీమ వున్నప్పటికీ స్థానిక పాలకులు తెలుగు మాతృభాష కలిగిన వారే!

కందప్ప శెట్టి, కృష్ణమూర్తి గార్లు చెప్పిన ఆనాటి కళింగాంధ్ర మాండలిక రూపాలు నేటి కళింగాంధ్రలో మాండలికంలో కనిపించవు. భాష ప్రవాహసిద్ధమైనది. పరిణామశీలమైనది. శతాబ్దాల నుండీ ఒక ప్రాంత భాషలో ఏవిధమైన మార్పులూ జరగలేదంటే దాని అర్థం ఆ సమాజంలో కూడా ఏవిధమైన మార్పులూ జరగలేదని! కాబట్టి అప్పటి రాయలసీమ మాండలిక స్వరూపం కళింగాంధ్రమాండలికం లాగే నేటికి స్థిరంగా వుండే అవకాశం లేదు. అయినప్పటికీ ఒకటీ అరా ప్రాచీన లక్షణాలు ఈ మాండలికంలో వుండటానికి ప్రధాన కారణం రాయలసీమ సామాజిక వ్యవస్థే.ఫ్యూడల్ భూస్వామిక పాలనలో రాయలసీమ ఉంది. ఆ భూస్వామ్య వ్యవస్థ మిగిలిన ప్రాంతాల కన్నా భిన్నమైనది. ఇది పాళెగాళ్ల వ్యవస్థతో నిర్మాణమైంది.

ఏ సమాజమైనా ఆ కాలం నాటి తన సంస్కృతిని అభివ్యక్తం చేసేది భాషే కదా. సాహిత్యం లాగా భాష కూడా స్థలకాలాలకు ప్రభావితం అవుతుంది.

రచయిత- అనంతపురం-ప్రభుత్వ
ఆర్ట్స్ కళాశాల (అటానమస్)లో
లెక్చరర్గా వున్నారు

మాతృభాషల వాడకం భాషా వ్యవహర్తలను ఒక్కచోటికి తీసుకురావడమేకాక, అందరి భాగస్వామ్యంలో సమాజం అభివృద్ధి చెందడానికి వీలు కలిగించి సమాజంలో కలివిడినీ సృజనశీలతకూ సరికొత్త ఆలోచనలకూ ఊపిరులూదుతాయి. అవి సాంస్కృతిక వైవిధ్య భరితమైన జీవనానికి ప్రాణం పోయడమేకాక, శాంతి సాధనాలుగా ఉపయోగపడతాయి.

-యునెస్కో

హరిబండి లక్ష్మి
9441822213

# అనువాదం నాడు, నేడు: ఒక పరిశీలన

అనువాదం గురించి కొద్దొగొప్పో తెలియని వారెవరూ ఉండరనటంలో అతిశయోక్తి లేదు. అలాగే చదువుకున్న వారిలో అనువాద గ్రంథాలను ఒకటీ అర చదవని వారు కూడా ఉండరు. ఈ కారణంగా అనువాదం గురించి అనాదిగా వస్తున్న కొన్ని అభిప్రాయాలు, ధోరణులు ప్రజలలో బాగా నాటుకు పోయాయి. ఈ నేపథ్యంలో అనువాద అధ్యయనం ఒక పాఠ్యాంశంగా మారి దాదాపు 70 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో మనలో నాటుకుపోయి ఉన్న మునుపటి అభిప్రాయాలనూ, ఆలోచనలను ఒక్కసారి పునరాలోచించవలసిన అవసరం ఉంది. అదే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

మొదటగా అనువాదమనగానే మనలో తలెత్తే మొదటి ప్రశ్న- ఇది అనువాదమా? అనుసరణమా? లేక అనుసృజనమా? అనేది, మన తెలుగులో గల అనువాద సంప్రదాయాన్ని పరిశీలిస్తే అనువాదాల కంటే అనుసరణలూ, అనుసృజనలే ఎక్కువగా కనిపిస్తాయి. ?"మక్కీకి మక్కీ" అనువాదాన్ని (Word to word translation or literal translation) అనువాదంగా పరిగణిస్తే, అనుసరణలను, adaptations లేదా ఆంధ్రీకరణం గానూ, 'అనుసృజన' ను transcreation గానూ పరిగణించవచ్చు. రేడియో మాధ్యమానికి సంబంధించి మనకు తెలుగులో మరోపదం 'తెలుగు సేత' అని కూడా ఉంది. దీన్ని 'Telugization అనవచ్చునేమో. వీటన్నిటినీ మనం స్వేచ్ఛానువాదం (free translation) లోని రకాలుగా పరిగణించవచ్చు.

ఇక అనువాదం ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనే విషయానికొస్తే, అనువాదం అనువాదంలాగా ఉండకూడదనీ, తెలుగులో చేసిన స్వతంత్రరచనలాగా ఉండాలనీ, అనువాదకుడు మూలరచయితలోకి పరకాయ ప్రవేశం చేయాలనీ, అనువాదం మూలరచయితే స్వయంగా తెలుగులో రాశాడా అన్నట్లుగా ఉండాలని, అనేకమంది, ముఖ్యంగా అనువాదకులూ, అనువాదరచనలకు 'ముందుమాట' రాసే అనుభవజ్ఞులయిన విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయ పడుతుంటారు. దీనికి ముఖ్యకారణం మన తెలుగు అనువాద సంప్రదాయమే. మన అనువాద సాహిత్య చరిత్రను పరిశీలిస్తే 'అనువాదం' అనిపించేలా ఉండేవి చాలా అరుదు, స్వతంత్రరచనలలాగా ఉండేవే అధికం. నిజానికి అలా ఉన్న అనువాదాలే చిరకాలం మనగలిగాయి, మనగలుగుతున్నాయి.

ఇక నేటి కాలానికి వస్తే, అనువాద అధ్యయనం విస్తృతంగా, అతివేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అనువాదానికి సంబంధించిన ఆలోచనలూ, ధోరణులూ, దృక్పథాలు పెనుమార్పులకు లోనయ్యాయి, లోనవుతూనే ఉన్నాయి. దీంతో మునుపటి ఆలోచనలకూ, ధోరణులకూ, ప్రస్తుతపు వాటికి చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ వ్యత్యాసాన్ని చదువరుల దృష్టికి తీసుకురావటమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.ఈ మార్పులను నాడు-నేడుగా విభజించి ఈ క్రింది పట్టిక లో పొందుపరచటం జరిగింది.

| క్రమ సంఖ్య | నాడు | నేడు |
|---|---|---|
| 1 | అనువాద ప్రక్రియ ముఖ్యంగా భాషకు సంబంధించినది | అనువాద ప్రక్రియ భాషా సంస్కృతులకు,సంప్ర దాయాలకు సంబంధించినది |
| 2 | అనువాదప్రక్రియకు మూల గ్రంథం అతిముఖ్యం | అనువాద ప్రక్రియకు మూల గ్రంథంతోపాటు దాని నేపథ్యం, మూలరచయిత, ఆమె/అతని నేపథ్యం, మూల భాషా సంస్కృతులు, లక్ష్యభాషా నేపథ్యం, అనువాదకుడు, ఆమె/ అతని నేపథ్యం,అనువాద ముఖ్య ఉద్దేశం, ఇత్యాదివన్నీ కీలకం. |
| 3 | అనువాదం మూలానికి విధేయంగా ఉండాలి. | అనువాదం ఎలా ఉండాలి అనేది అనువాదానికి నిర్దేశింపబడిన లక్ష్యంమీదా, లక్ష్యభాషాపాఠకుల మీదా, ఇరు పక్షాలకు చెందిన contextual factors మీదా ఆధారపడి ఉంటుంది. |
| 4 | అనువాదమనేది ముఖ్యంగా ఒక భాషనుండి మరొక భాషకు ఒక గ్రంథం మార్పిడికి సంబంధించిన ప్రక్రియ. | అనువాదం కేవలం రెండు భాషల మధ్యేకాక, ఒకే భాషలో ఉండే భిన్నరూపాలు, మాండలికాల మధ్య, అలాగే భిన్న sign systems మధ్యకూడా చోటు చేసుకుంటుంది. |
| 5 | ఏ అనువాదానికి సంబంధించి అయినా మూలరచయిత ముఖ్యం, అనువాదకుడు కాదు | ఏ అనువాదానికి సంబంధించి అయినా మూలరచయితతో పాటు అనువాదకుడు కూడా ముఖ్యమే, నిజానికి ఏ అనువాద గ్రంథమైనా అనువాదకుని సృజన, కృషి ఫలితమే కదా! |

సాంకేతికత అభివృద్ధి చెందిన నేటి తరుణంలో మన అందరికీ సుపరిచితమైన audio-visual translation(dubbing, subtitling, voice over, narration ete) కూడా అనువాద ప్రక్రియలో ఒక భాగమే. అలాగే కథలను లేదా నవలలను ఆధారంగా తీసుకొని చలనచిత్రాలను నిర్మించటం కూడా ఒక రకమైన అనువాదమే. ఇది inter-semiotic translation దీన్ని film adaptation గా పరిగణిస్తారు. అలాగే భాషను sign language లోకి మార్చటం (మూగ, చెవిటివారికోసం) కూడాఅనువాదమే.అదేవిధంగా సంస్కృత గ్రంథాలకు రాసే టీకా, తాత్పర్యాలు (Interpretations/explanations) కూడా అనువాదాలే.

దీంతోపాటు, రామాయణ, మహాభారతగాథలను చిత్రపటాలుగా మార్చటం, నృత్యరూపంలోగానీ, సంగీతంగా మార్చి ప్రదర్శించటం కూడా అనువాదమే. దేన్నయినా ఒకరూపం నుండి మరొక రూపానికి మార్చటం, అప్పటికే ఉన్న గ్రంథాన్ని ఒక సమీక్ష రూపంలో గానీ, సాహిత్యవిమర్శగా గానీ, వ్యాఖ్యానం రూపంలో గాని తిరిగి రాయటం కూడా ఒక రకమైన అనువాదమే.

మరొక విషయం – అనువాద స్వరూప స్వభావాలను ప్రభావితం చేసే అంశాలలో ఒక ముఖ్యమైన అంశం రెండు భాషలు–మూల భాష, లక్ష్యభాషకు మధ్యగల సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, రాజకీయ, ఆర్థిక అంశాలలో గల అంతరం, వ్యత్యాసం, ఏది ఎక్కువ గౌరవ ప్రదమైనదనేది చాలా ముఖ్యం. భాషలన్నీ సమానమే అయినా, కొన్ని భాషలు కొన్ని కొన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాల వలన ఎక్కువ ఆదరణ పొందుతుంటాయి. ఈ విషయాలను ఉదహరించటానికి Edward Fitzgerald అనువదించిన Omar Khayyam Rubbayyat గొప్ప ఉదాహరణ. ఈ అనువాదం ఎంతో ఆదరణ పొందింది. అయితే పర్షియన్ నుండి ఆంగ్లంలోకి ఈ రూబీయాలను అనువదించేటప్పుడు ఆంగ్లసాహిత్యంలో పోల్చుకుంటే పర్షియన్ సాహిత్యం అంతగా గుర్తింపులేనిది కనుక Fitzerald తన అభిరుచులకు తగినట్టుగా పూర్తిగా తనదైన శైలిలో మూలాన్ని లక్ష్య భాషాసాంస్కృతికులకు అనుగుణంగా ఉండేలా అనువాదంలో మార్చేశారు. అదే గ్రీకు రచనలనుండి అనువాదం చేయాల్సివస్తే అటువంటి పని చేసే సాహసం చేసేవారుకాదు.

తర్వాత, ఎక్కువ మందిలో ఉండే ఒక అపోహ–మూలానికి విధేయంగా ఉండే అనువాదం 'గొప్ప', లేదా 'మంచి' అనువారం అనేది. ఇందులో ఎటువంటి నిజం లేదనేది పైన పేర్కొన్న ఉదాహరణ వలన కూడా తెలుస్తుంది. మూల విధేయత అనేది ఒక్కటే 'మంచి' అనువాదానికి కొలమానంగా చూడకూడదు. అలాగే లక్ష్యభాషా context కూ, పాఠకులకు నచ్చే విధంగా ఉంటే చాలు అనుకోవటం కూడా సమంజసం కాదు. అన్నిటికీ మించి అనువాద ముఖ్య ఉద్దేశ్యం ముఖ్యం. దాని కనుగుణంగా, దాన్ని సాధించేదిగా ఉండాలి అనువాదం. మరి కొన్నిసార్లు 'మూలానికంటే అనువాదం బాగుంది' అనే మాట కూడా వింటూంటాం. ఇది కూడా సమంజసం కాదు.

నేడు అనువాదమనేది చాలా విస్తృతమైన ప్రక్రియగా పరిణమించింది. 'అనువాదం' అనే పదం కూడా తన పరిధిని పెంచుకొని ఒక umbrella పదంగా మారింది. 'అనువాదం' తో పాటు అనేకానేక ఇతర ప్రక్రియలు–అనేకరకాల పున:రచనలు, అనుకరణలు, అనుసృజనలు, ఇతర స్వేచ్ఛానువాదాలతోపాటుగా విమర్శలు, సమీక్షలు, సంకలనాలు, historiographies, అనుయుక్త గ్రంథాలు మొదలైనవి కూడా అనువాదాలుగానే పరిగణించుబడుతున్నాయి. ఏ పున:రచన అయినా అనువాదమే (Andre lefevere1995).

ఏ అనువాద ప్రక్రియ అయినా కేవలం రెండు భాషలకు చెందినది మాత్రమేకాదు. ఇది అనేకానేక అంశాలతో కూడుకున్న సంక్లిష్ట ప్రక్రియ. ఏ అనువాద ప్రక్రియకైనా మొదలు మూలగ్రంథమే. చివర లక్ష్య భాషాగ్రంథమే, కానీ ఈ రెండింటి మధ్య అనేక అంశాలు చిక్కుముడుల్లా పెనవేసుకుని ఉంటాయి. వాటన్నిటినీ పరిగణన లోకి తీసుకొని సరియైన అనువాద విధానాన్ని అనువాదకుడు ఎంచుకోవలసి ఉంటుంది. ఇవ్వన్నీ పరిగణ లోకి తీసుకోకుండా 'What is the best translation method/ strategy? అంటే సమాధానం ఉండదు. ఒక్కొ పరిస్థితులలో ఒక్కో విధానం సరియైనదిగా ఉంటుంది.

మరోముఖ్య విషయం – అనువాద స్వరూప స్వభావాలు అనువాద సాహిత్యానికి ఆయా సాహిత్య వ్యవస్థలలో గల స్థానం పైన కూడా ఆధారపడి ఉంటాయి. అనువాద సాహిత్యం ప్రథమ స్థానంలో ఉందా లేక ద్వితీయ స్థానంలో ఉందా అనే అంశం కూడా అనువాద రూపురేఖలను నిర్దేశిస్తుంది. ప్రధానపాత్ర పోషిస్తుంటే మూలసాహిత్యానికి భిన్నంగా కొత్త కొత్త సాహిత్య ప్రక్రియలను, శైలులనూ, పోకడలనూ మూలసాహిత్య సంస్కృతిలోకి పరిచయం చేసేదిగా, ప్రవేశపెట్టేదిగా ఉంటుంది. అలాకాక, ద్వితీయ స్థానంలో ఉంటే మూల సాహిత్య ధోరణులకు అనుగుణంగా, వాటిని మరింత పటిష్టం చేసేదిగా, సజీవంగా ఉంచేదిగా ఉంటుంది. (Even-Zohar, 1978).

మన తెలుగులోకి వచ్చిన అనువాదాలకు సంబంధించి మరో విషయం ఉంది. అవి డైరెక్టుగా మూలభాష నుండి చేసినవా లేక పరోక్షంగా ముందుగా వేరే భాషలలోకి మూల భాషనుండి వచ్చిన అనువాదాలనుండి చేసినవా అనేది సాధారణంగా స్పష్టం చేయరు. 'జపాను కథల తెలుగు అనువాదం','రష్యను కథల తెలుగు అనువాదం','ఫ్రెంచి కథల తెలుగు అనువాదం' అని మాత్రమే ఉంటుంది అనువాద పుస్తకాలపైన. అలాగే ఏ భాష నుండి ఈ అనువాదం చేయటం జరిగింది అనేది తెలియజేయటం అనువాదకుల కర్తవ్యం. ఈ ప్రస్తుత అనువాదానికి మూలంగా వ్యవహరించిన అనువాద వివరాలను పొందుపరచటం కూడా అనువాదకుల నైతిక కర్తవ్యం.
మన తెలుగు సాహిత్యం అనువాద సాహిత్యంతో నే మొదలైన సంగతి మనకు తెలిసిందే. చాలా వరకు ఇతర భారతీయ సాహిత్యాల విషయంలో కూడా ఇదే వరస కనిపిస్తుంది. అనువాదాలను స్వతంత్రరచనలు గాను, అనువాదకులను రచయితలుగానూ ఆదరించిన సంప్రదాయం మనది. తర్వాతి కాలంలో పాశ్చాత్య ప్రభావంతో అనువాదకులను చిన్న చూపు చూడడం, అనువాదరచనలను స్వతంత్ర రచనలతో సమానంగా ఆదరించకపోవటం వంటివి మొదలయ్యాయి. కాలక్రమేణా వచ్చిన మార్పులలో మరొకటి మునుపటిలాగా అనువాదాలు స్వతంత్రరచనలలాగా ఉండాలి అనే ఆలోచన స్థానంలో అనువాదాలు, అనువాదాలుగానే ఉండాలనే ఆలోచన ఎక్కువమంది అనువాదకులలో మొదలయింది. మూలరచన విశిష్టాలను, సంస్కృతినీ, అలాగే మూలరచయిత శైలిని వీలయినంతవరకు అనువాదంలో పున:సృష్టి చేసే ప్రయత్నం నేటి అనువాదకులు చేస్తున్నారు. ఈ విధంగా అటుమూలాన్ని, ఇటు లక్ష్యభాషా పాఠకులనీ అనుసంధానం చేసే ఒక వారధిగా అనువాదకులు వ్యవహరించటం హర్షనీయం. ఇతర భాషలనుండి తెలుగులోకి అనువాదం చేయటం కన్నా మన భాషనుండి ఇతర భాషలలోకి మన సాహిత్య రచనలను అనువదించుకోవలసిన అవసరం చాలా ఉంది. ఇది మన సాహిత్యానికి, రచయితలకూ దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించటానికి, మన తెలుగు సాహిత్య గొప్పతనాన్ని చాటి చెప్పటానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ దిశగా ముందుముందు మరిన్ని అనువాదాలు రావాలని కోరుకుందాం.

–రచయిత హైదరాబాద్‌లోని ది ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాగ్వేజెస్ యూనివర్శిటీలో అనువాద అధ్యయనాల విభాగం శాఖాధిపతి

పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# "పాడవోయి ప్రగతి దారులా......."

## పుక్కిటి పురాణాలు కట్టుకథలు;అభివృద్ధి మంత్రాలమధ్య అమ్మనుడి వెలుగులు

వైదిక పద్ధతులను, పంచమవేదం భారతం అనువాదాన్ని ప్రోత్సహించిన రాజరాజ నరేంద్రుడి కాలంలో తమిళనాడు నుండి వేదపండితులు వచ్చి కోనసీమలో స్థిర పడ్డారు. అంతకు ముందు జైన బౌద్ధాలు అక్కడ బలంగా ఉండేవి.ఇప్పటికీ నేదునూరు వంటి గ్రామాల్లో జైనశిల్పాలు కనిపిస్తూనే ఉంటాయి.రాజరాజు అనాదరానికి,వేధింపులకు గురైన జైనుల గాథలను,రాజమహేంద్రవరంలో స్థలపురాణం సారంగరధర కథగా,జనం ప్రచారంలోకి తెచ్చారు.దీన్ని పుక్కిటి పురాణంగా శిష్టులు తీసిపడేసినా సంగం



సాహిత్యం , తమిళులు 18 శతాబ్దిలో పునరుజ్జీవనంకోసం అన్వేషిస్తున్న క్రమంలో జైనులు భద్రంగా దాచుకుంటూ వస్తున్న తాళపత్ర గ్రంథాలు ప్రచారంలోకి రావటం చూస్తుంటే,మనకు అటువంటివి ఎందుకు దొరకలేదో!,మనవాళ్ళు ఎందుకు అప్పట్లో ప్రయత్నం చేయలేదు! అనే అనుమానం వేధిస్తుంది.గాసట బీసటే చదివి గాథలు తవ్వు తెలుంగు వారికిన్' (ఎర్రాప్రెగడ) అన్నట్లు అప్పటికీ ఇప్పటికీ, మనకు శిష్టత్వం మీదనే మోజు.తెలంగాణాలో కొలనుపాక ఒకప్పుడు జైనక్షేత్రం, కళ్యాణిచాళుక్యుల హయాంలో శైవ సంప్రదాయానికి కేంద్రమైంది.ఇప్పుడు




హైదరాబాద్ జైనులు, జైన దేవాలయాలను నడిపిస్తున్నారు.వాళ్ళ దగ్గర ఏమన్నా' గ్రంథాలు దొరుకుతాయేమో !? కురిక్యాలలో దొరికిన జిన వల్లభుని శాసనాలతోపాటు,నవనాథ సిద్ధుల భోగట్టా, అదిలాబాద్‌లో జైనత్ గుడి: సారంగధరకథ వలెనే వక్రీకరించిన స్థలపురాణాలు.. ఇవన్నీ ఇప్పుడు తలచుకోవటం గతజల సేతుబంధనం. ఉత్తర తెలంగాణా సంస్కృతీ చరిత్ర.శాతవాహన విశ్వవిద్యాలయం.2011) కాని ఒక ప్రయత్నం చేస్తే మంచిదనిపిస్తుంది.రాహుల్ సాంకృత్యాయన్ మనదేశంలో దొరకని బౌద్ధ గ్రంథాల అనువాదాలు టిబెట్ వెళ్లి సంపాదించారుగదా. ఇటీవలే తన తమిళనాడు పర్యటనలో, జైనులు జాగ్రత్త చేస్తున్న గ్రంథాలను చూసినట్లు చిన వీరభద్రుడు యాత్రాసాహిత్యంలో రాసారు. తమిళానికి ప్రాచీన హోదా వచ్చినపుడు, సంగం సాహిత్యం వెలుగులోకి తెచ్చిన స్వామినాథయ్యర్ ముఖచిత్రంగా ఫ్రంట్‌లైన పత్రిక వేసింది.మనం పంతంతో ప్రాచీన హోదా తెచ్చుకున్నాం కాని అటువంటి ప్రయత్నం చేయలేక పోయినాం.ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లున్నాం.

'ఆద్య సత్కథలకు సమాంతరంగా అన్ని దేశాలలోను, అన్నికాలాల్లోనూ, జనసామాన్యంలో కల్పనా కథలున్ను తామరతంపరగా ప్రవర్ధమాన మవుతూ వచ్చాయి.మంత్రతంత్రాలు భూత ప్రేతాలు,పరకాయ ప్రవేశాలు ఆకాశ గమనాలు,కామరూప ధారణలు చిలవలు పలవలుగా ఆల్లిబిల్లిగా అల్లుకోసాగాయి.



విదేశీయమైన అరేబియన్ నైట్స్ కథలు స్వదేశీయమైన కాశిమజిలీ, భట్టి విక్రమార్క, శుకసప్తతి ఈ కోవకిందకే వస్తాయి.–ఈ కల్పనా కథలకు పుక్కిటి కథలని పేరు వచ్చింది.కథ నేలమీద నడిపించాలన్న ప్రయత్నంలోంచి కథ, చిన్నకథ, కథానిక అన్న సాహిత్య ప్రక్రియ ఉద్భవించింది' ('తెలుగు కథకులు కథన రీతులు' 2. లో ప్రస్తావన.విశాలాంధ్ర 2000). ఇవి అహంకారపు అజ్ఞానపు రాతలే. నిజానికి

రష్యాలో ఇటువంటి జానపదకథలకు లక్షణ శాస్త్రం రూపొందించి, స్ఫూర్తి నిచ్చిన వాడు ప్రాప్. రాచమల్లునుండి రాంభట్ల దాకా రష్యన్ అనువాదాలలో తర్ఫీదు పొందిన వారే.కాని ప్రాప్ కృషి 'Morphology of Folk lore వారి దృష్టికి ఎందుకు రాలేదో!







1930లలోనే వచ్చిన ఈ సూత్రీకరణ, 1960లలో ఆంగ్లం అనువాదం రాగానే, పాశ్చాత్య విద్వాంసులు,ముఖ్యంగా ఫ్రెంచ్ మానవ శాస్త్రవేత్త లేవీ స్ట్రాస్, కథలకే పరిమితమైన ప్రాప్ కృషిని విస్తృతంగా అన్వయించి,Myth అంటే పుక్కిటి పురాణం కాదు,చరిత్ర రూపంలో ఉన్న శిలాజం myth is fossilised history అని నిరూపించి తంతులో వర్గీకరణంలోగల ద్వంద్వాత్మకమైన (binary) నిర్మాణ క్రమాన్ని ఆవిష్కరించాడు.ప్రాప్ విశ్లేషణ ఆధారంగా కధాంశాలకు narrateme పేరుతో screene play లో మెలకువలు నేర్పుతున్నారు. మరొక జానపద శాస్త్ర వేత్త అలాన్ దండేస్,ఆ పుస్తకం ముందు మాటలో, ప్రాప్ లక్షణ శాస్త్రం ఆధారంగా, కృత్రిమ మేధసాయంతో కొత్తకథలను సృష్టించవచ్చునన్నాడు. మన దగ్గర జానపద బోధకులు ఈ ప్రాప్ ను ప్రస్తావించారుకాని, ప్రచారంలోకి తేవటానికి వారి బలం సరిపోలేదు. ఈ దేశకాల సాపేక్షమైన జానపదుల జ్ఞానంలో క్రమం fuzzy logic అంటే మసకతర్కం అన్వయించుకోడానికి కృత్రిమ మేధ శాస్త్రజ్ఞులు తీవ్రంగాకృషి చేస్తున్నారు. అంతదాకా ఎందుకు ! కాశీమజిలి వగైరా కథలలో శిల్పంతోనే కొడవటిగంటి కుటుంబరావు చందమామలో యుక్తియుక్తంగా, హితబోధకంగా, మనోరంజకంగా తీర్చిదిద్దారు.అంతేకాదు 'తెలుగులో మరోరకం సాహిత్యం తెలుగుభాషలో రాయబడిన పదవాఙ్మయం.పల్నాటి యుద్ధం,కాటమరాజు కథ, దేశింగురాజు కథ. బంగారు తిమ్మరాజు కధ బొబ్బిలి కథ, కాంభోజరాజుకథ, వీరరాజమ్మ కథ .. వంటి ప్రజల్లో ప్రచారంలో ఉన్న కవిత్వమే తెలుగు కవిత్వం.ఈ పద వాఙ్మయంలో స్త్రీలు పోరాడేవ్యక్తిత్వంగల వీరనారులుగా కనిపిస్తారు.( సాహిత్యంలో వస్తుశిల్పాలు . త్రిపురనేని మధుసూదనరావు (త్రిమరా). పుట 105) 'ఈ కథలు మొదట్లో జనం చెప్పి ఉండవచ్చు.తరువాత ఎవరో ఒకరు రాసి ఉండవచ్చు..రాసినా చెప్పేవాళ్ళు అదే చెప్పాలని ఎక్కడా లేదు' (72) అంటూ ఈ సంప్రదాయ కథల నిత్యనూతనత్వం ప్రస్తావించాడు. వీరందరూ వామపక్షం వారే. 'పాతచింతకాయ పచ్చడి అయినా ఎండలో పెడితే బూజు పోతుంది' అన్న కొ, కు, మితవాది.శిష్టులు, 'జానపద సాహిత్యం అని ముద్దుపేరో మొరటు పేరో పెట్టి పక్కన పెట్టారు' అన్న త్రిమరా అతివాదిగా కనిపించే మితవాది. తంగిరాల వీరగాథలకు ముందుమాట రాసిన కే వి రమణారెడ్డి మధ్యేవాది.మిగతా వాళ్ళు అనువాదకులు.

'ధూర్జటి కాలంలో బవనీలు తమ వీరగాథా కవిత్వముతో ఊరూరా విజృంభించి, సత్కవీశ్వరులకు చోటులేకుండా చేసినారట.(తెలుగు వీర గాథా కవిత్వము.తంగిరాల సుబ్బారావు పుట193) ఈ పరంపర 1962దాకా కొనసాగినట్లు గుడివాడ తాలూకా ముదినేపల్లిలో జరిగిన దొమ్మీ జముకుల కథగా వచ్చిన వృత్తాంతాన్ని పేర్కొన్నారు(122).




1812లో రైత్వారీ వ్యవస్థను అవలంబించటం, దక్షిణ భారతీయ భాషల అధ్యయనాన్ని ప్రారంభించటం ఒకే సారి జరగటం యాదృచ్ఛికం కాదు'(వలసవాదం, ప్రాచ్య వాదం ,ద్రావిడ భాషలు . 282) భారతీయ విద్యా సంస్థల్లో ఇంగ్లీష్ బోధనా భాషగా విస్తరిల్లిన పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో ఆంగ్ల సాహిత్యప్రభావం నలుచెరగులా వ్యాపించింది' ఇలాచదువుకున్నవాళ్ళు,అటు అధికారులు, ఇటు ఉపాధ్యాయులు అయినారు. అధికారులు పాటించే 'గణన, కొలతమాన చిత్ర లేఖనం'(272),కనీసం దరఖాస్తు నింపటం బళ్ళో చెప్పరు.నేర్పరు! ఎందుకు చెప్పరు అని ఈ పంతుళ్ళు అడగరు. ఇలా ఒకరి పరిధిలోకి మరొకరు చొరబడకుండా, ఇరువర్గాలు' అభివృద్ధి'ని అమలు చేస్తూ రాజభక్తి నిరూపించుకోటంలో శక్తి వంచన లేకుండా పాటుపడి,'మా హయాంలో' అని తమనిర్వాకాన్ని కథలుగా చెప్పుకుంటూ,' ఆయన

అధికారిగా ఉన్నప్పుడు అని' భజన చేసే బతక నేర్చిన శిష్యవర్గాన్ని చేరదీస్తూ, జనాన్ని బిచ్చగాళ్ళుగా తయారుచేసారు.

ఒడిశాలో చిరకాలం గిరిజనులలో పనిచేసిన ఉన్నతాధికారి, పరిశోధకుడు ప్రసిద్ధ ఆంగ్ల రచయిత సీతాకాంత మహాపాత్ర, గిరిజనులు 'ఆటగోలు తనం'తో (playful ness) ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వ్యవసాయాభివృద్ధి విధానాలు శ్రద్ధగా పాటించలేదు. పూజారి పండుగ చేయలేదని కొత్త విత్తనాలతో పండించిన పంటను సకాలంలో కోసేవారు కాదంటూ అభియోగం మోపుతూ, అధికారులు ఈ కొత్త పద్ధతులను జనంతో చర్చించి వారిని సమాయత్త పరచ లేదని ('Rarely there are questions and cross questions. Rarely fruitful dialogues;) ఒప్పుకుంటాడు. (Modernization of Tribal Agriculture. In Economies of tribes and their Transformation; Ed. K.S, Singh. Concept publishing House 1982,page 393) తమిళనాడులో ప్రపంచ బ్యాంకు అండతో అమలైన హరిత విప్లవంలో ప్రజలతో అనునిత్యం పనిచేసే సిబ్బందినుండి ,జిల్లా స్థాయి అధికారుల మధ్య, రైతుల జ్ఞానంగూర్చి సన్నగిల్లుతూ వస్తున్న అవగాహన వివరిస్తుంది.

(Farmers knowledge is defined as thier awareness of department recommended practices in State power in Agricultural transformation in Tamilnadu. In Social Nature, resources representation and rule in India, Ed Arun Agarwal Oxford 2001. page 86) గిడుగు 'సవర కథలు' అచ్చువేసి చదువుద్వారా ప్రజలు అధికారుల మధ్య సంభాషణకు పునాది వేస్తే,ఆ ప్రయత్నం విస్మరించి, ప్రాయోజిత సాహిత్యం 'బడికతలు' రాయించి'చదువు' తోమటానికి, అభివృద్ధిని'స్కేల్‌అప్' చేయటానికి పద్దపాట్లను "కొన్నికలలు మెలకువలు' (ఎమెస్కో) ఏకరువు పెడుతుంది. సీతాకాంత్ మహాపాత్రకు ముందు 1940లలోనే సంతాలుల సాహిత్యాన్ని The Hills of Flutes గా ఆంగ్లంలోకి అనువదించిన,నాటి జిల్లా కలెక్టర్ ఆర్చర్, అనేక భారతీయ రచనలనుకూడా అనువదించిన కళాభిమాని. కొన్ని కవితాసంకలనాలలో ఆర్చర్ అనువాదాలను మహాపాత్ర చేర్చాడు. అయినా ఉద్యోగధర్మంగా అలవడిన దృక్పథం ఆయన మీద ప్రభావం చూపినట్లు స్పష్టమౌతుంది. అధికారి రచయితకూడా అయితే,ప్రజలలో ఉన్న సృజనాత్మకత గుర్తించాలి. వారి ప్రతిభా వ్యుత్పత్తులను అభివృద్ధికి అంటుకట్టాలి. అధికారిగా ఆపని చేయలేకపోయినా రచయితగానన్నా సమాజాన్ని జాగృతం చేయాలి. కాని శిష్టులైన రచయితలు, త్రిమరా అన్నట్లు 'ప్రజాసామాన్యానికి ఉత్తమకవిత్వాన్ని అనుభవించే శక్తి ఉండదు'అనుకుంటారు (పై పుట145) For a beaurocrat, the world is a mere object to be manipulated by him కార్ల్ మార్క్స్, ఉద్యోగికి ప్రపంచం కేవలం ముడిసరుకు మాత్రమే నంటాడు. రచయితలకుకూడా అంతే. ఒడియా నవల అనువాదం మట్టిమనిషి (సాహిత్య అకాడెమి) లో ' నౌకరీ చేస్తే మెల్లిగా మనుష్యత్వం ఏమైపోతుంది. చంద్రుడిని రాహువు మింగేసినట్లు మనిషిలోపలి పిశాచం చూస్తుండగానే మనుష్యత్వం మింగేస్తుంది. ( పుట 33) కొంతమంది నిజాయితీ పరులమని నీలుగుతుంటారు. 'నౌకరీ చేసి ఎవడైతే రెండు రాళ్లు లంచం తింటాడో వాడిది తప్పు కావచ్చు'. 'నిజమే . కాని ఆ జీతం ఎవరిస్తున్నారు? నీ బాబెక్కడైనా దాచిపెట్టాడా. జీతం గీతం బాబులు అధికారులున్నూ ఎవరి డబ్బుతో ఈ గర్రా అంటా? ఈ తలమాసిన వాళ్ళ డబ్బుతోను ఈ బాబు గిరి. ఈ అధికారము పెద్దరికమూ ఎవరివల్ల!. ఒక పూట తిని మూడు పూటల పస్తుంటారే .అదిగో ఆ పేదల వల్ల' (పుట 22) ఈ మాటలు మళ్ళీ మార్క్స్ మాటలనే గుర్తుకు తెస్తాయి. Civil servants and priests, soldiers and ballet-dancers, schoolmasters and police constables, which all these fabulous beings slumber in embryo is taxation.

తెల్లవాడి హయాంనుంచి, వేతన జీవులనుండి వచ్చిన కథకులే, సామాజిక స్పృహ పేరిట,'ధర్మ ప్రబోధాలు, సిద్ధాంత ప్రచారాలు,ఆల్కెమీలు,తత్వాన్వేషణలు,(పై 'తెలుగు కథకులు'లో ప్రస్తావన) జొప్పించి కలగాపులగం చేసారు. ఒకరి కథలు మరొకరు మెచ్చుకుంటూ పాఠాలలో పెట్టుకుంటూ,సన్మానాలు చేసుకుంటూ, చలామణిలో ఉండటానికి నానా పాట్లు పడుతున్నారు. తమ ఏడుపేదో తము ఏడ్చుకోక జానపదంమీద విసుర్లు! ఇలా అభివృద్ధిలో సాహిత్యంలో ఉత్పత్తి సంబంధాలు తారుమారౌతూ వచ్చాయి. ' కవి కవిత్వం శ్రోతలు సమాజం అనే నాలుగు ముఖ్యాంశాల్లో శ్రోతలు సమాజం పోయి, కవి కవిత్వం మిగిలాయి'(140 త్రిమరా) ఇటువంటి ఏకపక్ష ధోరణులవల్ల అభివృద్ధి కుంటు పడుతున్నదని, ప్రపంచ బ్యాంకు అర్థశాస్త్ర వేత్తలకు, అర్థమైంది కాని కలుపుకుని ముందుకుపోయే దారి దొరకటం లేదు.. (Culture and Public Action Permanent Black 2006. The observation that cultural norms affect economic devolopment has been made reapetedly. Yet it has been very hard to use it effectively for policy or for prediction.) మరి 'ఆడి పాడుదాము




ప్రగతి దారులా,..' ఎన్నటికో!

వాయువేగంతో వ్యాపారం విస్తరిస్తున్నా,బహుముఖమైన మానవ

**తరువాయి43వ పుటలో....**

ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
98485 98446

## అడుగుజాడలు - ఆనవాళ్ళు

# నా పాలంపేట - పానగల్ యాత్ర

హైదరాబాదు కోఠి ఉమెన్స్ కాలేజీలో బ్రిటీష్ రెసిడెన్సీ బిల్డింగు నిర్మాణపరంగా అద్భుత కట్టడం అసఫ్‌జాహీలు, బ్రిటీష్ వారికి మధ్య జరిగిన రక్షణ ఒప్పందాల్లో భాగంగా, బ్రిటీష్ ప్రతినిధి (రెసిడెంట్) నివాసం కొరకు నిజాం స్థలాన్నివ్వగా, జేమ్స్ అసిల్లెస్ కిర్క్ పాట్రిక్ అనే రెసిడెంట్ (1798-1805 సం.మధ్య) ఒక అపురూప కట్టడాన్ని యూరోపియన్ శైలిలో నిర్మించాడు. దాని దర్బారుహాలు, ప్రవేశ వరండా, శిథిలమైపోగా, ప్రపంచ కట్టడనిధి (వరల్డ్‌మాన్యుమెంట్‌ఫండ్) సంస్థ, దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్‌తో కలిసి పునరుద్ధరించి పునర్వైభవాన్ని సంతరించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ పని విజయవంతంగా పూరైన సందర్భంగా, ఆ రెండు సంస్థల ప్రతినిధులు బ్రిటీష్ రెసిడెన్సీ వద్ద ఒక ఉత్సవాన్ని నిర్వహించారు.

జనవరి 13న వారిలో కొంతమంది ఘన్‌పూర్ దేవాలయాలను చూడాలనికొని, నన్ను కూడా రమ్మన్నారు. తాజ్‌కృష్ణా హోటల్ నుంచి, దక్కన్‌హెరిటేజ్ సహవ్యవస్థాపకురాలు, హెలెన్‌ఫిలాన్, అమెరికన్ ఫ్రెండ్స్ ట్రస్టీ, ఎలెనా వర్నర్‌ల నేతృత్వంలో తొమ్మిదిమంది విదేశీ వారసత్వ ప్రేమికులతో కలసి బయలుదేరాను. ఖచ్చితంగా మూడుగంటల తరువాత పాలంపేట చేరుకొన్నాం.

పాలంపేట అనగానే రామప్ప దేవాలయం గుర్తుకొస్తుంది. 2021లో ప్రపంచవారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకొంది. రామప్ప శిల్పిపేరనీ, కాదు శివుని పేరనీ స్థానికుల భావన. కొందరైతే, ఆలయ నిర్మాణంలో ఉన్నపుడు అద్భుత శిల్పకళానైపుణ్యం గల రామప్ప శిల్పిని రుద్రమదేవి ప్రేమించిందన్న కట్టుకథ కూడా ప్రచారంలో ఉంది. గణపతిదేవుని సర్వసైన్యాధ్యక్షుడైన రేచర్ల రుద్రారెడ్డి పచ్చటి ప్రకృతి నడుమ, అందాన్ని ఇనుమడిరపజేసేట్లు కొండసానువుల దిగువభాగాన నేర్పరులైన శిల్పులతో, కాకతీయ సామ్రాజ్యానికే మణి మకుటంలా భాసిల్లే అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాడు.

ఎత్తైన నక్షత్రాకారపు ఉపపీఠంపై ప్రదక్షిణాపథాన్ని వదిలి, చిన్నదైనా మన్నికగల అధిష్ఠానం, ఎత్తైన గోడలు, వాటిపైన మూడంతస్తుల కోష్టాలు, పైన బాగా ముందుకు పొడుచుకొచ్చిన చూరుతో కప్పు (ప్రస్తరం),చూరు కింద రకరకాల పట్టలు, చట్రాల అలంకరణలతో చిత్ర, విచిత్ర కల్పనలను చూపరుల మతి బోయేట్లు, వడ్రంగులను మైమరపించేలా మలిచారు రామప్ప శిల్పులు. ఆలయంలోకి ప్రవేశించగానే అధిష్ఠానంపై భక్తులు ఆనుకొని కూర్చోటానికి వీలుగా కక్షాసనాలు, బయటివైపు మంత్రిముగ్దుల్ని చేసే శృంగార భంగిమలతో నున్న శిల్పాలు, రుషిపుంగవులు, జైనతీర్థం కరులను తీర్చిదిద్ది, ద్వార శాఖలపై అనల్ప కల్పనాచాతుర్యంతో మలచిన శిల్పాలతో ఆలయానికి సౌందర్యాన్ని ఇనుమడిరపజేశారు.

నగషీగా చెక్కిన రంగమండప స్థంభాలపై నాట్యభంగిమలు, భారత,భాగవత, రామాయణ దృశ్యశిల్పాలు, శృంగారంలో మునిగి తేలుతున్న నవ యువ దంపతులు, దూలాలపై కాలనాళికలా అన్నట్లు చెక్కిన అమృతమథనం,త్రిపుర సంహారం, రామ రావణయుద్ధం, ధన్వంతరి శిల్పాలు, దొంతరగా పేర్చిన కపులరాళ్లపై వాహనాలపై నున్న దిక్పాలకులు, మధ్యలో నటరాజ శిల్పాలను ఆకర్షణీయంగా



తీర్చిదిద్దారు రామప్ప శిల్పులు. చుట్టూ బయటి వైపు స్థంభాలపై నుంచి దూలాలకు బిగించిన నాగిని, మదనిక నాట్యగత్తె సంగీత వనిత, ఎత్తుమడమల చెప్పులతో వొయ్యారంగా నడుస్తున్న శిల్పాలు అలనాటి తెలంగాణ సుందరీమణుల రూపలావణ్యాలకు అద్దం పడుతున్నాయి. కపులపైన నీటిలో తేలియాడే ఇటుకలతో నిర్మించిన మూడంతస్తుల విమానం, దానిముందు శుకనాసితో, వెరసి సరసులు, రసజ్ఞులైన కాకతీయగణపతి దేవుడు, రేచర్లరుద్రుల శిల్పకళా ప్రియత్వానికి మచ్చుతునకలుగా వెలుగొందుతున్నాయి. చుట్టూ ఎత్తైన ప్రాకారం, రామప్ప దేవాలయానికి కుడి ఎడమల్లో కాటేశ్వర, కాచేశ్వరాలయాలు, ఎదురుగా నంది మండపం, పక్కగా ఆలయ నిర్మాణం పూర్తై ప్రతిష్ట, ముందు కుంభాభిషేకం జరిగిన 31-3-1213 నాటి నిర్మాత రేచర్ల రుద్రుని శాసనమున్న నాలుగు స్థంభాల చిన్నమండపంతో అలరారే ఆలయాన్ని నిర్మించిన రామప్ప ఉన్నాడో లేదో తెలియదుగానీ, అన్నీ తానై అపురూపంగా సృష్టించిన రుద్రసేనాని చరిత్రలో నిలిచిపోయాడు.

తెలుగువారి కళా కౌశలాన్ని వాస్తు నైపుణ్య విన్యాసాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు. నేను ఇలా ఒక్కొక్క విషయాన్ని విడమరచి చెబుతుంటే, ఒళ్లుమరచి, కళ్లు మూసుకొని ఉక్కిరిబిక్కిరి అయిపోయారు హెలెన్ ఫిలాన్‌బృందం. రామప్ప దేవాలయ దర్శనం తరువాత,

సముద్రాన్ని తలపించే, రామప్ప చెరువు కట్టపై నిర్మించిన శిథిలాలయాలను చూపించాను. ఒకప్పుడు వైభవోపేతంగా వెలుగొందిన అద్భుత ఆలయాలు, అపురూప శిల్పాలు, శిథిలాలై, పదిలపరచేవారు లేక, జీర్ణోద్ధరణకు నోచుకొక, ఆదరణలేని అనాథల్లా నిర్లక్ష్యంగా పడిఉండటం పట్ల వారంతా చలించి, వీటిని కాపాడే ప్రయత్నంలో భాగస్వాములమౌతామన్న మౌన అంగీకారాన్ని తెలిపారు. ఈక్షణం కోసం ఎదురుచూస్తున్న కాకతీయ హేరిటేజ్ ట్రస్ట్ సభ్యులు ప్రొ.ఎం. పాండురంగారావు ఆనంద డోలికల్లో ఓలలాడారు.



ఇక మా ప్రయాణం రామప్పకు 6 కి.మీ. దూరంలో ఉన్న ఘన్‌పూర్ దేవాలయాలకు, పచ్చటి పొలాల మధ్య పాపటదీసినట్లున్న మార్గంపై పావుగంట ప్రయాణంలో ఘన్‌పూర్ కోటగుళ్లకు చేరుకొన్నాం. మధ్యలో రామప్ప కంటే పెద్దదైన గణపేశ్వరాలయం, కుడి ఎడమల్లో కళ్యాణ మండపం, త్రికూటాలయాలు, చుట్టూ 19 పరివారాలయాలు, వాటి చుట్టూ రాతి కోటగోడ. ఈ రాతిగోడను ప్రాకారమని, రాకోట అని అంటారు. చుట్టూ రాతికోట వల్ల ఈ గుళ్లను కోటగుళ్లనీ, ఘన్‌పూర్ గుళ్లనీ పిలుస్తారు. ముందుగా నక్షత్రాకారంలో నిర్మించిన గణపేశ్వరాలయాన్ని చూశాం. రంగమండపం, శిఖరం కూలిపోయాయి. కవులరాళ్లు రాలి పోయాయి. నాగినీ శిల్పాలు వాలిపోయాయి. ద్వార శాఖలు పగుళ్లు బారాయి, నేలరాళ్లు ఎగుడు దిగుడుగా నాట్యం చేస్తున్నాయి, అయినా శిథిల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ చిద్విలాసాన్ని చిందిస్తున్నాడు. గర్భగుడిలోని శివుడు, నల్ల



శాసనపురాతిలో, నగిషీగా చెక్కిన శివలింగం కాకతీయ శిల్పుల తపోనిష్టను, శివునిపై ఇష్టతను తెలియజేస్తుంది.

చుట్టూ నిర్మించిన పరివారాలయాల విమాన విన్యాసం, కళ్యాణ మండప శిథిల నైరాశ్యాలను చూచి చలించిన ప్రపంచ కట్టడ నిధి ప్రతినిధులను ఊరడిరచి, దూరంగా నిలబెట్టిన నిలువెత్తు ద్వార పాల, విష్ణు, భైరవ, దేవి శిల్పాల వైపు మళ్లించాను. చక్కటి రూపం, చక్కటి అలంకరణ, అందాన్నంతటినీ కరిగించి పోత పోసిన శిల్పాలా అని భ్రాంతిలోకి వెళ్లారు వారంతా. కొన్ని పూర్తిగా తీర్చిదిద్దిన వైతే, అసంపూర్తిగా ఉన్నవి ఇంకొన్ని ఇంతకీ శిథిలాలైనా, మదినిదోచే ఈ ఆలయాలను నిర్మించింది ఎవరనుకొంటున్నారు అని అడిగాను. మీరే చెప్పండన్నారు. రామప్ప దేవాలయ నిర్మాత, రేచర్ల రుద్రుని కొడుకు గణపతిరెడ్డి తండ్రి బాటలో నడచి, తమ ప్రభువైన కాకతీయ గణపతిదేవునికి కృతజ్ఞతగా, ఆయన పేరిట గణపురమనే పట్టణాన్ని, గణపసముద్రాన్ని, గణపేశ్వరాలయ సముదాయాన్ని, క్రీ.శ. 1254వ సం?లో నిర్మించినట్లు తెలిపే ఒక శాసనాన్ని వారికి చూపించాను. ఆలయంలోని అణువణువునూ స్పృశించి, పులకించినా, అద్భుత శిల్పకళను చూచి మైమరచినా, ఆలనాపాలనా లేని కళాఖండాల నిర్లక్ష్యం పట్ల బాధా తప్త హృదయులై, లిప్తకాలం తేరుకోలేకపోయారు. అందమైన శిల్పాలను చూచి అమెరికన్ల కళ్లు విచ్చుకొన్నాయి. వారి మనసులు మాత్రం కట్టడ శిథిలాల్లో చిక్కుకొన్నాయి.

మా రెండో ప్రయాణం పానగల్లుకు, నల్లగొండ పట్టణ



శివారులో ఉన్న పానగల్లు క్రీ.శ. 12వ శతాబ్దిలో కందూరు చోడుల రాజధాని. ఆ వంశానికి చెందిన ఉదయన చోడుడు తన పేర సువిశాలంగా నిర్మించిన ఉదయ సముద్రమనే చెరువు, పచ్చ గ్రానైటు రాళ్లతో విలక్షణ వాస్తు శైలిలో నిర్మించిన పచ్చల సోమేశ్వరాలయం, కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో రోజంతా శివలింగంపై, ఛాయ (నీడ) పడేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయాలకు ప్రసిద్ధి. జనవరి 16వ తేదీన ఉదయాన్నే బయలుదేరి అందరం హైదరాబాద్ నగర శివారులోని రామోజీ ఫిలిం సిటీ దగ్గర కలసి, తరువాత గంటన్నరలో పానగల్లు పచ్చల సోమేశ్వరాలయ ప్రాంగణంలో వాలాం. క్రీ.శ. 12వ శతాబ్ది ఉత్తరార్థంలో, ఒక వైపు 3, ఎదురుగా1,మొత్తం నాలుగు దేవాలయాలు, వీటిని కలిపిన 64 స్థంభాల మహా మండపం. నాలుగు దేవాలయాల ఈ సముదాయాన్ని చతుష్కూటాలయ మంటారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అరుదైన ఆలయం.

ఆలయ వాస్తు విశేషతలు, శిల్ప కళా సౌందర్యాన్ని విడమర్చి చెబుతున్నపుడూ, వారికొచ్చిన సందేహాలనూ తీర్చినప్పుడూ వారు నన్ను అభినందించిన తీరు ఇప్పటికీ నామదిలో పదిలంగానే ఉంది. రాష్ట్రకూటచోళ–కళ్యాణ చాళుక్య వాస్తు శిల్పి సమ్మి శ్రమ శైలిలో నిర్మించిన ఈ ఆలయ గోడలపైన శిల్పాలు, కోష్టాలు, ద్రావిడ నాగర




విమానాల ప్రత్యేకతలపై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్ప గలిగానన్న తృప్తి నన్ను మరింత సంతోషపరిచింది.

ఆలయ సందర్శన తరువాత ఆరుబయలు మ్యూజియంలోని శిల్పాల్లో,1987లో కట్టంగూరు కాలువ తవ్వేప్పుడు బయల్పడిన కాకతీయుల కాలం నాటి గణేశ, అతి పెద్ద మూషిక శిల్పాలను నేనే తరలించానని చెప్పిన విషయం వారినెంతో ఆకట్టుకొంది.

కడలిని తలపించే ఉదయ సముద్ర జలాశయ అలల నాట్య విన్యాసం వారిని అబ్బురపరచింది. ఆనాటి పాలకుల ప్రజా సంక్షేమ కార్యకలాపాల పట్ల గల శ్రద్ధ ఈనాటికీ ఆదర్శప్రాయమన్న అభిప్రాయాన్ని కలిగించింది. చెరువు కట్ట దిగి, తెలుగు రాష్ట్రాలే కాక పొరుగు రాష్ట్రాల వారికి కూడా వింతగా తోచే ఛాయా సోమేశ్వరాలయానికి చేరుకొన్నాం.



త్రికూటాలయంలో గల మూడు గర్భాలయాల్లో ఉత్తరంవైపు ఆలయం రెండు వైపుల నుంచి రంగమండపం ద్వారా వచ్చే కాంతి, దక్షిణ వైపు దేవాలయం అర్ధమండపంలోను నున్న రెండు స్థంభాలపై పడి, రెండు స్థంభాల నీడలు ఒకదానినొకటి ఖండిరచుకొని, ఒకటిగా మారి, గర్భాలయ గోడపై పడుతుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆ నీడ, శివలింగం మీదుగా గోడపై పడుతూనే ఉంటుంది. ప్రపంచంలోని ఏడు వింతల్ని చూచిన వారికి, ఇది ఎనిమిదో వింతగా తోచింది. అపురూపమైన ఆలయాలను అద్భుత శిల్పాలను చూశామన్న ఆనందం ఒక పక్క, శిథిలాలను పదిల పరచలేమా అన్న బాధ్యతాపూర్వక ప్రశ్న మరో పక్క వారిని వెంటాడిరది. ఇంతలో హైదరాబాదు రానే వచ్చింది.



---

**40వ పుట తరువాయి..**

మేధస్సు సృజనాత్మకతను కృత్రిమ మేధపై పరిశోధనలకు వాడుకుంటున్నా,**మన ఇన్ఫోసిస్, విప్రో, టి సి యస్ లు ప్రజలలో కంప్యూటర్ అక్షరాస్యత, ద్వారా సాధికారిత పెంచటానికి, అంతరం తగ్గించటానికి ఎటువంటి కార్యక్రమాలు తీసుకోవటం లేదు.**

మనం కోల్పోయింది ప్రాజ్ఞ్ నన్నయ యుగంలో సాహిత్యం, అలవాటు చేసుకుంది ప్రజాసాహిత్యాన్ని వెక్కిరించటం మాత్రమే కాదు,ప్రశ్నించే అలవాటునే అణగదొక్కాం, 'గరికను తిన్న గాడిద చస్తుంది కాని గరిక చావదు' ప్రజలలో సహజపాండిత్యం, ప్రశ్నించే శక్తి ఎన్నటికీ అడుగంటదు. అనంతపురం జిల్లాలో సాధారణ దళిత గృహిణి ఎండపల్లి భారతి రాస్తున్న బతుకు కథలు పొందుతున్న ఆదరం ఇందుకు సాక్ష్యం.ఆమె 'అత్తిరసాలు' 'రామానుజన్ వ్రత కథలను, నమ్మకుంటే దుమ్మే' చందమామ కథలను, 'ఏడుస్తూ రైకముళ్ళు విప్పేవాడి' కథ,లేచిపోయిన తల్లిని ముసలితనంలో పోషించిన కొడుకు మానవత్వాన్ని గుర్తు చేస్తూ, కోతుల కథ అడవులు నాశనం కావటానికి ఎవరు కారణం అని నిలదీస్తుంది.

'పాడవోయి భారతీయుడా! ఆడిపాడవోయి ప్రగతిదారులా:'

అ

పుస్తక సమీక్ష

# భారతదేశంలో విదేశీ ముస్లింపాలన పర్యవసానాలు




**భారతదేశంలో విదేశీ ముస్లిం పాలన పర్యవసానాలు**
రచన:డా.బి.సారంగపాటి
వెల:రూ.250
ప్రతులకు:
సాహిత్య నికేతన్
హైదరాబాద్
040-27563236
విజయవాడ
9440643348

డా.బి.సారంగపాణి ఆర్థిక శాస్త్రంలో ఆచార్యులుగానే కాక సామాజిక కార్యకర్తగా, గ్రంథ్లోకర్తగా లబ్ధప్రతిష్టులు. పైపుస్తకంతోపాటుగా'ఆంగ్లేయుల ఏలుబడి - అంతులేని దోపిడి' 'ఎకనామిక్ రిపోర్ట్సు ఇన్ ఆంధ్రప్రదేశ్ 'ప్రిపేరింగ్ ఫర్‌ది ఫ్యూచర్ మొదలైన గ్రంథచనతో, విద్యా సంబంధమైన పరిశోధనాత్మకమైన వ్యాస రచయితగా కూడా పేరు పొందారు.

ప్రస్తుత గ్రంథం 'భారతదేశంలో విదేశీ ముస్లింపాలన' రచయితకు గల గాఢమైన చరిత్ర పరిజ్ఞానాన్ని తెలియజేస్తుంది. భారతదేశ చరిత్రను కూలంకషంగా అధ్యయనం చేయటమే కాకుండా, తన పరిశీలన, పరిశోధనకు దన్నుగా జాతీయంగా అంతర్జాతీయంగా ప్రముఖులైన చరిత్రకారుల రచనల సహకారం తీసుకోవడం జరిగిందని రచయిత' ఉపోద్ఘాతం'లో పేర్కొన్నారు.వీరిలో ప్రథమంగా భారత మధ్యయుగాల చరిత్రలోను, బహు చరిత్ర గ్రంథాల రచయిత అయిన కిశోర్ శరన్‌లాల్, ఇస్లాంమత విమర్శకుడు, విలక్షణ మహ్మదీయుడుగా జీవితం ప్రారంభించి తుదకు ఆ మతాన్నే తీవ్రంగా విమర్శించిన అన్వర్‌షేక్; ఇస్లాంమత సంస్కృతి,చరిత్రపై విశేషంగా రచనలు చేసిన,మాసూద్ అలిఖాన్ మరియు రాబర్ట్‌బ్రూస్ బి.స్పెన్సర్ - ఇస్లాం మత వ్యతిరేకి అయిన అమెరికా రచయిత - ఈ విధంగా ఆయా రచయితలు రచనల ఆధారంగా చారిత్రిక వాస్తవాలను క్రోడీకరించి ఈ గ్రంథాన్ని రచించారు సారంగపాణి.ఈ గ్రంథం ముఖచిత్రంపై కూడా ఈ“నలుగురి రచనల ఆధారంగా” అని ముద్రించడం రచయితకు వారి యెడల గల కృతజ్ఞతాభావం

మతం పూర్తిగా వ్యక్తిగత విషయం.మన నమ్మకాన్నిగాని మన ఆచార వ్యవహారాలనుగాని, ఇతరుల మత, విశ్వాసాలకంటే గొప్పవని భావించడం గాని,ఇతరులపై ప్రభావితం చేయాలని గాని, తలచరాదు. కాని మన దేశంపై దాడిచేసిన ముస్లిం దురాక్రమణదారులు,మతవ్యాప్తి, సిరిసంపదలు కొల్లగొట్టడం, బానిసలుగా చెరపట్టడం,మతాంతరీకరణ, అవిశ్వాసులపై యుద్ధం (జీహాద్) మొ.లక్ష్యాలతో భారతదేశంపై దాడి జరిగిందని చరిత్ర చెప్పే వాస్తవం.అయితే భారతదేశ ప్రజలు-ముఖ్యంగా హిందువులు, చరిత్ర రచయితలు, ఉపాధ్యాయులు, పరిశోధకులు-జరిగిన నష్టాన్ని గుర్తించి,ఎందుకు జరిగినదీ,లేక అది జరుగకుండా ఉండటానికి ఏం చేసి ఉండాల్సింది- సరిగా గ్రహించలేదేని, ఆ లోపాలను సరిదిద్దే ప్రయత్నంతో ఈ పుస్తక రచన జరిగి ముఖ్యంగా ఇటువంటి వాస్తవాలు కొద్దిగా ఆంగ్లంలో లభిస్తున్న, తెలుగులో చరిత్ర గ్రంథాలు ఈ మధ్య కాలంలో వచ్చిన దాఖలాలు లేవు.ఆ లోటుని తీర్చటానికి సారంగపాణి పుస్తకం దోహదం చేసిందని చెప్పవచ్చు.

ఈ పుస్తకంలో ఉపోద్ఘాతం; ఉపసంహారం కాకుండా 8 అధ్యాయాలున్నాయి. ప్రత్యేక అనుబంధంగా శ్రీ సీతారాం గోయెల్ రచించిన 'మానవత్వం-ఇస్లాం '(ఇదేమి చరిత్ర నుండి) ఇవ్వబడింది. 'ఆరబ్బుల సామ్రాజ్య వాదం' అధ్యాయంతో ప్రారంభమై క్రీ.శ. 712లో మహమ్మద్ భిన్ ఖాసిం మొదటిసారిగా సింధు ప్రాంతంను జయించటంతో మొదలైన సుమారు వేయి సంవత్సరాలు అరబ్బులు, తురుష్కులు, పఠానులు,ఆఫ్రికన్లు,మొఘలాయిలు ఏవిధంగా భారతదేశాన్ని పరిపాలించిందీ ఈ గ్రంథంలో వివరంగా చెప్పబడింది. క్రీ.శ.1707 వరకు ఔరంగజేబు మరణించేవరకు భారతదేశాన్ని ఇస్లామిక్ దేశంగా (దారుల్ ఇస్లాం) మార్చాలని జరిగిన ప్రయత్నాలను చెప్పటంతో పాటు హిందూజాతి తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోటానికి చేసిన కృషిని పరిశోధనాత్మంగా తెలుగులో అందించడమే లక్ష్యంగా ఈ గ్రంథ రచన సాగింది.'మధ్యయుగ మతాల పోకడలు'లో భారతదేశంలో మతము,మతయుద్ధాలు,మధ్యయుగ ప్రజల అణచివేతకు, పాశవికతకు ఎలా గురిచేసిందీ; భారతదేశంలో జిహాద్ ప్రభావం, మత రాజ్యంలో బానినతనం,ముస్లిం రాజ్య స్వభావం-అధ్యాయాలలో ఇస్లాంలో హింసకు ఉన్న ప్రాధాన్యత గురించి, రైతుల దుస్థితి-ప్రతిఘటనలు సాయుధపోరాటాలు; శ్రమజీవులైన ప్రజలు,భిల్లులు,సతనామీలు, సిక్కులు,మొ.గువారు ఏ విధంగా ముస్లిందాడులను వీరోచితంగా ఎదుర్కొన్నదీ-చాలా వివరంగా తెలియచేయబడ్డాయి.- గ్రంథంలో...

చివరి అధ్యాయం- 'భారతీయ ముస్లింలు'లో ముస్లిం

**తరువాయి47వ పుటలో....**

టి.వి.రామకృష్ణ
99514 41131

# బాల సాహిత్య కథలు - వైవిధ్యం

సాహిత్య ప్రక్రియలలో కథ, నవల, నాటిక, పద్యం, కావ్యం, కవిత్వం, జీవిత చరిత్రలు, సంగీతం, గేయాలు, వ్యాసాలు ఇలా వివిధ రూపాలలో మనకు దర్శనం ఇస్తాయి. ప్రాచీన కాలంనుంచి మనకు వైవిధ్యభరితమైన సాహిత్యం ఉంది. ఇక కథా రూపానికి వస్తే, చిన్న కథలు, పెద్ద కథలు, నవలలు, నాటికలుగా రూపాంతరం చెందాయి. ఇక ప్రాచీన గ్రంథాలన్నీ కావ్య రూపంలో, పద్య రూపంలోనూ వెలువడ్డాయి. కథ కూడా వైవిధ్యమైన రూపాలను సంతరించుకుంది. జానపద కథలు, చారిత్రాత్మక కథలు, హాస్య కథలు, కాల్పనిక కథలు, ఊహాత్మక కథలు, భయానక కథలు, పరిశోధనాత్మక కథలు ఇలా వైవిధ్యభరితమైన రూపాలుగా మలచుకొన్నాం. పద్యం కూడా వివిధ రూపాలను సంతరించుకొని ఈనాటి ఆధునిక కవితా రూపంలో మనకు దర్శనం ఇస్తోంది. మకుట పద్యాలు, శతకాలు, ఇప్పటి నానీలుగా రూపాంతరం చెందాయి.




ఇక సంగీతానికి వచ్చేసరికి, కర్ణాటక సంగీతం, హిందుస్తానీ సంగీతం, జానపద సంగీతం ఇలా వివిధ రూపాలలో మన ముందు ఉంది. వివిధ వాగ్గేయకారులు వివిధ సాహిత్య ప్రక్రియలలో సంగీత గేయాలను అందించారు. అలాగే ఈ సాహిత్య ప్రక్రియలను కళారూపాలలో వెల్లడించడానికి వివిధ మాధ్యమాలను ఎన్నుకున్నాం. హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, నాట్యం, నాటకం, ఇలా వివిధ కళా రూపాలలోకి మలచుకున్నాం. సాహిత్య రూపాలలో వ్యాకరణం, ఛందస్సు, లయ , ప్రాస, తాళం ఇలా భాషను అందంగా, వినసొంపుగా లయ బద్ధంగా ఉండటానికి అనేక ఉపకరణాలను ఏర్పరుచుకున్నాం. ఎంతో మంది నిరక్షరాస్యులు ఉన్నప్పటికీ మౌఖికంగా నేర్చుకొనే సంప్రదాయంవల్ల ఈ సాహిత్య ప్రక్రియలు ఇప్పటిదాకా కొనసాగుతూ వస్తున్నాయి.




ఇంత వైవిధ్యమైన సాహిత్యం,సాహిత్య ప్రక్రియలు, కళలు మరే ఇతర పాశ్చాత్య సాహిత్యంలో మనం చూడం. ఇది కేవలం భారత దేశానికి మాత్రమే సొంతం అని చెప్పాలి. మన సంస్కృతి, సంప్రదాయాలలో ఈ సాహిత్య ప్రక్రియలన్నీ ఎక్కడో ఒకచోట ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ పండుగలు, ఉత్సవాలు,పెళ్ళిళ్ళు, జాతరలు,వ్యవసాయ పనులలో ఈ కళా రూపాలు, సాహిత్య రూపాలు మనకు దర్శనం ఇస్తూనే ఉన్నాయి. పెద్దల సాహిత్యంలో ఇంత వైవిధ్యమైన సాహిత్యం, సాహిత్య ప్రక్రియలు మనకు ఉన్నాయి. కథలను నడుస్తున్న చరిత్రలుగా మనం చెప్పుకోవచ్చు.




అయితే పిల్లల సాహిత్యంలో కూడా ఈ ప్రక్రియలు ఉన్నప్పటికీ, బాలసాహిత్యాన్ని ఒక ప్రత్యేక విభాగంగా మలచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే బాలసాహిత్యంలో భాష, శైలి, రూపం, రీతి, అంశం, వస్తువు, వైవిధ్యం, కథనం ఇలా అనేక అంశాలు పెద్దల సాహిత్యానికి భిన్నంగా ఏర్పరచుకోవాల్సిన అవసరం కలిగింది. పెద్దలకు ఇష్టమైన సాహిత్య ప్రక్రియలు, భాష, పిల్లలకు ఏమాత్రం ఇష్టమైన అంశాలు కావు. పిల్లల అవగాహనా స్థాయి, పెద్దల అవగాహన సామర్థ్యానికి ఎక్కడా సరిపోలదు. కాబట్టి బాల సాహిత్యాన్ని ఒక ప్రత్యేక సాహిత్య విభాగంగా చూడాలి. దానికి అనుగుణంగానే మన రచనలు ఉండాలి. కాబట్టి బాల్యసాహిత్యానికి ఒక ప్రత్యేక నిర్వచనం, ప్రమాణాలు ఖచ్చితంగా ఏర్పరచుకోవాలి. ఇంకొక ముఖ్యమైన అంశం, మాతృభాష, భాషా శైలి, సంస్కృతి ఇక్కడ ముఖ్య పాత్ర వహిస్తాయి.

బాలసాహిత్యం పిల్లల అవగాహనా శక్తి ఆధారంగా మనం రచనా ప్రక్రియలు ఎంచుకోవాల్సి వస్తుంది. వయసుల వారీగా భాష, శైలి ఎంచుకోవాల్సిన అవసరం ఉంది.అలాగే బాలసాహిత్యంలో బొమ్మలు ప్రధాన పాత్ర వహిస్తాయి. కాబట్టి బాలసాహిత్యానికి చిత్రాలు వేసే చిత్రకారుడు కూడా ప్రత్యేక ప్రమాణాలతో బొమ్మలు గీయాలి.

"కాదేది కవితకనర్హం" అని శ్రీశ్రీ గారు చెప్పినట్లు, పిల్లల కథలకు, గేయాలకు ఏ చిన్న అంశమైనా కథా రూపంలోనూ, గేయ రూపంలోనైనా మలచవచ్చు. అయితే పిల్లల అవగాహనా స్థాయి ఏ స్థాయిలో ఉందో చూసుకొని కథను గాని, గేయాన్ని గాని మలచుకోవాల్సి వస్తుంది.మనం ఉపయోగించే పదాలు, వాక్యాలు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. నెలల వయసు నుంచి దాదాపు మూడేళ్ళ వయసు వరకు బొమ్మల పుస్తకాలే ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈ స్థాయిలో బొమ్మలు కథలు చెబుతాయి. పూర్తిగా బొమ్మలతో నిండిన పుస్తకాలు ఈ వయసు పిల్లలకు వినియోగించాలి.

3-6 సం. పిల్లలకు బొమ్మలతోపాటు చిన్న పదాలు, చిన్న వాక్యం మాత్రమే ఉండాలి. 6-10 సం. లోపు పిల్లలు కూడా బొమ్మల కథా పుస్తకాలను ఇష్టపడతారు. ఇక్కడ సరళమైన రెండు లేదా మూడు

వాక్యాలు, 9-10 సం. పిల్లలకు ఐదారు వాక్యాలు ఉండేవిధంగా చూసుకోవాలి. మరి కథాంశం ఏమి ఉండాలని ప్రశ్నించు కొన్నప్పుడు, నిత్య జీవితంలో వారికి ఎదురయ్యే ఎలాంటి అనుభవాన్ని అయినా కథగా మలచుకోవచ్చు. వాళ్ళ ఊహకు, ఆలోచనకు, ప్రశ్నించే ధోరణికి అనుగుణంగా కథ మలచాలి. ఆ వయసు పిల్లలు వినోదం, కల్పనను అమితంగా ఇష్ట పడతారు. కథ హాస్యంగాను, ఊహాజనితం గాను ఉండాలి. ఇంకా ఈ వయసు పిల్లలు చిన్న, చిన్న కథలను ఇష్ట పడతారు. ఈ వయసు పిల్లలు భావోద్వేగాలను తెలుసుకొనే ప్రయత్నంలో ఉంటారు.కాబట్టి భావోద్వేగాలకు చెందిన అంశాలను సున్నితంగా సృజించాలి. ప్రేమ, దయ, జాలి, మర్యాద, ఇచ్చిపుచ్చుకోవడం, వంటి అంశాలను ప్రధాన కథా వస్తువుగా ఎంచుకోవాలి. అంటే దాని అర్థం కథ చివర నీతితో ముగించడం అని కాదు. సున్నితంగా, నర్మగర్భంగా ఇలాంటి అంశాలను కథ ద్వారా అందించగలగాలి. జంతువుల పట్ల, పక్షుల పట్ల, జాలి, దయ కలిగే విధంగా కథలు మలచుకోవచ్చు. ఈ వయసు పిల్లలు ప్రకృతి లోని అనేక అంశాలను పరిశీలిస్తూ, ప్రశ్నిస్తూ ఉంటారు. ప్రకృతిలో జరిగే వింతలను,విశేషాలను కథా వస్తువుగా ఎంచుకోవచ్చు.ఈ దశలో వివిధ వ్యక్తుల స్వభావాలను పరిశీలిస్తూ ఉంటారు. అలాంటి అంశాలను సున్నితంగా చెప్పవచ్చు.




మనకు బాలసాహిత్యంలో జంతువులు, పక్షులు మనుషులు లాగా సంభాషిస్తూ, కథలు చెప్పడం మనకు కొన్ని తరాలుగా వస్తోంది. ఇది పంచతంత్ర కథల ద్వారా మనకు లభించిన సంప్రదాయం. ఇలాంటి కథలు కొంత ఊహాజనితంగా ఉన్నా, జంతువుల సహజసిద్ధ స్వభావాలకు వ్యతిరేకంగా ఉండే విధంగా పాత్రను మలచకూడదు. ఉదాహరణకు ఒక రచయిత కేవలం శాకాహారాన్నే తినాలనే సందేశాన్ని ఇవ్వాలనే ఉద్దేశం (యావ) తో ఒక కథ మలిచాడు అనుకుందాం. ఆ కథలో పాత్ర ఒక పులి అనుకుందాం.పులికి అనేక అనుభవాలు జోడించి, ఆ పులి చివరకు పండ్లు, కూరగాయలు, గడ్డి తిని సాదు జంతువుగా మారిపోయిందని, కాబట్టి అందరూ శాకాహారమునే తినవలయును అని కథను ముగించాడు అనుకోండి. ఆ కథ ఎంత వికృతంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.

అలాగే కథలోగాని పాత్రలో గాని ఒక భరోసా,విశ్వాసం కోరుకుంటారు.కథ ఎన్ని మలుపులు తిరిగినా ఒక సుఖాంతం కోరుకుంటారు. ఈ విషయంలో- "పిల్లలు విశ్వాసం కోల్పోయినట్లైతే, బాల్యాన్ని కోల్పోయినట్లే" అంటాడు ఒక రచయిత. పిల్లల రచనలన్నీ పెద్దవాళ్ళు రాసేవే. కాబట్టి మన పెద్దవాళ్ళ అవగాహన అంతా పిల్లలమీద రుద్దడానికి ప్రయత్నించకూడదు. పిల్లల కథా పుస్తకాలు వాళ్ళ వ్యక్తిత్వాన్ని కించపరిచేవిధంగా ఉండకూడదు.

6-8 సం. పిల్లలు కూడా బొమ్మలతో కూడిన బొమ్మల కథల పుస్తకాలు బాగా ఇష్టపడతారు. ఈ వయసు పిల్లలు కొత్తదనాన్ని, వైవిధ్యాన్ని కోరుకుంటారు. వీరికి చిన్న కథలను అందించాలి.ఈ వయసులో పిల్లల వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. కాబట్టి మనం అందించే కథలు వాళ్ళ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే విధంగా ఉండాలి. ఈ వయసు పిల్లలు కాల్పనిక కథలను అమితంగా ఇష్టపడతారు.

12-15 సం. పిల్లలు కూడా కొత్తదనాన్ని, వైవిధ్యాన్ని కోరుకుంటారు. హాస్య కథలు, కాల్పనిక కథలు, ఊహాత్మక కథలు విరివిగా ఇష్టపడతారు. అయితే ఈ వయసు పిల్లలకు సంబంధించిన కథల పుస్తకాలు, చిన్న నవలలు తెలుగు బాలసాహిత్యంలో చాలా తక్కువ సంఖ్యల్లో ఉన్నాయి. ఈ విభాగంలో ఎక్కువ అనువాద కథలు ఉన్నాయి. ఈ వయసు పిల్లలు జీవిత చరిత్రలు, సైన్స్ కు సంబంధించిన విషయాలు బాగా ఇష్టపడతారు. "ఫాంటసీ", సైన్స్ ఫిక్షన్" సంబందించిన కథలు, నవలలు ఈ విభాగంలో విరివిగా తీసుకొనిరావలసిన అవసరం ఉంది.




పిల్లల పుస్తకాల అట్టమీద బొమ్మలు కూడా ఆకర్షించేవిగా ఉండాలి. ఇది అన్నీ రకాల పుస్తకాలకు వర్తిస్తుంది. బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకం సైజు, లోపలి పేజీలు,కథ నిడివి ఇవన్నీ ముఖ్య పాత్ర వహిస్తాయి. 6-10 వయసు పిల్లలు పెద్ద కథలను ఇష్టపడరు. ఊహకు, ఆలోచనకు తావిచ్చే కథలు ఈ వయసు వారికి అందించాలి.

ఒక పిల్లల కథా పుస్తకాన్ని ఎంచుకొనే ముందు తల్లిదండ్రులుగాని, ఉపాధ్యాయులుగాని, గ్రంథాలయ నిర్వహకులుగాని ఖచ్చితంగా కొన్ని ప్రమాణాలను పాటించాలి. పుస్తకం ఏ విభాగానికి చెందినది? ఆ పుస్తకం నుండి ఏమి ఆశిస్తున్నారు? బొమ్మలు ఏ స్థాయిలో ఉన్నాయి? ఆ పుస్తకం చదివి పిల్లలు ఆనందించగలరా? కథా




కథనం, శైలి ఎలావుంది? భాష ఏ స్థాయిలో వుంది? ఆ కథ పుస్తకం ఏ వయసు వారికి నిర్దేశించింది? మనకు జానపదకథలు, నవలలు విరివిగా అయితే అవి పిల్లలకు చెప్పడానికి అనువుగా వున్నాయా?

ఇలా పరిశీలించిన తరువాతే పుస్తకాన్ని ఎంచుకోవాలి. ఎందుకంటే పిల్లల ఇష్టా ఇష్టాలు, అభిరుచులు వేరు వేరు గా ఉంటాయి. మనం ఎంచుకొనే పుస్తకాలు పిల్లల అభిరుచులకు అనుగుణం ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా తల్లిదండ్రులు ధరలో ఖరీదైన పుస్తకాలు, ఖరీదైన పేపరు, ప్రింట్ ఉన్న పుస్తకాలు అన్నీ మంచి పుస్తకాలుగా భావించి కొంటారు.**కథల ఎంపిక చాలా ముఖ్యమైన విషయమని తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు గమనించాలి.**

మన తెలుగు బాలసాహిత్యంలో ఎటువంటి ప్రమాణాలు లేకుండా అనేక పుస్తకాలు బాలసాహిత్యం పేరిట చలామణి

అవుతున్నాయి. అవే ప్రామాణిక కథల పుస్తకాలు అని తల్లిదండ్రులు కొంటూ ఉంటారు. అనేకమంది ప్రచురణ కర్తలు భాష, శైలి, పుస్తకం నాణ్యత వంటి ప్రమాణాలు పాటించకుండా బాలసాహిత్యాన్ని ప్రచురిస్తున్నారు. అనేక పౌరాణిక కథలు, జానపద కథలు, నీతికథలు, పంచతంత్ర కథలు, తెనాలిరామలింగ కథలు, అనేక అనువాద కథలు, నవలలు ఎటువంటి ప్రమాణాలు లేకుండా బాలసాహిత్యం పేరిట చెలామణి అవుతున్నాయి.

ఇంతకుముందు చెప్పినట్లుగా ఆవిధంగా వయసులవారీగా, బాలసాహిత్యానికి ఖచ్చితమైన ప్రమాణాలు ఉన్న పుస్తకాలను ఎంచుకోవాలి. ఇందుకు ఉదాహరణగా మనం "చిల్డ్రన్ బుక్ ట్రస్ట్", న్యూ ఢిల్లీ వారి పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోవచ్చు. ప్రత్యేకంగా బాలసాహిత్యాన్ని మాత్రమే ప్రచురించే సంస్థ ఇది. బాలసాహిత్యానికి కావలసిన ప్రామాణిక కథల పుస్తకాలను వారు ప్రచురిస్తున్నారు. హిందీ, ఇంగ్లీషు, తెలుగు, తమిళం లాంటి అనేక ప్రాంతీయ భాషలలో పుస్తకాలను ప్రచురిస్తున్నారు. పుస్తకం సైజు మొదలుకుని బొమ్మలు, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా బొమ్మల కథల పుస్తకాలను అందిస్తున్న సంస్థ సి. బి. టి. తల్లిదండ్రులు సి. బి. టి. వారి పుస్తకాలను ఎటువంటి సందేహం లేకుండా అందించవచ్చు.

బాల సాహిత్యం చాలా విలువైనది. బాలసాహిత్యం మన సాహిత్య వారసత్వాన్ని ఒక తరాన్నుంచి ఇంకొక తరానికి అందిస్తుంది. పిల్లలకు అన్నీరకాల సాహిత్య ప్రక్రియలను పరిచయం చేయాల్సిన ముఖ్య బాధ్యత తల్లిదండ్రుల మీదే ఉంటుంది. ఆ తర్వాత ఉపాధ్యాయులు, బడి ప్రధాన పాత్ర వహించాలి. బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలలు. పిల్లల వ్యక్తిగత, మానసిక, సామాజిక అవగాహనకు కథలు దోహదం చేస్తాయి.పిల్లలకు కథలు అందించడంవల్ల వాళ్ళు భాధ్యతయుతమైన వ్యక్తులుగా ఎదుగుతారనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రతీ సాహిత్య సృష్టి కర్త రచయిత. పెద్దల సాహిత్యానికి సమీక్షలు, విమర్శలు విరివిగా ఉంటాయి. రచనలు ఏదో ఒక ఇజానికి, లేదా విశ్వాసాలకు అనుగుణంగా రాయడం జరుగుతుంది. ఇవి పెద్దలకు కుదురుతుంది. పిల్లలకు ఇజాలు, విశ్వాసాలకు అనుగుణంగా కథలు రాయకూడదు. బాలసాహిత్య రచనలు కత్తిమీద సామలాంటివని రచయితలు గుర్తించాలి. తెలుగు బాలసాహిత్యాన్ని పరిపూర్ణం చేయాలంటే రచయితలు ఖచ్చితమైన ప్రమాణాలను అనుసరించి కథలను రాయాలి. తెలుగు బాలసాహిత్యానికి వైవిధ్యమైన కథలను అందించి పరిపుష్టం చేయాల్సిన అవసరం ఉంది.సమకాలీన బాలసాహిత్యం అవసరం ఎంతో ఉంది. పాతతరం నుంచి కొత్తతరానికి తెలుగు బాలసాహిత్యాని మలచుకోవాల్సిన అవసరం ఉంది.

పిల్లలు కథలను విరివిగా చదివేందకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బడులు అవకాశాలు కల్పించాలి. ఈ ప్రక్రియ పిల్లలలో కలిగే అనేక సమస్యలకు సమాధానం చెపుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. పిల్లలు మానసికంగా ఎదగడానికి కథలు దోహదపడతాయి. సెల్ ఫోన్ సంస్కృతి నుండి బైట పడవేస్తుంది. పిల్లలకు ఒక మంచి వ్యాపకాన్ని బాలసాహిత్యం కల్పిస్తుంది.

–రచయిత పేరు:యం.వి.శాస్త్రి

**కవిత**

## తెలుగు తోట

కొంత కాలం కిందట
నాకో
సొంతనేల ఉండేది
**అ**క్కడ వీచేగాలి
ప్రతి నిత్యం
**ప**రిమళ భరితం
ఆ మట్టి మీద నీళ్లు
తేటగా
తరళ స్వచ్ఛంగా పారేవి
**అ**క్కడ
ఊసుగా మాటగా మొలకెత్తే
ప్రతి సవ్వడి గింజ
పచ్చగా తలెత్తి
ఆకులతో కొమ్మలతో
తనపాట తను పాడుకునేది
**మా**ర్కెట్ మిణుకులు
మమతల చినుకులు
తెలుగు తోటలో
పూలూ పిందెల్లా కదలాడేవి
**అ**ప్పటికి
56 నక్షత్రాల ఆకాశం
నా ఊహల వర్ణచిత్రాలకు
మీగడతెర..
అమ్మ చెంగు
నాకు ఊయల వింజామర!
**ఇ**ప్పుడు
అదంతా ఓ కల!
**నా** పెదవంచుల మీద
ఆంగ్లం అగ్గిపుల్ల గీసి గీసి
అమ్మ కానుకిచ్చిన నా ఆకాశానికి
నేనే నిప్పెట్టుకున్నాను
**నా** నెత్తికి
మంటలు అంటుకున్నాయి
నేనంతా తగలబడటానికి
మరెంతో కాలం పట్టదు
నన్ను పూడ్చే నేల కూడా
నాకు పరాయిదవుతుంది
**ఇ**పుడేమైనా
శిశిరపు సుడిగాలి చుట్టుకుని
నిరాదరణ కార్చిచ్చు రగులుకొన్న
ముసలి తల్లిలాంటి తెలుగు తోటలో
ఒక్క గాంధారివాన కురవాలి
ఉగ్గుపాల భాష ఉరకలెత్తాలి
ఇంట్లో బడిలో బజారులో
పెత్తనపు మంటలన్నీ ఆరిపోవాలి

కంచరాన భుజంగరావు
9441589602

44వ పుట తరువాయి..

సమాజం గురించి, భారతస్వాతంత్ర్య పోరాట సమయంలో ఖిలాపత్ ఉద్యమం, ప్రత్యేక అస్తిత్వ, ద్విజాతి సిద్ధాంతం,పెరుగుతున్న మతఛాందసవాదం,వహాబిజం మొ.గు విషయాలపై సమగ్రంగా విశ్లేషిస్తూ రచన సాగింది.అయితే భారతదేశంలోని ముస్లిం సోదరులు అందరూ విద్యాపరంగా, ఆర్ధికపరంగా, తాము నష్టపోతున్నందున అన్ని వాస్తవాలను ముఖ్యంగా తీవ్రవాద ధోరణులను గ్రహించి అడ్డుకునే ప్రయత్నం చేయాలని రచయిత సూచిస్తారు.అలాగే, హైందవ ధర్మం కూడా సామ్రాజవాదమతశక్తులను ఎదుర్కొనేలా ఆలోచించాలని కూడా సందేశమిస్తారు రచయిత.

మొత్తం మీద ఇంతటి గంభీరమైన, సున్నితమైన విషయం మీద ఎంతో అధ్యయనం చేసి తాను వృత్తిపరంగా చారిత్రిక రచయిత కాకున్నా, చారిత్రిక సత్యాలను-బాహ్యామైన, వివాదాస్పదమైన విషయాలను కూడా,సరళంగా,సూటిగా,వివాదాలకు రెచ్చగొట్టే ధోరణికి తావులేకుండా – సత్యాన్ని చెప్పడమే చరిత్రకారుల లక్ష్యం కావాలని రచయిత సమర్ధవంతంగా సాగించిన రచన ఇది.అందరూ చదవవలసిన గ్రంథమిది.

–––ఎం.వి.శాస్త్రి
94413342999

డా.జి. వి. పూర్ణచంద్
9440172642

# శషభిషలు

కొన్ని పదాలు పాతబడి వెలిసిపోతాయి. శషభిష కూడా అలాంటిదే! ఒకప్పుడు కవులు అలవోకగా వాడిన ఈ పదం ప్రస్తుతం వాడకంలోంచి తప్పుకుంది. శ, ష, భ వర్ణాల్నిబట్టి ఇది సంస్కృత పదం అనే భావన ఇందుకు ఓ కారణం కావచ్చు. కానీ, సంస్కృత నిఘంటువుల్లో ఈ పదమే కనిపించదు.

"*శషభిష లంతగా సలుపఁజాలవు నీవు హలాయుధుం దకల్మషహృదయుండెయైన...*" పాండవాశ్వమేథంలో తిరుపతి వేంకట కవుల ఈ ప్రయోగాన్ని ఉదహరించి, 'పదబంధ పారిజాతం' నిఘంటువు "ధూం ధాం లాడటం" అనే అర్థాన్ని ఇచ్చింది. శషభిషల్లేకుండా బలరాముడికి నచ్చచెప్పి అశ్వమేథానికి వచ్చేలా ఒప్పించాలని ధర్మరాజు కృష్ణుణ్ణి కోరిన సందర్భం ఇది. ఇదే తిరుపతి కవులు "నానా సందర్భములు"లో నాదెళ్ళ పురుషోత్తమకవి సుగుణాలు ప్రస్తుతిస్తూ, "*ఋషివలె జీవించెను, పూ/రుషోత్తముడితండనన్ గరువమున్ మఱియే/ శషభిషలు నెఱుఁగఁడు పూ/రుషోత్తముండు సర్వదా పురుషసత్తముడె*" అనే పద్యంలో కల్లాకపటం ఎరుగని వాడనే అర్థంలో "శషభిష" పదాన్ని వాడారు. ఒకే పదాన్ని రెండు విభిన్నార్థాల్లో తిరుపతికవులే ప్రయోగించటం విశేషం. డాబు దర్పం ప్రదర్శించే షోకిల్లారాయుళ్లని "శషభిషలు పోతున్నాడు" అనటం కూడా ఉంది.

కన్యాశుల్కంలో గిరీశం తన శిష్యుడికి చదువు చెప్పే నెపం మీద అగ్రహారంలో అగ్నిహోత్రావధాన్లు ఇంట తిష్టవేయాలని ఎత్తు ఎత్తాడు. అగ్నిహోత్రావధాన్లు పేరుకు తగ్గవాడని గ్రహించి ముఖస్తుతి మంత్రం ప్రారంభిస్తాడు. ఆయన లాంటి చప్పన్నభాషలూ వచ్చిన మనిషి యక్కడా లేడనీ, సంస్కృతం మంచినీళ్ల ప్రవాహంలా మాట్లాడతాడనీ, అంతటి విదూషకుణ్ణి యక్కడా చూళ్లేదనీ డిప్టీకలక్టరుగారు శలవిస్తూండేవారనీ... ఇలా ఎత్తుకుంటాడు. పొగడ్తలకు లొంగని అగ్నిహోత్రావధాన్లు ధుమధుమలాడుతూ "ఈ శషభిషలు నాకేం పనికిరావు. ఇతడి వైఖరి చూస్తే ఇక్కడే బసవేసేటట్టు కనబడుతూంది. మా ఇంట్లో భోజనం యంతమాత్రం వీలుపడదు." అనేస్తాడు. శుష్క స్తుతులు, ముఖప్రీతి మాటలు, పోసుకోలు కబుర్లు అనే అర్థంలో శషభిషని గురజాడ వారు ప్రయోగించారు. రాక్షసుడిని చంద్రబింబం లాంటి మోము, మల్లెపువ్వు లాంటి మనసు అని పొగిడ్తే అది శషభిషే అవుతుంది..

శషభిషలు అంటే ప్రయోజనంలేని తిరకాసులతో కూడిన చర్చలు purposeless and impeding discussions అని పత్రికాభాష నిఘంటువు ఈ పదానికి అర్థాన్ని వివరిస్తూ, "ప్రకటించిన జొన్నల పంపిణీ గురించి అధికారులు శషభిషల్లో మునిగి ఉండగానే తీవ్రవాదులు రంగంలోకి దిగి...(ఆం భూ. 20/4/80)"అని ప్రయోగాన్ని ఇచ్చింది. "ఈజిప్టులో అస్వన్ డామ్ నిర్మాణార్థం ఆర్థిక సహాయం చేయుటకు అమెరికా శషభిషలు" అని 1956లో గోల్కొండ పత్రిక ఒక వార్తకు శీర్షికపెట్టింది. "ఆమోదించిన డిమాండ్లను వెంటనే శషభిషలు లేకుండా అమలు చేయాలి" అని ఆంధ్రపత్రిక ఓ వార్తలో వ్రాసింది. కుంటిసాకులు వెదకటం అనే అర్థం ఇక్కడ కనిపిస్తుంది. "ఒకరికంటే ఒకరు ఎక్కువ అనే అహమహమికలు,శషభిషలు మానండి" లాంటి ప్రయోగాలున్నాయి. అహమహమికలు అంటే నేనంటే నేనంటూ మల్లయోధులు జబ్బలు చరుస్తూ చేసే రణనినాదాలు. శషభిషల్ని కూడా దానితో కలిపేశారు

అత్యాధునికుల్లో కూడా కొందరు శషభిషలేవీ పెట్టుకోకుండా ఈ పదాన్ని వాడుతూనే ఉన్నారు. "ఎన్నికల్లో ఇచ్చే వాగ్దానాల మాట నిజంఎంతో శషభిషలు లేకుండా తేల్చేశాడు" అని సృజన 1985 జూలై సంచిక, "... ఒప్పుకోలేదు సరిగదా ఆమోదించిన డిమాండ్లను కూడ వెంటనే శషభిషలు లేకుండా ఆమోదించలేదు" అని వీక్షణం జూన్ 2011 సంచిక, "ఎటువంటి శషభిషలు లేకుండా అమెరికాకు దగ్గరవుతున్న మోడీ నోట ఈ మాటలు..." అని వీక్షణం మార్చి 2018 సంచికలలో శషభిష ప్రయోగాన్ని గమనించవచ్చు. "కందుకూరిది ఎలాంటి శషభిషలు లేకుండా, సూటిగా విషయం వైపు ప్రస్తావించే 'పురాణశైలి" అని వెలుదండ నిత్యానందరావు వ్రాశారు. "ది సెవెన్ మినిట్స్- అన్న నవల ఈ విషయంపై ఎన్ని కోర్టు తీర్పులు, శషభిషలు నడిచినా చర్చ ఒక కొలిక్కి రాని సమయంలో ఇర్వింగ్ వాలెస్..." అంటూ ఎ.బి కె ప్రసాద్ శషభిషని కోర్టు వాదోపవాదాలకు సంబంధించిన పదంగా ప్రయోగించారు.

తిరుపతి వెంకటేశ్వరులు అనే రచయిత 1957 ఆగస్టు 25 ఆంధ్రపత్రిక దినపత్రికలో అప్పటికి నూరేళ్ల నాటి ఉదంతాన్ని వ్రాశారు. ఇంద్రగంటి విశ్వపతిశాస్త్రి పిడపర్తి చలమయ్యశాస్త్రి అనే ఇద్దరు పంచాంగ కర్తల మధ్య ఘర్షణ ఇందులో ఇతివృత్తం. కోటిపల్లికి చెందిన ఇంద్రకంటి విశ్వపతి శాస్త్రి పంచాంగకర్త. ఆయన కుమారుడు గ్రంథచౌర్యం చేసి తానే వ్రాసినట్టు తండ్రిని నమ్మించటంతో విశ్వపతిశాస్త్రి ఆ పంచాంగాన్ని రాజుగారికి అందించాడు. "చలమయ్యశాస్త్రిగారు ఆ యేడాది 'లుప్తమాసం' ఉందని వ్రాశారు గదా, మీరు వ్రాయలేదేమిటని రాజుగారు అడిగారు. విశ్వపతిశాస్త్రి చలమయ్య శాస్త్రికి ఏమీ తెలియదని బుకాయించాడు. రాజావారు ఆ ఇద్దరి మధ్యా పోటీ పెట్టారు. కానీ, తగువు తేలలేదు, దేవుడే నిర్ణయిస్తాడంటూ పిడపర్తి చలమయ్య, విశ్వపతి ఇద్దరూ రెండు తాటాకుల మీద తమ పేర్లు వ్రాసి కాలువ ప్రవాహంలోకి వదిలారు. చలమయ్య ఆకు ప్రవాహానికి ఎదురు వెళ్లింది. 'ఇదే నిదర్శనం' అన్నాడు చలమయ్యశాస్త్రి. 'ఇది గారడీ' అని విశ్వపతి శాస్త్రి ఓటమిని అంగీకరించలేదు. దాంతో కోపించిన చలమయ్య "అబద్ధం చెప్పిన వాడి కుమారుడు మూడు నెలల్లోగా మరణిస్తా"డంటాడు. విశ్వపతి శాస్త్రి కొడుకు మూణ్ణెల్లకి మరణించాడు. "లుప్తమానము వమ్ము జేయ పోరాడి విశ్వపతి పాడాయెన్" అంటూ ఈ ఉదంతాన్ని కథలు కథలుగా

**తరువాయి 50వ పుటలో....**

కీ.శే. సురవరం ప్రతాపరెడ్డి

# ఉగాది



ఉగాది కర్నాటాంధ్రులకు చాలా ముఖ్యమైన పండుగ. దీనినే సంవత్సరాది పండుగయని యందురు. ప్రతి సంవత్సరం చైత్ర శుక్ల పాడ్యమి దినమున నీ పండుగ చేయబడును. ఇదియే యన్ని పండుగలలో మొదటి పండుగ. ఈ దినమున ప్రతి జాతివారును శిరస్స్నానము చేసి క్రొత్త బట్టలు కట్టుకొందురు. సాయంకాలమున దేవాలయమందు జేరి బ్రాహ్మణాశీర్వాదమును బొంది, ప్రతివాడునూ తన పేర నా సంవత్సరమందెన్ని సున్నలుండునది విచారించును. బ్రాహ్మణుడు పంచాగం చూసి యేయే వ్యక్తి కెన్ని సున్నలుండునది చెప్పును. ఎన్ని సున్నలుండిన నన్ని మారు లా సంవత్సరమం దా మనుష్యుడు రోగార్తుడగునని దీని భావము. తెలంగాణమందలి కొన్ని భాగములలో సాయంకాలమందూరి బండ్లన్నియు నలంకరింపబడి మంచి ఎడ్లచే నీడ్పింపబడును. ఉగాది పండుగ యొక్క భోజనములలో జాల ముఖ్యమైనది 'ఉగాది పచ్చడి', లేక గొజ్జు, ఈ గొజ్జును వేపపూత చేతను, లేత మామిడికాయల ముక్కల చేతను క్రొత్త చింతపండు పులుసు, క్రొత్త బెల్లము, పానకము, గసగసాలు, పప్పులు మున్నగువానిని కలిపి సిద్ధము చేయుదురు. అనగా క్రొత్త సంవత్సర ఫలపుష్పములచే నిది సిద్ధము చేయబడుచున్నది. ప్రకృతి యంతయు నప్పుడే ప్రాత యాకులను దుల్చి క్రొత్త చివురుల చేతను, ఫలపుష్పముల చేతను వికసించుచుండు సమయ మాంధ్రులకు సంవత్సరాది. ఈ పండుగ సర్వ వర్ణముల వారికిని ముఖ్యమైనట్టిది.

పూర్వము 'యుగాది' (యుగ+ఆది; యకారాది పదమ) పండుగను నొక దానిని చేయుచుండినట్టుల భవిష్యత్ పురాణోత్తర భాగమందలి కథనము వలన తెలియవచ్చెడి. శ్రీకృష్ణుడు ధర్మరాజుతో నిట్లు చెప్పుచున్నాడు.

కృతయగము వైశాఖ తృతీయనాడు ప్రారంభమయ్యేను. కార్తిక నవమినాడు త్రేతాయుగ ముద్భవించెను. నభత్రయోదశినాడు ద్వాపరము వచ్చినది. మాఘం పౌర్ణిమ కలికాలాది యని చెప్పబడుచున్నది. ఈ తిథులు యుగాదులని పండితులచే బేర్కొనబడియున్నవి.

శ్లో. యుగాదయశ్చ కథ్యంతే తథైతాః సర్వసూరిభి:

ఈ నాలుగు యుగముల యాది తిథులందు నాయాదేవతలను బూజించి బ్రాహ్మణులకు నానాదానము లియ్యవలెను.

కలియుగము మాఘమాసమందు ప్రారంభమయ్యెనని పై పురాణం చెప్పుచున్నది. మన ఉగాది చైత్రమందు జరుగునట్టిది. కావున పై పురాణము మన ప్రమాణము కాదు.

ధర్మ సింధుకారుడును, నిర్ణయ సింధుకారుడును నీ యుగాది పండుగ సంవత్సరారంభపు బండుగయని నిర్ణయించినారు. ధర్మ సింధుకారుడు విశేషించి యిట్లు వ్రాయుచున్నాడు.

'అత్ర శుక్ల ప్రతి పదాది రమాంత ఏవ మాసః ప్రాయేణ దాక్షిణాత్యైరాద్రియతే'.

అనగా నీ పండుగు దాక్షిణాత్యులచే నాదరింపబడుచున్నదని వీరి యభిప్రాయము. ఈ పండుగనాడు ఈ ప్రకారం చేయవలయునని ధర్మసింధువు చెప్పుచున్నది.

'నూతన సంవత్సర కీర్తనాద్యారంభం ప్రతి గృహ ధ్వజారోహణం నింబపత్రాశనం వత్సరాది శ్రవణం నవరాత్రారంభః'.

అనగా నీ దివసమున ప్రతియింటికి దోరణములు కట్టి వేపపూతచే గొజ్జు చేసి భుజించి సంవత్సర ఫలశ్రవణమును చేయవలయును. కొందఱు ఉగాది నుండి శ్రీరామనవమి వఱకు శ్రీరామనవరాత్రులు చేయుదురు.

'చైత్ర శుక్ల ప్రతిప నృత్యుజయంతీ త్యేకే'.

అనుట వలన నీ దివసమునాడు మత్యుజయంతి యని కొందఱుందురని యనుమానముగా జెప్పినాడు.

'ఆర్య పర్వ పద్ధతి' యను గ్రంథ మొకటి పండిత భవానీ ప్రసాదు (ఆర్య) గారిచే హిందీలో బ్రకటింపబడినది. అందు గొన్ని పండుగల చర్చ గలదు. ఈ గ్రంథములో గొన్ని విషయములు చాలా యుత్తమములుగా నున్నవి. దీనిలో 'నవ సంవత్సరోత్సవము' లేక 'సంవత్సరేష్టి' యను శీర్షికయం దీ యుగాదిపండుగ విషయమున నిట్లు వ్రాయబడినది:

మధుశ్చ మాధవశ్చ వాసంతికా వృత్,'

–యజుర్వేదము.

అనగా యజుర్వేదమందు సంవత్సరము వసంతముతో

ప్రారంభమగుననియు, నా ఋతుమాసముల పేర్లు మధువు, మాధవము అని యుండెననియు వీరి యభిప్రాయము. కాని కాలక్రమేణ చైత్రాది మాసములే వ్యవహార సిద్ధము అయ్యెనట.

ఈ విషయమై హేమాద్రి యిట్లు వ్రాసియున్నాడు

'చైత్రే మాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేహని,

శుక్ల పక్షే సమగ్రం తు తదా సూర్యోదయే సతి,'

అనగా బ్రహ్మదేవుడు చైత్రశుక్ల ప్రతిపత్తునాడు జగత్తు యొక్క ప్రథమ దివసమును ప్రారంభించెను.

భాస్కరాచార్యులు తమ సిద్ధాంత శిరోమణి యను జ్యోతిష గ్రంథమం దిట్లు సెలవిచ్చినారు.

'లంకానగర్యా ముదయాచ్చ భానౌతస్యైవ వారే ప్రథమం బభూవ

మధోస్సితాదే ర్దినమాసవర్షం యుగాదికానం యుగపత్ప్రవృత్తి:'

అనగా లంకానగరమందు భానుడుదయించుటజేసి మధుమాసము (చైత్రము) యొక్క శుద్ధ పాడ్యమినాడు యుగాదుల యొక్క ప్రారంభమయ్యెను. పై శ్లోకమందలి 'యుగాది' అను పదము గమనింపదగినది ఈ ఉగాది ప్రారంభమున యకారాదిపదమగు యుగాదిగానే యుండి యుండవలెను. అది తర్వాత నపభ్రంశము కాకున్న తద్భవమైనదని యెన్నవలెను. హిందీ గ్రంథకారుడు రెండు మూడు విశేషము లీ పండుగును గుఱించి సూచించి యున్నాడు. ఔరంగజేబు తన కొడుకగు మొఅజ్జమ్ అను వానికి వ్రాసిన జాబులో నీ పండుగను గుఱించి యిట్లు పార్సీలో వ్రాసెను:' ఈ దినమున అగ్ని పూజకులగు పారశీకుల పండుగ. మఱియు నిది కాఫరులైన హిదువుల విశ్వాసానుసారముగ ధిక్కృతుడైన విక్రమాదిత్యుని రాజ్యాభిషేకదివసము. మఱియు హిందు దేశములో నిది సంవత్సరాదిగా నున్నది.''పై యౌరంగజేబు ధిక్కార వాక్యములలో నొక్కటి గమనింపతగియున్నది. ఈ పండుగ పార్సీలకు గూడ సంవత్సరాది పండుగగా నున్నదనుటలో నీ యాచారము ప్రాచీన వేదకాలమందు ఆర్యులు, పార్సీలు కలిసియుండిన కాలవు మర్యాదను సూచించుచున్నది.మరియు పై భవానీ ప్రసాద పండితుని యభిప్రాయున నీ చైత్రాదిపర్వమే పూర్వము హిందూస్థాన మంతటను నుండెనట. కాని తర్వాత చాంద్రసౌరమాన భేదములు కలిగిన తర్వాత దక్షిణమున చైత్రమాసమందును, నుత్తరమున మేష సంక్రాంతినాడును నీ పండుగజేయు నాచానమయ్యేనట. ఈ పండితుని యభిప్రాయములు గమనింపదగినవి.

పార్సీలలో ఉగాదిని నౌరోజ్ అనగా కొత్త దినము అని యందురు. ఇది సాధారణముగా ఇంగ్లీషు మాసమగు మార్చి నెలలో వచ్చును. అనగా వసంత కాలారంభమందు వచ్చును. ఇంచుమించు మన ఉగాది వచ్చు కాలములో వారికిని సంవత్సరాది పండుగ వచ్చుచుండును.

శాలివాహనశకమును పాటించువారందఱును ఈ పండుగను చేయుదురు.అందు ముఖ్యముగా తెనుగువారు, కర్ణాటకులు, మహారాష్ట్రులు ఈ పండుగను చేయుదురు. మహారాష్ట్రులు కూడా ఉగాది గొజ్జును సేవింతురు. అయితే వారు అందు వేపపూతనే కాక లేత నసలను కూడా నూరి కలిపి పుచ్చుకొందురు

(కీ.శే.సురవరం ప్రతాపరెడ్డి రచించిన
'హిందువుల పండుగలు'నుండి)

48వ పుట తరువాయి..

చెప్పుకున్నారంతా! "లుప్తమాస శషభిషలు" అనే ఈ కథలో అజ్ఞానాన్ని జ్ఞానంగా చెప్పుకుంటూ, పసలేని వాదన చేయటం అనే అర్థంలో శషభిష కనిపిస్తుంది.

ఇలా ఒకచోట తిట్టుగా, ఒక చోట పొగడ్తగా, ఇంకొకచోట ఆగ్రహంగా, ఒకసారి జ్ఞానంగా, ఇంకొకసారి అజ్ఞానంగా మరొకచోట బుకాయింపుగా, సమర్థింపు వాదంగా శషభిష' తెలుగు సాహిత్యంలో చిత్రవిచిత్ర ప్రయోగాలకు కారణం అయ్యింది. 'శష్' అంటే బాధించటం, భిష్ అంటే భయపెట్టటం అని పండితులు ఈ ధాతువులకు అర్థాలు చెప్తారు. కానీ, శషభిష భయపెట్టి బాధించేంత స్థాయిలో కనిపించదు. 16-17 శతాబ్దాలలో తమిళ నేలమీద మరాఠా మాతృభాషగా కలిగి తంజావూరు రాజ్యాన్నేలిన శాహాజీ, వెంకోజీ, శరభోజి, తులజాజి, లాంటి మరాఠా రాజులు తెలుగులో యక్షగానాలు, కావ్యాలు, వీధినాటకాలు, రామాయణ భారతాలు వ్రాశారు. శివాజీ సవితి సోదరుడు ఏకోజీ. అతని కుమారుడు శాహాజీ. శాహప్రభువు అంటారు ఈయన్ని. 'భక్తవత్సలవిలాసం' అనే నాటకం వ్రాశాడు. తెలుగు సంప్రదాయం ప్రకారం ఈ గ్రంథానికి వ్రాసిన ముందు మాటల్లో 'కుకవినింద' చేస్తూ ఈ పద్యం వ్రాశాడు. పరిశీలించండి:

*"ఝషభిషలైన కొన్ని యపశబ్దములన్ కృతిఁజెప్పి కావ్య పౌ*
*రుషముల కొళ్ళుగట్టుకుని రూఢికి నెక్కదలంచి శేముషీ*
*ధిషణులమంచు వాదులకు దియ్యముగాఁ గవులాడు వాక్యముల్*
*విషకబళంబుఁగా దలఁచి వీనులఁబెట్టరు సత్కవీశ్వరుల్"*

"ఝషభిష లైన కొన్ని అపశబ్దాల్ని యథేచ్ఛగా ప్రయోగిస్తూ అది తమ కావ్యపౌరుషం అంటూ, వాటిని రూఢికి తెచ్చి కీర్తిని కొల్లగొట్టాలని చూసే కొందరు పెద్దకవుల రచనల్ని విషపు ముద్దలుగా సత్కవీశ్వరులు భావిస్తారని దీని తాత్పర్యం. ఝషభషలైన అపశబ్దాలంటే ఏవి? ఆప్టే సంస్కృత నిఘంటువులో 'ఝషః' అంటే చేప. మకరరాశి అనే అర్థాలు కనిపిస్తాయి. ఝషకేతనం, ఝషనయని లాంటి ప్రయోగాలున్నాయి. 'ఝష' అని వ్రాయాల్సిన చోట 'భష' అని వ్రాసి, ఇది కూడా ఆ అర్థమే అని దబాయించే వాళ్లని ఈ పద్యంలో నిందించాడు శాహ ప్రభువు. దివాకర్ల రామభాస్కరం గారు సంకలనం చేసిన తెలుగు 'ద్వితీయాక్షర ప్రాసపద నిఘంటువు'లో 'ఝషభష' అంటే 'పలుకలేని మాట' అనే అర్థాన్ని వ్రాశారు.

**నిర్దిష్టమైన అర్థం లేనప్పుడు కవులు సందర్భానుసారంగా ఆ వదాన్ని ప్రయోగించటం సహజం. 'ఝషభిష' శషభిషగా పరివర్తన పొంది ఉండవచ్చు.** ఈ పరివర్తన జనసామాన్యం నాలుకల మీద కాకుండా, కవుల కలాల ద్వారా జరిగింది. రసాయన చర్యలో పాల్గొనకుండా ఆ రసాయన చర్యని వేగవంతం చేసే దాన్ని పరివర్తకం (కెటలిస్ట్) అంటారు, శషభిష కూడా ఏ సందర్భంలో తనను ప్రయోగిస్తే ఆ సందర్భంలో ఇమిడిపోయి ఒక కొత్త అర్థాన్ని ఇస్తుంది. విస్తృతంగా, లోతుగా, వివరంగా భావాన్ని తేటతెల్లం చేసే అందమైన పదబంధం శషభిష.కుదురుగా వాడకంలోకి తెచ్చుకుంటే సొగసైన తెలుగుకు ఒక ఊతం అవుతుంది.

# తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవ సభ 21-02-2023
# విజయవాడ పి.బి.సిద్ధార్ధ కళాశాల సభామందిరం. సాయంత్రం 5 గం.



స్వాగతం పలుకుతున్న సమాఖ్య
సమావేశకర్త
డా.గంధం సుబ్బారావు



సమాఖ్య చేసిన ఉద్యమ కార్యక్రమాలను, సాధించిన విజయాలను
వివరిస్తున్న డా.సామల రమేష్‌బాబు



తెలుగు భాషోద్యమ సమాఖ్య స్థాపన
పూర్వాపరాలను వివరించి సమాఖ్య
కృషిని విశ్లేషించిన తెలుగు భాషోద్యమ
ప్రముఖులు డా.మండలి బుద్ధప్రసాద్



'అమ్మనుడి సంపాదకీయాల సమాహారం' పుస్తకాన్ని విడుదల చేస్తున్న
డా.మండలి బుద్ధప్రసాద్




ఆచార్య జోగాసింహ్ రచన "భాష-అంతర్జాతీయ భావన"
పుస్తకాన్ని విడుదలచేస్తున్న శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు




'అమ్మనుడి' వలగూడు వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న పెద్దలు



వందన సమర్పణ చేస్తున్న
సమాఖ్య సమావేశకర్త
డా. వెన్నిసెట్టి సింగారావు

తెలుగు భాషోద్యమ సమాఖ్య తలపెట్టిన సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటిస్తున్న సమాఖ్య జాతీయ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు; సమాఖ్య కేంద్ర కార్యవర్గాన్ని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యవర్గం ఈ ఉగాది నుండి రెండేళ్ళపాటు అమలులో వుంటుంది. సమాఖ్య వార్షిక క్యాలెండర్‌ను కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ క్యాలెండర్‌లో ప్రతియేటా నిర్వహించవలసిన ఆరు కార్యక్రమాలను సూచించారు. ఈ అన్ని వివరాలను లోపల పుటలలో చూడండి



అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
MARCH 2023 Vol :9, Issue 1
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244